www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
రంగారెడ్డి
VELTHURU TELUGU DAILY
# వెలుతురు
తెలుగు దినపత్రిక
శనివారం 5 జూలై 2025
సంపుటి :07 సంచిక : 39 , పేజీలు : 12 వెల:రూ.5/-



## పాశమైలారం సందర్శించిన సిఎస్ రామకృష్ణారావు బృందం

- సిగాచి ప్రమాద స్థలిని పరిశీలించిన హైలెవల్ కమిటీ
- ప్రమాద ఘటనలో మరొకరు ఆస్పత్రిలో మృతి

## ఆపరేషన్ సిందూర్...ముగ్గురితో యుద్ధం

- ఒక సరిహద్దు ఇద్దరు శత్రువులు
- పాక్‌కు మద్దతుగా చైనా, టర్కీల సాయం
- భారత్ బలగాల సమిష్టి విజయం ఇది
- డిప్యూటీ ఆర్మీ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ ఆర్ సింగ్



న్యూఢిల్లీ,జులై 4( వెలుతురు):
ఆపరేషన్ సిందూర్ సమయంలో ఒకేసారి మేడు దేశాలతో యుద్ధం చేయాల్సి వచ్చిందని భారత డిప్యూటీ ఆర్మీ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్

## రోశయ్య అరుదైన రాజకీయ వేత్త

- బడ్జెట్ సర్దుబాటులో ఆయనది అందెవేసిన చేయి
- 16సార్లు బడ్జెట్ సమర్పించిన ఘనత రోశయ్యది
- రోశయ్య జయంతి వేడుకల్లో స్పీకర్ ప్రసాద్ కుమార్

హైదరాబాద్,జులై 4( వెలుతురు):
దేశంలో ఒక రాష్ట్ర ఆర్థికమంత్రిగా అత్యధికంగా 16 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత రోశయ్యదని స్పీకర్ ప్రసాద్ కుమార్ అన్నారు. అప్పులు చేయకుండా ఉన్నంతలో బ్జడెట్ ను సర్దుబాటు చేయడంలో రోశయ్యది అందెవేసిన చెయ్యని అన్నారు. ముగ్గురు




# రైతు సంక్షేమంపై చర్చిద్దాం రండి

- ఢిల్లీలో ఉండే మోడి...గల్లీలో ఉండే కెడీ అయినా చర్చకు సిద్ధం
- కేవలం 9 రోజుల్లో 9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ
- ఏడాదిలో 60వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశాం
- ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ఘనత తమదే
- ఎల్బీ స్టేడియం సామాజిక సదస్సులో సిఎం రేవంత్

హైదరాబాద్,జులై 4( వెలుతురు):
ఈ నేపథ్యంలో రైతుల శ్రేయస్సు కోసం చేసిన పనులపై బహిరంగ చర్చకు రావాలని బీజేపీ, బీఆర్ఎస్ నేతలకు రేవంత్ సవాల్ చేశారు. రైతుల బాగు కోసం ఎవరు ఎంత చేశారో తేల్చుకునేందుకు రావాలని కోరారు. రైతుల కోసం 18 నెలల్లో రూ. 1.04లక్షల కోట్లు ఖర్చు చేశాం. వరి వేస్తే ఉరి వేసుకున్నట్టేనని గత సీఎం చెప్పారు.. 2.80 కోట్ల మెట్రిక్ టన్నుల వరిధాన్యం పండించి దేశానికే ఆదర్శంగా నిలిచాం. రైతుభరోసాలో ప్రభుత్వం విఫలమవుతుందని కొందరు ఎదురు చూశారు.. కానీ వారి ఆశ నెరవేరలేదు. రైతు రాజ్యం ఎవరు తెచ్చారో.. ఎక్కడైనా చర్చ చేసేందుకు సిద్ధం. చర్చకు ఎవరొస్తారో రండి.. కేసీఆర్, మోదీ, కిషన్‌రెడ్డి.. ఇలా ఎవరొచ్చినా సరే. కేసీఆర్‌ను ప్రశ్నిస్తున్నా.. పేదలు ఎప్పుడూ బర్రెలు, గొర్రెలు మేపుతూనే బతకాలా?కేసీఆర్, మోదీకి సవాల్ విసురుతున్నా. లెక్క కావాలంటే చెప్పండి.. అందర్నీ తీసుకొచ్చి స్టేడియంలో నిలబెట్టి లెక్కవేయిస్తా. 60వేలకు ఒక్కరు తక్కువ వచ్చినా కాళ్లు మొక్కి తప్పుకొంటా' అని రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో అనేక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంస్కరణలు, పథకాలను అమలు చేస్తోందన్నారు. అనేక కష్టాలు ఎదురైనప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం నిలబడి, సమస్యలను అధిగమించి, ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలను అందించే దిశగా పనిచేస్తోందన్నారు. ఈ క్రమంలో తెలంగాణ రైతులు ఈ ఏడాది 2 కోట్ల మెట్రిక్ టన్నుల రైస్‌ను ఉత్పత్తి చేసినట్లు సీఎం గుర్తు చేశారు. ప్రజా పాలనలో ఈ ధాన్యాన్ని కొనుగోలు చేసి, రైతులకు సరైన ధర అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కేవలం 9 రోజుల వ్యవధిలో రూ. 9 వేల కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఈ నిర్ణయంతో రైతులకు ఆర్థిక భరోసాను అందించడమే కాకుండా, వ్యవసాయాన్ని ఒక పండుగగా మార్చిందని రేవంత్ రెడ్డి తెలిపారు. రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ సరఫరా చేయడం ద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ



## కేంద్రంలో అధికారంలోకి వస్తాం..దేశాన్ని రక్షిస్తాం



- అబద్ధాల ప్రచారంలో మోడీ సిద్ధహస్తుడు
- విదేశీలు చుట్టే మోడీకి..మణిపూర్ వెళ్లే తీరిక లేదు
- తెలంగాణకు 11 ఏళ్లలో చేసింది శూన్యం
- కాంగ్రెస్ సామాజిక న్యాయ సమరభేరి సభలో ఖర్గే విమర్శలు

## ఆత్మాభిమానం మన ఆయుధం

- బ్రిటీష్ వారిని ఈ ఆయుధంతో గడగడలాడించిన అల్లూరి
- ఆయన జీవితం భావి తరలాకు స్ఫూర్తి కావాలి
- అల్లూరి జయంతి సభలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్



హైదరాబాద్,జూలై4( వెలుతురు):
చాలా మంది యోధులు చిన్న వయసులోనే స్వాతంత్య్రం కోసం ప్రాణాలు వదిలారని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. చంద్రశేఖర్ ఆజాద్, అల్లూరి సీతారామరాజు వంటి వాళ్ళు ఎంతోమంది తమ ప్రాణాలు వదిలారు.. భారత స్వాభిమానం, తెలుగు రాష్ట్రాల్లోగుర్తుగా నిలిచిపోయారు.. అల్లూరి కేవలం పోరాట యోధుడే కాదు ప్రజలు కోసం

## కెసిఆర్‌కు కొనసాగుతున్న చికిత్స

- ఆస్పత్రికి వచ్చిన కూతురు కవిత




# గ్రూపులు కడితే సహించబోము

- మీనాక్షితో అంతా సమన్వయం చేసుకోవాలి
- పార్టీ వ్యవహారాలపై బయట మాట్లాడరాదు
- కాంగ్రెస్ నేతలకు మల్లికార్జున ఖర్గే హెచ్చరిక
- మంత్రుల సమన్వయ లోపంపై సిఎం అసహనం
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపైనా నేతల చర్చ
- టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో వాడీవేడీగా చర్చ






హైదరాబాద్,జూలై4( వెలుతురు):
పార్టీలో అందరూ ఐక్యంగా ముందుకెళ్లాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సూచించారు. కొత్తపాత తేడా వద్దని.. త్వరలో అన్ని కమిటీల నియామకం పూర్తి చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణం, జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, స్థానిక ఎన్నికలపై గాంధీభవన్‌లో టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశమైంది. తొలుత పాశమైలారం

## తెలంగాణ ప్రయోజానాలపై రాజీపడం

- గతంలోనే పదవులను గడ్డిపోచల్లా వదిలేశాం
- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

హైదరాబాద్,జూలై4( వెలుతురు):
నాడైనా నేడైనా తెలంగాణ ప్రయోజనాల ముందు పదవులు బీఆర్ఎస్‌కు తృణప్రాయం అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. బనకచర్లతో ఏపీ అప్పనంగా నీళ్ళు దోచుకుపోతా



## ఇంత అధ్వాన్నంగా రోడ్డుంటే ఏం చేస్తున్నారు?

- బావూపేట రహదారిపై మోకాళ్ల లోతు నీటి నిల్వ
- కరీంనగర్ సిరిసిల్ల వెళ్లే ప్రయాణీకుల తీవ్ర అవస్థలు
- అటుగా వెలుతున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ రోడ్డు దుస్థితిపై ఆరా
- గత కొద్దిరోజులుగా ఇదే పరిస్థితి నెలకొందని వాపోయిన స్థానికులు, వాహనదారులు
- వరుస ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన
- వెంటనే జిల్లా కలెక్టర్, ఆర్ అండ్ బి అధికారులకు ఫోన్ చేసి కేంద్ర మంత్రి
- తక్షణమే రహదారిని బాగుచేయాలని ఆదేశం



కరీంనగర్ వెలుతురు జూలై 04:
అధికారిక కార్యక్రమాల్లో భాగంగా కరీంనగర్ నుండి సిరిసిల్ల జిల్లాకు వెళుతున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మార్గమధ్యలో బావూపేట రహదారిపై మోకాళ్ల లోతు నీళు ండటాన్ని చూసి బండి దిగారు. ఆ నీటిలో ప్రయాణం చేస్తూ అనేక ఇబ్బందులు పడుతున్న వాహనదారులను, ప్రయాణీకులను చూశారు. కేంద్ర మంత్రి ఆగడంతో



# జల్‌జీవన్ మిషన్‌కు అత్యంత ప్రాధాన్యం

- గత ప్రభుత్వం ఈ పథకాన్ని పట్టించుకోలేదు
- ప్రకాశం జిల్లాల్లో 1290 కోట్లతో ప్రాజెక్ట్
- మంచినీటి సమస్య తీర్చేందుకు ప్రత్యేక శ్రద్ధ
- వైకాపా బెదిరింపులకు భయపడేది లేదు
- వారు మళ్లీ అధికారంలోకి రావడం కల్ల
- ప్రకాశం జిల్లా పర్యటనలో డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్



ఒంగోలు,జూలై4( వెలుతురు):
గత జగన్ ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్‌ను పట్టించుకోలేదని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆరోపించారు. దీంతో గ్రామాలకు శుద్ధజలాలన్ని అందించే అవకాశం లేకుండా పోయిందని అన్నారు. అలాగే గత వైసీపీ ప్రభుత్వంలో ప్రకాశం జిల్లాని అభివృద్ధి చేయకుండా పూర్తిగా నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. వెలుగొండ ప్రాజెక్ట్ పనులని పూర్తిగా నిర్లక్ష్యంగా గాలికి వదిలి వేశారని విమర్శించారు. గత పాలకులు రౌడీయిజం, గుండాయిజంలను మాత్రమే నమ్ముకున్నారని ధ్వజమెత్తారు. శుక్రవారం ప్రకాశం జిల్లాలోని

(మొదటి పేజీ తరువాయి..)

## పాశమైలారం సందర్శించిన సిఎస్ రామకృష్ణారావు బృందం

సంగారెడ్డి,జూలై4( వెలుతురు):
పాశమైలారంలోని సిగాచి ప్రమాద ఘటనా స్థలిని సీఎస్ రామకృష్ణ రావు నేతృత్వంలోని హై లెవెల్ కమిటీ పరిశీలించింది. ప్రమాద స్థలిని హైలెవల్ కమిటీ సభ్యులు పరిశీలించారు. కమిటీకి చైర్మన్‌గా సీఎస్ రామకృష్ణ రావు, సభ్యులుగా రెవెన్యూ, ఇండస్ట్రీ చీఫ్ సెక్రటరీలతో పాటు కార్మిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఫైర్ డీజీ, ఆరోగ్యశాఖ కార్యదర్శి ఉన్నారు. ఘటనా స్థలిని పరిశీలించిన తర్వాత బాధిత కుటుంబాలతో కమిటీ మాట్లాడింది. సిగాచి యాజమాన్యంతో కూడా మాట్లాడి వివరాలను సేకరించనుంది. ఇక ప్రమాద స్థలిని గురువారం నిపుణుల కమిటీ పరిశీలించిన విషయం తెలిసిందే. సుమారు మూడు నాలుగు గంటల పాటు నిపుణుల కమిటీ విచారించింది. టెక్నికల్ అంశాలపై నిపుణుల కమిటీ నెలరోజుల్లో ప్రభుత్వానికి (÷గ్గ÷జీనిణజీనిజీ ఉనీలబి) నివేదిక ఇవ్వనుంది. మరోవైపు ఈ ప్రమాద ఘటనలో మరొకరు మృతి చెందారు. దీంతో సిగాచి ఘటనలో మృతుల సంఖ్య 39కి చేరింది. సిగాచి పరిశ్రమలో తీవ్రంగా గాయపడి ధ్రువ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భీమ్ రావు అనే వ్యక్తి శుక్రవారం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. భీరామ్ స్వస్థలం మహారాష్ట్ర. పోస్టుమార్టం అనంతరం భీమ్ రావు మృతదేహాన్ని స్వస్థలానికి పంపించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రమాద స్థలిలో ఐదవ రోజు కూడా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఇక సిగాచి పరిశ్రమలో పేలుడు ఘటనపై జిల్లా కలెక్టర్ ప్రావీణ్య కీలక ప్రకటన చేశారు. ఈ ప్రమాదం నుంచి 61 మంది సురక్షితంగా బయటపడ్డారని తెలిపారు. ఈ దుర్ఘటనలో 38 మంది మృతి చెందారని.. అందులో ఇప్పటి వరకు 31 మృతదేహాలను గుర్తించామని వెల్లడించారు. ఇంకా 7 మృతదేహాలను గుర్తించాల్సి ఉందన్నారు. ఆస్పత్రి నుంచి ఇప్పటి వరకు 12 మంది డిశ్చార్జ్ అయ్యారని.. ప్రస్తుతం ఆస్పత్రులలో 23 మంది చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. అలాగే ఇంకా 9 మంది ఆచూకీ లభించలేదని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ప్రకటించారు. వీరి కోసం ఘటనా స్థలిలో రెస్క్యూ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోంది. సిగాచి పరిశ్రమ వద్ద బాధితుల ఆందోళన కొనసాగుతోంది. ఐదు రోజులు గడిచినప్పటికీ తమ వారి ఆచూకీ తెలియడం లేదంటూ వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వారితో పాటు ఏపీ రాష్ట్రంలోని శ్రీకాకుళంకు చెందిన ఓ కుటుంబం కూడా నిరీక్షిస్తోంది.

## రోశయ్య అరుదైన రాజకీయ వేత్త

ముఖ్యమంత్రుల పరిపాలనలో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు నిధుల కొరత లేకుండా సర్దుబాటు చేసిన ఘనత రోశయ్య గారిదని అన్నారు. నిండైన తెలుగు తనానికి ప్రతిరూపం రోశయ్య అని,. పంచెకట్టు, భుజంపై పై పంచెతో ఆకట్టుకునే ఆహార్యం రోశయ్యదని అన్నారు. స్వర్గీయ కొణిజేటి రోశయ్య 92వ జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆద్వర్యంలో రవీంద్రభారతిలో జరిగిన సభలో తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ చైర్మన్లు, నాయకులు, వైశ్య సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. సభా వేదికపై బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుని ప్రముఖులు సన్మానించారు. .ఈసందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ... స్వర్గీయ కొణిజేటి రోశయ్య జయంతిని అధికారికంగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సంతోషం. గొప్ప రాజకీయ నేతకు దక్కిన గౌరవంగా భావిస్తున్నామని అన్నారు. ఇలాంటి మంచి నిర్ణయం తీసుకున్నందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర మంత్రి వర్గ సభ్యులకు నా అభినందనలు తెలుపుతున్నానని అన్నారు అదేవిధంగా ఈరోజు వారి విగ్రహాన్ని నెలకొల్పి ఆవిష్కరించడం ద్వారా రోశయ్య గారి గొప్పతనాన్ని భవిష్యత్తు తరాలకు వారి తెలియజేయడం జరిగిందన్నారు. ఇక వాక్పటిమ, వాగ్దాటి, చతురతలో రోశయ్య గారితో ఇంకొకరిని పోల్చలేం. కాంగ్రెస్ ప్రభుత్వంలో గవర్నర్ గా నియామకం అయ్యి బిజేపి ప్రభుత్వంలో కూడా కొనసాగిన అరుదైన వ్యక్తులలో రోశయ్య గారు ఒకరు. రాజకీయ విభేదాలు ఉండవచ్చు కానీ వ్యక్తిగతంగా అందరికీ ఆజాత శత్రువు రోశయ్య గారని అన్నారు. రోశయ్య గారిది మన తెలంగాణ ప్రాంతం కాకపోయినా వారిని మనం గౌరవించడానికి కారణం మన భారతీయ సంస్కృతి, సాంప్రదాయం ప్రకారం వారి పెద్దరికానికి గౌరవం ఇవ్వడమేనని అన్నారు. రోశయ్య గారు శాసనసభలో మాట్లాడుతుంటే స్వపక్షంతో పాటుగా విపక్షాలు కూడా ఏకాగ్రతతో వినేవాళ్ళు. యువ, నూతన శాసన సభ్యులకు రోశయ్య గారి ప్రసంగం ఒక పుస్తకం. 2008 ఉప ఎన్నికలలో నేను మొదటిసారి శాసనసభ్యునిగా ఎన్నికై అసెంబ్లీకి వచ్చినప్పుడు సమావేశాలో రోశయ్య గారి ప్రసంగాలను ప్రత్యేక్షంగా వినే భాగ్యం కలిగింది, వారి ప్రసంగాలకు నేను అభిమానిని.వారి నుండి నేను ఎన్నో విషయాలను నేర్చుకున్నాను. నేటి యువ రాజకీయ నాయకులు రోశయ్య గారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచిస్తున్నానని గడ్డం ప్రసాద్ అన్నారు.

## ఆపరేషన్ సిందూర్...ముగ్గురితో యుద్ధం

రాహుల్ ఆర్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ ఆపరేషన్ సింధూర్ నిర్వహించిన సమయంలో పాకిస్థాన్‌కు చైనా, టర్కీలు మద్దతుగా నిలిచాయన్నారు. శుక్రవారం న్యూఢిల్లీలో ఫిక్కీ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యూ ఏజ్ మిలటరీ టెక్నాలజీస్ అనే అంశంపై లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ ఆర్ సింగ్ మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ నిర్వహించిన సమయంలో పాకిస్థాన్‌ను చైనా ఎప్పటికప్పుడు సమాయత్తం చేసిందన్నారు. భారత్‌కు ఒక సరిహద్దు.. ఇద్దరు శుత్రువులు ఉన్నారన్నారు. కానీ నిజానికి ముగ్గురు శత్రువులు అని ఆయన వివరించారు. అందులో పాకిస్థాన్ ముందు వరుసలో ఉందని పేర్కొన్నారు. పాకిస్థాన్‌కు చైనా అన్ని విధాలుగా మద్దతు ఇస్తుందన్నారు. పాకిస్థాన్ మిలటరీ వినియోగిస్తున్న హార్డ్‌వేర్‌లో 81 శాతం చైనాకు చెందినవేనని ఈ సందర్భంగా ఆయన సోదాహరణగా వివరించారు. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతల నడుమ భారత్‌పై పాక్ నిర్వహించిన దాడుల్లో చైనా తన ఆయుధాలను పరీక్షించుకుందని చెప్పారు. అదే సమయంలో పాకిస్థాన్‌కు టర్కీ సైతం అదే తరహాలో సహాయం చేసిందన్నారు. ఈ యుద్ధంలో టర్కీ పైలట్లు నేరుగా పాల్గొన్నారని వివరించారు. పాక్, చైనాను ఎదుర్కొవడానికి బలమైన వాయు రక్షణ వ్యవస్థ ఉండాల్సిన ఆవశ్యకతను ఈ సందర్భంగా ఆయన నొక్కి చెప్పారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాద స్థావరాలను గుర్తించి.. వాటిని ధ్వంసం చేయడంలో కీలక పాత్ర పోషించిన భారత సైనిక బలగాలను ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు. అలాగే ఈ ఆపరేషన్ సిందూర్ వల్ల కొన్ని పాఠాలను సైతం నేర్చుకున్నామని చెప్పారు. మానవ మేథస్సుతోపాటు సాంకేతిక ద్వారా లెక్కలేనంత సమాచారాన్ని సేకరించి.. ఈ దాడులు నిర్వహించామని లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ ఆర్ సింగ్ వివరించారు. గతంలో మాత్రం ఇలా సమాచారాన్ని సేకరించడంలో కొంత ఇబ్బందులు ఎదుర్కొన్న మాట మాత్రం వాస్తవమన్నారు. అయితే పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో 21 లక్ష్యాలను గుర్తించి.. వాటిలో తొమ్మిది స్థావరాలను ధ్వంసం చేశామన్నారు. అందుకు చివరి రోజు.. చివరి నిమిషంలో ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన వివరించారు. త్రివిధ దళాలు ఐక్యత కారణంగానే ఇది సాధ్యమైందన్నారు. ఎప్రిల్ 22వ తేదీన జమ్మూ కశ్మీర్‌లోని పహల్గంలో పర్యాటకులే లక్ష్యంగా జరిగిన ఉగ్రదాడిలో 26 మంది మరణించారు. ఈ ఘటనకు తామే బాధ్యులమంటూ లష్కరే తోయిబాకు చెందిన ది రిసిస్టెన్స్ ఫ్రెంట్ ప్రకటించింది. దీంతో ఈ ఘటనకు కర్త, కర్మ, క్రియా అంతా పాకిస్థాన్ అని భారత్ నమ్మింది. దీంతో పాక్‌కు వ్యతిరేకంగా భారత్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. అదే సమయంలో పాక్ సైతం భారత్‌కు వ్యతిరేకంగా పలు నిర్ణయాలు తీసుకుంది. ఇక పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలే లక్ష్యంగా భారత్ ఆపరేషన్ సిందూర్ నిర్వహించింది. ఆ క్రమంలో తొమ్మిది స్థావరాలను ధ్వంసం చేసి.. 100 మందికి పైగా ఉగ్రవాదులును హతమార్చిన సంగతి తెలిసిందే.

## కెసిఆర్‌కు కొనసాగుతున్న చికిత్స

హైదరాబాద్,జూలై4( వెలుతురు):
బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును ఆయన కూతురు కవిత పరామర్శించారు. స్వల్ప అనారోగ్యంతో హైదరాబాద్‌లోని సోమాజీగూడ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తండ్రిని చూసేందుకు కవిత శుక్రవారం వచ్చారు. కవిత ఆస్పత్రికి వెల్లి కేసీఆర్‌ను పరామర్శించారు. అనంతరం చికిత్స అందిస్తున్న వైద్యులతో ఆమె మాట్లాడారు. గురువారం సాయంత్రం కేసీఆర్ అస్వస్థతకు గురికావడంతో వైద్యుల సలహాతో ఆస్పత్రిలో చేరారు. అనంతరం వైద్య బృందం ఆయనకు ప్రాథమిక పరీక్షలు నిర్వహించింది. వీటిలో బ్లడ్ షుగర్ స్థాయిలు ఎక్కువగా ఉండటం, సోడియం స్థాయిలు తగ్గినట్టు గుర్తించారు. దీనిని నియంత్రించేందుకు అవసరమైన వైద్యసహాయం అందిస్తున్నట్లు వైద్యులు పేర్కొన్నారు. ఆయన ఆరోగ్యంపై గురువారం రాత్రి వైద్యులు హెల్త్ బులిటెన్ విడుదల చేశారు. 'కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగానే ఉంది. నిశితంగా పర్యవేక్షణ కొనసాగుతోందని హెల్త్ బులిటెన్‌లో వివరించారు.

# రైతు సంక్షేమంపై చర్చిద్దాం రండి

ప్రభుత్వం సామాజిక న్యాయం, రైతు సంక్షేమం, ఆర్థిక పునరుద్ధరణ కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మూడు రంగుల జెండా చేతబూని కల్వకుంట్ల గడీని బద్దలు కొట్టామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రతి గుండెను తడుతూ ప్రజాపాలన సాగిస్తున్నామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లు పెరగబోతున్నాయని.. మహిళలకు రిజర్వేషన్లు అమలు కానున్నాయని చెప్పారు. కార్యకర్తలకు అన్ని పదవులు దక్కే వరకూ విశ్రాంతి తీసుకోబోనని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో 100 అసెంబ్లీ సీట్లు గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తామని.. దాని కంటే ఒక్క సీటు తక్కువ వచ్చినా తనదే బాధ్యతని చెప్పారు. 'కాంగ్రెస్ నేతలు కలిసి ఉండలేరని.. ఈ పాలన మూణ్నాళ్ల ముచ్చటే అని కొందరు అన్నారు. కానీ.. పార్టీ నేతలంతా ఐకమత్యంతో పనిచేస్తూ ఆ అపోహలను పటాపంచలు చేశారు. జనగణనతో పాటు కులగణన.. ఎస్సీ వర్గీకరణ చేస్తామని గతంలో రాహుల్‌గాంధీ మాటిచ్చారు. హామీ ఇచ్చినట్టుగానే ఏడాదిలోపే కులగణన, ఎస్సీ వర్గీకరణ చేసి చూపించాం. 18 నెలల్లో దేశానికే ఆదర్శంగా నిలిచేలా తెలంగాణ మోడల్ ఆవిష్కరించాం. కష్టాలు, ఒడిదొడుకులు వచ్చాయి.. అన్నీ అధిగమించి ముందుకెళ్తున్నాం. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దీంతోపాటు అనేక మంది కాంగ్రెస్ నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### కేంద్రంలో అధికారంలోకి వస్తాం..దేశాన్ని రక్షిస్తాం

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినట్లే.. కేంద్రంలో సైతం కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు తీరుతుందని ఏఐసీసీ అధ్యక్షులు, ఎంపీ మల్లికార్జున్ ఖర్గే విశ్వాసం వ్యక్తం చేశారు. దేశరక్షణ కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని ఆయన పురుద్ఘాటించారు. విదేశాలు తిరుగుతున్న మోడీ, మణిపూర్‌కు మాత్రం ఇప్పటి వరకు వెళ్లలేదని అన్నారు.శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయ సమరభేరి సభలో భాగంగా పార్టీ నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ.. దేశ ప్రజలకు ప్రధాని మోదీ చెప్పేవన్నీ అబద్ధాలేనన్నారు. దేశానికి ప్రధాని మోదీ, కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా చాలా చాలా చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కానీ వాళ్లు ఈ దేశానికి, తెలంగాణకు చేసిందేమిటని సూటిగా ప్రశ్నించారు. నెహ్రూ, ఇందిరాగాంధీ హయాంలోనే ఈ ప్రాంతం అభివృద్ధి చెందిందన్నారు. ఇప్పటి వరకు ప్రధాని మోదీ 42 దేశాలు తిరిగారని గుర్తు చేశారు. కానీ ప్రజలు చనిపోతున్నా.. మణిపూర్ మాత్రం ఆయన వెళ్లలేదని మండిపడ్డారు. పాకిస్థాన్‌ను ఏదేదో చేస్తామని మోదీ ప్రభుత్వం ప్రకటించార న్నారు. కానీ ఎందుకు ఏం చేయలేదని మోదీ ప్రభుత్వాన్ని ఆయన నిలదీశారు. పాకిస్తాన్‌పై యుద్ధం చేయకుండా.. మిమ్మల్ని ఎవరు ఆపారంటూ సందేహం వ్యక్తం చేశారు. పలహ్గాం ఘటన తరవాత ఆపరేషన్ సింధూర్‌కు కాంగ్రెస్ మద్దతు ప్రకటించిందని గుర్తు చేశారు. దేశ ఆర్థిక పరిస్థితిని ప్రధాని మోదీ చిన్నాభిన్నం చేశారు. పాకిస్థాన్‌తో యుద్ధం చేయాలని 'ఆపరేషన్ సిందూర్'కు రాహుల్‌గాంధీతో పాటు కాంగ్రెస్ కూడా సంపూర్ణ మద్దతు ఇచ్చింది. మరి మోదీ ఎందుకు యుద్ధాన్ని మధ్యలోనే ఆపేశారు? అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఫోన్ చేయగానే యుద్ధం ఆపేశారు.. కానీ ఆ విషయంపై ప్రధాని నోరు విప్పరు. మణిపుర్ ఈ దేశంలో భాగం కాదా? మణిపుర్ వాసులు భారతీయులు కాదా?అఖిలపక్ష సమావేశానికి ప్రధాని రాలేదు.. బిహార్ ఎన్నికల ప్రచారంలో ఆయన బిజీగా ఉన్నారు' అని ఖర్గే విమర్శించారు. ప్రధాని మోదీలాగా ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు భయపడ లేదన్నారు. ఎవరు వచ్చినా బంగ్లాదేశ్‌కు స్వాతంత్ర్యం కల్పిస్తామని ఇందిరాగాంధీ ప్రకటించారని.. అదే పని ఆమె చేసి చూపించారన్నారు. క్షమాపణలు చెప్పడమే బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల పని అంటూ అయన ఎద్దేవా చేశారు. రాజ్యాంగం నుంచి లౌకిక అనే పదాన్ని తీసి వేయాలని బీజేపీ చూస్తోందని విమర్శించారు. సెక్యులర్ అనే పదం రాజ్యాంగంలోనే లేదని బీజేపీ చెపుతుందన్నారు. ÷ూజ్యాంగం నుండి లౌకిక పదాన్ని తీసేయారని తాను చాలెంజ్ చేస్తున్నానని ఈ సందర్భంగా ఖర్గే ప్రకటించారు. సెక్యులర్ అనే పదం బీజేపీ ప్రణాళికలో రాసుకున్నారని వివరించారు. సెక్యులర్ అనే పదంతో మీకు ఇబ్బంది ఉంటే మీ పార్టీ ప్రణాళిక నుంచి తీసివేయాలని బీజేపీ అగ్రనేతలకు ఖర్గే బహిరంగ సవాల్ విసిరారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కష్టపడి పని చేశారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలిచిందంటే.. అది కార్యకర్తల కృషి ఫలితమేనని స్పష్టం చేశారు. రేవంత్, భట్టి, మంత్రులు కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేశారన్ని వివరించారు. కేసీఆర్, బీజేపీ కలిసి తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని అడ్డుకుంటున్నారన్నారు. కానీ తెలంగాణ ప్రజలు మాత్రం ఈ రెండు పార్టీలను ఓడించారని గుర్తు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని గతంలో తాను చెప్పానని వివరించారు. కాంగ్రెస్ హయాంలోనే తెలంగాణలో 50కిపైగా కేంద్ర సంస్థలు వచ్చాయని గుర్తు చేశారు. తెలంగాణకు ఈ 11 ఏళ్లలో ఏం ఇచ్చారంటూ ప్రధాని మోదీని ఈ సందర్భంగా ఖర్గే సూటిగా ప్రశ్నించారు. గతంలో రైతులు, మహిళలు, నిరుద్యోగులను కేసీఆర్ మోసం చేశారు. ప్రధాని మోదీ, అమిత్‌షా అబద్దాలు చెప్పి కేంద్రంలో అధికారంలోకి వచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం. హైదరాబాద్‌కు మోదీ చేసింది శూన్యం. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పేదలకు సన్నబియ్యం అందిస్తోంది. రైతు భరోసా కింద రైతుల ఖాతాల్లో రూ.8,200 కోట్లు జమ చేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేరుస్తోంది. గిగ్ వర్కర్ల హక్కుల కోసం రాష్ట్ర ప్రభుత్వం చట్టం తీసుకొస్తోంది. దేశంలో తొలిసారి కులగణన చేపట్టింది తెలంగాణ ప్రభుత్వమే. బీసీల రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ పార్టీ పనిచేస్తోందన్నారు.

# ఆత్మాభిమానం మన ఆయుధం

అన్ని కోల్పోయిన నాయకుడు గుర్తుకు వస్తాడని అన్నారు. ఎలాంటి ఆయుధాలు లేని సమయంలో గిరిజనులను ఏకం చేసి బ్రిటిషర్లపై పోరాడిన వీరుడని అన్నారు. సాంస్కృతిక ఆత్మ భారతదేశాన్ని ఐక్యంగా ఉంచుతుంది.. అల్లూరి పేరు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కే కాదు దేశం మొత్తం గుర్తింపు ఉంది.. ఆడవుల నుంచి పుట్టిన పోరాటాలు ఇప్పటికీ గుర్తున్నాయి.. దశాబ్దాల పోరాటాలకు ఆయన మార్గదర్శనం చేశారు.. అడవుల్లో ఆయన పోరాటాలు బ్రిటిష్ వారిని వణికించాయి.. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా తప్పనిసరి పరిస్థితుల్లో ఆయుధాలు ఎత్తాల్సి వచ్చింది అని రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. ఆనాటి బ్రిటిష్ పాలకులు ఇక, గిరిజనులపై, వారి భూమి పై ఆంక్షలు విధించారని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. గౌరవంగా జీవించుదామని అల్లూరి సీతారామరాజు పిలుపు ఇచ్చారు.. అల్లూరి సీతారామరాజు జీవించిన ప్రాంతాలను కేంద్రం అభివృద్ధి చేస్తుందని అన్నారు. జాతి నిర్మాణంలో గిరిజనుల పాత్ర మరువలేనిది.. ఆదివాసీలను సాధారణ జనజీవనంలోకి తీసుకుని రావాల్సిన అవసరం ఉంది.. 50, 000లకు పైగా ఆదివాసీ గ్రూపులను ఏర్పాటు- చేశాం.. మొదటి సారి గిరిజన మహిళను రాష్ట్రపతి చేశాం.. అల్లూరి సీతారామరాజు సంకల్పాన్ని ప్రతి గ్రామం, ఇంటికి తీసుకుని వెళ్దామని రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో క్షత్రియ సేవా సమితి భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో రాజ్‌నాథ్ మాట్లాడారు. గిరిజనుల కోసం అల్లూరి సీతారామరాజు అనేక పోరాటాలు చేశారని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. గెరిల్లా యుద్ధ నైపుణ్యాలతో బ్రిటిష్ వారితో ఆయన పోరాడారని గుర్తుచేశారు. భారత్ కోసం అల్లూరి సీతారామరాజు లాంటి గొప్ప వీరుడిని ఆంధ్రప్రదేశ్ ఇచ్చింది. అడవి నుంచి విప్లవం పుట్టించి బ్రిటిష్ వారిని గజగజలాడించిన వ్యక్తి అల్లూరి అన్నారు. గెరిల్లా యుద్ధ నైపుణ్యాలతో ఆధునిక ఆయుధాలకు వ్యతిరేకంగా పోరాడిన ధీశాలి ఆయన. బానిసత్వంతో కాదు ఆత్మాభిమానంతో బతకాలనేది ఆయన నుంచి మనం నేర్చుకోవాలి. అడవి బిడ్డల కోసం అల్లూరి వీరోచిత పోరాటం చేశారు.

ఆయన పుట్టిన గ్రామాన్ని పర్యటక ప్రాంతంగా తీర్చి దిద్దుతున్నామని అని రాజ్‌నాథ్ అన్నారు. బాలికల చదువు కోసం పాఠశాల ల అభివృద్ధి జరుగుతుంది.. 108 సూర్య నమస్కారాలు కేవలం దేహం దారుఢ్యం కోసం కాదు.. మానసిక అభ్యున్నతికి ఉపయోగపడతాయి.. క్రమంగా అడవులు నక్సల్స్ కు అడ్డంగా మారాయి.. ఇప్పుడు నక్సల్స్ పూర్తిగా తుడిచిపెట్టుకు పోతున్నాయి..ద

ఆగస్టు 2026లోపే నక్సల్స్ ను తుడిచి పెట్టేస్తాం.. నక్సల్స్ చేతిలో బంధీగా ఉన్న ప్రాంతాల్లో ఇప్పుడు అభివృద్ధి వేగంగా జరుగుతోంది.. వేగంగా గ్రోత్ కారిడార్ లుగా అభివృద్ధి చెందుతున్నాయి.. కనీసం నెట్వర్క్ లేకపోయేది.. టీ-వీలు, ల్యాప్ టాప్ లు, మొబైల్ టవల్ లు కూడా లేకుండాపోయాయి..

8 వేల టవర్లను ప్రారంభించేం దుకు సిద్ధం గా ఉన్నాయని రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. పహెల్గామ్ లో దాడి తరువాత ఆపరేషన్ సింధూర్ తో ధైర్యం, ధర్మం, ఖర్మను పరిచయం చేశామని రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పుకొచ్చారు. రామాయణంలో హనుమంతుడు చేసిన పనే ఇప్పుడు మనం చేశాం.. మనల్ని ఎవరు చంపారో వారిని మాత్రమే చంపాం.. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరిగితే తగిన సమాధానం చెబుతాం.. న్యాయం అందిరికీ సమానంగా దక్కాలి.. హనుమాన్ స్ఫూర్తిగా 'ఆపరేషన్ సిందూర్' కొనసాగిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. పాకిస్థాన్‌తో పాటు- ప్రపంచానికి మనం బలమేంటో చూపించామన్నారు. పాక్ ఉగ్ర స్థావరాలను టార్గెట్ చేశాం తప్ప.. పౌరులను కాదని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రులు షెకావత్, కిషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గ్రూపులు కడితే సహించబోము

ఘటనపై నేతలు సంతాపం తెలిపారు. అనంతరం బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం చేపట్టిన చర్యలపై చర్చించారు. జై బాపు-జై భీమ్-జై సంవిధాన్ కార్యక్రమాలపై సమాలోచనలు చేశారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్‌రెడ్డి , కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, టీ-పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ పార్టీకి సంబంధించిన అంశాలపై బయట ఎలాంటి విమర్శలు చేయొద్దని.. ప్రతిపక్షాలకు అవకాశం ఇవ్వొద్దని సూచించారు. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ సమన్వయం చేయాలని దిశానిర్దేశం చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని కొందరు కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేల వ్యవహార శైలిపై సీరియస్ అయ్యారు. నలుగు రైదుగురు గ్రూపులు కడితే భయపడతారు అనుకుంటున్నారా..? అని ప్రశ్నించారు. ఇష్టారాజ్యంగా వ్యవహరించే నేతలను రాహుల్ గాంధీ.. నేను పట్టించుకోమని తేల్చి చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రులపై మరోసారి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా మంత్రులు నిర్లక్ష్యంగా ఉంటున్నారని సీఎం వ్యాఖ్యానించారు. సీనియర్ నేత వి.హనుమంతరావు మాట్లాడుతూ కొత్త, పాత నేతల మధ్య సమన్వయం లేదన్నారు. కొత్తగా వచ్చినవారు పాతవారితో కలిసి వెళ్తే పార్టీ బలం పెరుగుతుందని చెప్పారు. జూబ్లీహిల్స్ ఎన్నికపై దృష్టి పెట్టాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ఉప ఎన్నికలో మూడు పార్టీలు కలిసి బరిలోకి దిగుతాయని చెప్పుకొచ్చారు. ఉప ఎన్నికను సమర్థవంతంగా ఎదుర్కొవాలని దిశానిర్దేశర చేశారు. ఇన్‌చార్జీ మంత్రులు ప్రతి అంశాన్నీ సీరియస్‌గా తీసుకోవాలని ముఖ్యమంత్రి మార్గనిర్దేశర చేశారు. క్రమశిక్షణ విషయంలో సీరియస్‌గా ఉండాలని ఆదేశించారు. కాంగ్రెస్ పార్టీ పదవులు వెంటనే భర్తీ చేయాలన్నారు. పార్టీ కమిటీల్లో అన్ని సామాజిక వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రమశిక్షణ విషయంలో సీరియస్‌గా ఉండాలని హుకుం జారీ చేశారు. పార్టీ పదవులు భర్తీ చేయడంలో టీ-పీసీసీ చీఫ్ ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు.

లోకల్ బాడీ ఎన్నికల్లో నేషనల్ నరేటివ్ బిల్డప్ చేసుకోవాలని సూచించారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు ఇచ్చేందుకు సాధ్యమైనంత వరకు ప్రయత్నం చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. దేశంలోనే అన్నిరాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. కేందప్రభుత్వం మెడలు వంచి జనగణనలో కులగణన చేసేలా చేయడంలో మనం విజయం సాధించామని వ్యాఖ్యానించారు. విద్య, ఉద్యోగ, ఉపాధి కల్పనలో మనం చాలా విజయాలు సాధించామని చెప్పుకొచ్చారు. తాను టీ-పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో 45 లక్షల మందితో క్రియాశీలక సభ్యత్వం చేయించానని గుర్తుచేశారు. యూత్ కాంగ్రెస్, కీఓ, పార్టీ జిల్లా అధ్యక్షుల్లో చాలా మందికి కాంగ్రెస్ ప్రభుత్వంలో పదవులు వరించాయని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

## జల్‌జీవన్ మిషన్‌కు అత్యంత ప్రాధాన్యం

మార్కాపురంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటించారు. మార్కాపురం మండలం నరసింహాపురం వద్ద రూ. 1290 కోట్లతో జల్ జీవన్ మిషన్ పనులకి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భారీ బహిరంగ సభలో పవన్ కల్యాణ్ ప్రసంగించారు. తమ ప్రభుత్వం కక్ష తీర్చుకునేది కాదని... తప్పులు చేస్తే శిక్షించే ప్రభుత్వమని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. వ్యక్తిగతంగా తనకు ఎవరిపైనా కోపం లేదని చెప్పుకొచ్చారు. కుత్తుకలు కోస్తాం అనే వైసీపీ తాటాకు చప్పుళ్లకు భయపడమని అన్నారు. మళ్లీ అధికారంలోకి ఆ పార్టీ నేతలు ఎలా వస్తారో చూద్దామని చెప్పారు. వైసీపీకి 151 సీట్లు వచ్చి... తాను రెండు చోట్ల ఓడినప్పుడు కూడా వారిని ఎదిరించానని గుర్తుచేశారు. సినిమా డైలాగులు నిజజీవితంలో బాగుండవని చెప్పుకొచ్చారు. తలదించుకుని పనిచేస్తున్న వారిని రెచ్చగొట్టవద్దని హితవు పలికారు. సామాన్యులను బెదిరించడం వల్లే వైసీపీకి ఈ దుస్థితి వచ్చిందని పవన్ కల్యాణ్ విమర్శించారు. 'నేను ప్రభుత్వ ఉద్యోగి కొడుకును కాబట్టి ప్రకాశం, నెల్లూరుతో సహా ఐదారు జిల్లాలో తిరిగాను. నెల్లూరులో నాకు ఇంటర్‌మీడియట్ సీట్ ఆనం వివేకానంద రెడ్డి ఇప్పించారు. ప్రకాశం జిల్లా అంటే గుర్తుకు వచ్చేది ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు. సైమన్ కమిషన్‌కి ఎదురొడ్డి నిలిచిన ధైర్యవంతుడు ప్రకాశం పంతులు. ప్రకాశం జిల్లాలో అపారమైన ఖనిజాలు ఉన్నాయి. జగన్ హయాంలో అభివృద్ధిలో ఈ జిల్లాని పూర్తిగా నిర్లక్ష్యానికి గురిచేశారు. దశాబ్దాలుగా వెలుగొండ ప్రాజెక్ట్ పూర్తి చేయలేదు. ఒంగోలులో రెండు సంవత్సరాలు, కనిగిరిలో ఆరు నెలలు మేము ఉన్నాం. కనిగిరిలో ఫ్లోరైడ్ సమస్యతో అక్కడి నుంచి మేము వెళ్లిపోయాం.



జల్ జీవన్ పనులు మొదటి ప్రయారిటీ ప్రకాశం జిల్లాకి ఇచ్చామని అన్నారు. ప్రకాశం జిల్లాలో తాగునీటి సమస్య పరిష్కరించడమే ప్రధాన లక్ష్యం. వెలిగొండ ప్రాజెక్టుకు రూ.4 వేల కోట్లు కావాలి. జల్ జీవన్ మిషన్ పథకాన్ని ఆపేస్తున్నామని కేంద్రం మాకు చెప్పింది. నీళ్లు ఇవ్వడం అన్నది రాష్ట్రానికి సంబంధించింది. కేంద్ర మంత్రి పాటిల్‌ను కలిసి అన్ని విషయాలు వివరించా. నీటి ఎద్దడి ప్రాంతాలకు రూ.84 వేల కోట్లు అవసరమవుతాయని చెప్పాం. ప్రస్తుతం జల్ జీవన్ మిషన్ మొదటి విడత రూ.1,290 కోట్లతో శంకుస్థాపన చేసుకున్నాం. స్వాతంత్య్రం వచ్చాక తొలిసారిగా ప్రకాశం జిల్లాలో అతిపెద్ద తాగునీటి పథకమిదే. దాదాపు 10 లక్షలకు పైచిలుకు జనాభాకు తాగునీటిని అందించబోతున్నాం అని వివరించారు. గత పాలకులు రూ.లక్షల కోట్లు అప్పులు పెడితే వాటన్నింటిని తట్టుకుని ఇవాళ ముందుకెళ్తున్నాం. వారి హయాంలో ఎలాంటి తాగునీటి పథకం చేపట్టలేదు. ఎన్నికల ముందు శిలాఫలకాలు వేసేందుకే పరిమితమయ్యారు. కూటమి ప్రభుత్వం వచ్చాక జల్‌జీవన్ మిషన్ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తున్నాం. సకాలంలో నిధులు వస్తే 18 నుంచి 20 నెలల్లో పూర్తి చేస్తాం. నేను ప్రత్యేకించి ఈ పథకాన్ని పర్యవేక్షిస్తా. లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయం భూములు దోచుకోవాలనుకుంటే అంతే సంగతి. వైకాపా హయాంలో ఎక్కడ ఖాళీ భూములు కనిపించినా వాటిని దోచేశారు. ఆక్రమణకు గురైన ఆలయాల భూములను తిరిగి వెనక్కి తీసుకునే పక్రియ ప్రారంభించాం. వాటికి రక్షణ కల్పించే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుందని పవన్ కల్యాణ్ అన్నారు. కార్యక్రమంలో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, డోలా బాలవీరాంజనేయ స్వామి, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఏం ఉద్ధరించారని సభ పెడుతున్నారు?





- 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఒక్క బీసీకైనా ప్రధాని పదవిచ్చారా?
- అర్ధశతాబ్ద కాంగ్రెస్ పాలనలో ఏనాడైనా బీసీని సీఎం చేశారా?
- దళిత, బడుగు, బలహీనవర్గాలకు మేలు కలిగే 6 గ్యారంటీలను కూడా అమలు చేయలేకపోయారే?
- జనాభాలో సగమున్న బీసీలకు కేబినెట్ లో ఎన్ని మంత్రి పదవులిచ్చారు?
- పొన్నం ప్రభాకర్ కు మంత్రి పదవిస్తే బీసీల గొంతు విన్పిస్తున్నారు
- మరింత బీసీలకు మంత్రి పదవులు ఎందుకు ఇవ్వలేదు
- ఏ ముఖం పెట్టుకుని సమర భేరీ నిర్వహిస్తున్నారు?
- ప్రజలకు ఏఐసీసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే సమాధానం చెప్పాలి
- అడిగిన దానికంటే అదనంగా యూరియా ఇచ్చినా కేంద్రాన్ని బదనాం చేస్తారా?
- లోకల్ బాడీ ఎన్నికల్లో ప్రజలు బీజేపీవైపు చూస్తుంటే ఓర్వలేకే యూరియా కొరత పేరుతో డ్రామాలు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావును అధికారులు తప్పు దోవ పట్టిస్తున్నారు
- అదనపు యూరియా ఇచ్చే విషయాన్ని కేంద్రం సానుకూలంగా పరిశీలిస్తోంది
- ఇకనైనా వాస్తవాలు ప్రజల ముందుంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నా
- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ హాట్ కామెంట్స్...
- వేములవాడ నియోజకవర్గం మరిమడ్ల ఏకలవ్య స్కూల్ లో రూ.5 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం
- ఎంపీ నిధులతో సోలార్ ప్లాంట్లు, డిజిటల్ బోర్డులను కూడా ఏర్పాటు చేయిస్తానని కేంద్ర మంత్రి హామీ



**కోనరావుపేట వెలుతురు జూలై 04:**
కాంగ్రెస్ ఏం ఉద్ధరించిందని 'సామాజిక న్యాయ సమర భేరీ' సభను నిర్వహిస్తున్నారని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. "ఈ దేశాన్ని, రాష్ట్రాన్ని అర్ధశతాబ్దానికిపైగా పాలించిన కాంగ్రెస్ పార్టీ ఇన్నేళ్లలో ఒక్కసారైనా బీసీని ప్రధానమంత్రిని, ముఖ్యమంత్రిని చేయలేదు? దళిత, బడుగు, బలహీనవర్గాలు అత్యధిక లబ్ది పొందే అవకాశమున్న 6 గ్యారంటీలను కూడా అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోంది. మరి ఏ ముఖం పెట్టుకుని సభను నిర్వహిస్తున్నారు. ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ప్రజలకు సమాధానం చెప్పాలి. లేకుంటే ఆ సభకు "సామాజిక అన్యాయ సమర భేరీ" అని పేరు మార్చుకోవాలి"అని పేర్కొన్నారు.

శుక్రవారం రోజున వేములవాడ నియోజకవర్గంలోని కోనరావుపేట మండలం మరిమడ్ల గ్రామంలో కేంద్ర ప్రభుత్వం రూ.5 కోట్ల నిధులతో అభివృద్ధి పనులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ శంకుస్థాపన చేశాం. ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి విద్యార్థులు వినూత్న రీతిలో ఘన స్వాగతం పలికారు. గిరిజన నృత్యాలతో ఆకట్టుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అధికారులు, జిల్లా బీజేపీ నేతలతో కలిసి పాఠశాలను సందర్శించిన బండి సంజయ్ అన్ని తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాల సమస్యలపై అధ్యాపకులు, విద్యార్థులతో ఆరా తీశారు. అనంతరం విద్యార్థుల విజప్తి మేరకు ల్యాబ్, ఇతర సౌకర్యాలను కల్పిస్తానని, దీంతోపాటు ఎంపీ నిధులతో సోలార్ ప్లాంట్, డిజిటల్ బోర్డును కూడా ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఏమన్నారంటే....

దేశవ్యాప్తంగా 20 వేలకుపైగా గిరిజన జనాభా ఉన్న మండలాల్లో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ ను ఏర్పాటు చేస్తున్నారు. 728 స్కూల్స్ లక్ష్యం కాగా, దాదాపు 500 స్కూల్స్ ప్రారంభమైనయ్. 1.5 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.

సమాజంలో పూర్తిగా వెనుకబడ్డ ఆదివాసీ, గిరిజనులకు నవోదయ స్థాయిలో విద్యను అందించడం ద్వారా సమాజంలోని అసమానతలను తొలగించి విద్యలో సమానత్వం సాధించాలన్నదే ఈ ఏకలవ్య స్కూల్స్ వ్యవస్థ ప్రధాన లక్ష్యం. చదువే కాకుండా క్రీడా, కళా, సాంస్కృతిక రంగాల్లో ఆసక్తి ఉన్న విద్యార్థులను ప్రోత్సహించడంతోపాటు జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు విద్యార్థులను ఈ స్కూల్స్ ద్వారా సిద్ధం చేస్తున్నాం. 6వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు CBSE విధానంలో అత్యున్నతమైన నాణ్యమైన ఉచిత విద్యను అందిస్తున్నం. ఉచిత వసతి, భోజనం, డ్రెస్, పాఠ్యపుస్తకాలను అందిస్తున్నాం.





ఏకలవ్య పాఠశాలల పథకాన్ని నిర్వహించేందుకు మొత్తం దాదాపు 25 వేల కోట్ల( 24614.88 లక్షలు) రూపాయలను కేంద్రం ఖర్చు చేస్తోంది. ఈ పాఠశాలల్లో దాదాపు 1 లక్షా 40 వేల మంది విద్యార్థులు లబ్ది పొందుతున్నారు. తెలంగాణా వ్యాప్తంగా మొత్తం 23 పాఠశాలల్లో సుమారు 10 వేల మంది విద్యార్థులు ఉన్నారు. మొత్తంగా 3 లక్షల 50 వేల మంది గిరిజన, ఆదివాసీ విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చాలని కేంద్ర లక్ష్యంగా పెట్టుకుని ఆ దిశగా చర్యలు తీసుకుంటోంది.

ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ స్కూళ్లలో IIT-JEE & NEET ఆన్లైన్ కోచింగ్ ఇస్తున్నారు. గిరిజన బిడ్డలకు అర్థం కావడం కోసం ప్రాంతీయ భాషలను నేర్పేందుకు సంబంధిత భాషా బోధకులను నియమిస్తున్నాం. ఇక్కడి నుండి మెడిసిన్, ఇంజినీరింగ్, ఐటీ, లా తదితర కోర్సులకు గ్రాడ్యుయేషన్/పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదవాలనుకునే విద్యార్థులకు జాతీయ స్కాలర్‌షిప్ స్కీమ్ కింద సాయం చేస్తున్నాం. M.Phil, Ph.D వంటి కోర్సులు చదవాలనుకునే ST విద్యార్థులకు నేషనల్ ఫెలోషిప్ అందిస్తున్నాం. విదేశాల్లో ఉన్నత విద్య చదవాలనుకునే వాళ్లకు నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ ను అందిస్తున్నాం.

సామాజిక న్యాయ సమరభేరి పేరును మార్చుకోవాలని సూచిస్తున్నా. దాని స్థానంలో సామాజిక అన్యాయ సమర భేరీ పెట్టుకుంటే మంచిది. కాంగ్రెస్ ఏం ఉద్ధరించిందని ఈ సభను పెడుతున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలి. ఈ దేశాన్ని అర్ధశతాబ్దానికిపైగా కాంగ్రెస్ పాలించింది. ఇన్నేళ్లలో ఒక్కసారైనా బీసీని ప్రధానమంత్రిని చేశారా? బీజేపీ బీసీని ప్రధానిని చేసింది. దళిత వర్గానికి చెందిన రామ్ నాథ్ కోవింద్ ను, ఆదివాసీ బిడ్డ ద్రౌపది ముర్మును, మైనారిటీకి చెందిన అబ్దుల్ కలాంను రాష్ట్రపతిగా చేసిన ఘనత కూడా బీజేపీదే. చరిత్రలో ఎన్నడూలేని విధంగా 27 మంది ఓబీసీలను, 12 మంది దళితులను, 6గురు దళితులను, 8 మంది మహిళలను కేంద్ర కేబినెట్ లో చోటు కల్పించిన చరిత్ర బీజేపీదే. బీసీనైన నన్ను కేంద్ర మంత్రిగా చేసింది. పార్టీ పరంగా నాతోపాటు లక్ష్మణ్, దత్తాత్రేయలకు అనేక పదవులిచ్చింది బీజేపీ. బీసీకి చెందిన మోదీని ప్రధాని అయితే చాయ్ వాలా అంటూ హేళన చేసిన పార్టీ కాంగ్రెస్. అంతేందుకు ఉమ్మడి రాష్ట్రంలో 50 ఏళ్లపాటు అధికారాన్ని చెలాయించిన కాంగ్రెస్ పార్టీ ఒక్క బీసీనైనా సీఎం చేశారా? ఎందుకు చేయలేదు? బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ సీఎం అవుతారని ప్రకటించిన నేత మోదీ.



అట్లాగే 50శాతానికిపైగా బీసీ జనాభా ఉందని చెబుతున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కేబినెట్ లో ఎంత మంది బీసీలకు అవకాశమిచ్చారు? బీసీ నేత పొన్నం ప్రభాకర్ కు పదవి ఇస్తే బీసీల గొంతు విన్పిస్తారు. మరింత మంది బీసీలకు ఇస్తే న్యాయం జరిగేది కదా? మరి ఏ ముఖం పెట్టుకుని సామాజిక న్యాయ సమరభేరీ సభ పెడుతున్నారు? బీసీల గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్ కు లేనేలేదు.

మహిళలకు నెలనెలా రూ.2500లు, రూ.4 వేల ఆసరా పెన్షన్లు, రూ.4వేల నిరుద్యోగ భృతి, విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా కార్డు, ఎకరానికి ఇంకా రైతు భరోసా కింద రూ.21 వేలు బకాయి, బోనస్ బకాయిలు ఎందుకు ఇవ్వలేదు? ఇచ్చిన 6 గ్యారంటీలతోపాటు మేనిఫెస్టోలోని 420 హామీలను ఎందుకు అమలు చేయలేకపోయారు? శుక్రవారం రోజున జరిగే సామాజిక న్యాయ సమర భేరీలో వీటిపై ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే సమాధానం చెప్పాలి.

యూరియా కొరతపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కావాలనే కేంద్రాన్ని బదనాం చేస్తున్నాయి. లోకల్ బాడీ ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్దమవుతుంటే ఓర్వలేక బదనాం చేస్తున్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అనుభవజ్ఞులు. అధికారులు ఆయనను తప్పుదోవ పట్టిస్తున్నారు. వాస్తవాలు గ్రహించాలని కోరుతున్నా.

తెలంగాణకు గత సీజన్ లో 9 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమైతే కేంద్రం 12 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఇచ్చింది. అదనంగా దాదాపు 3 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఇచ్చింది. ఈ సీజన్ లో కూడా కోరినంత యూరియా ఇచ్చేందుకు కేంద్రం సిద్దంగా ఉంది. కానీ గత సీజన్ లో అదనంగా కేటాయించిన యూరియా ఎటు పోయింది? వాటిని ఏం చేశారో లెక్కలు చెప్పకుండా కేంద్రాన్ని బదనాం చేయడం సరికాదు. ఈ విషయంలో అద్దాదరులు పడితే తగిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభ్యర్థనను కూడా కేంద్రం సానుకూల ధోరణితో పరిశీలించేందుకు సిద్దంగా ఉంది. ఇప్పటికైనా ప్రజలకు వాస్తవాలు చెప్పాలని కోరుతున్నా.

# ఇంత అధ్వాన్నంగా రోడ్డుంటే ఏం చేస్తున్నారు?

(మొదటి పేజీ తరువాయి..)

స్థానికులు ఆయన వద్దకు రావడంతో ఈ నీళ్లు ఎప్పటి నుండి ఉన్నాయి? అధికారుల దృష్టికి తీసుకురాలేదా? అని అడిగారు. గత 15 రోజులుగా రహదారిపై మోకాళ్ల లోతు నీళ్లు నిల్వ ఉన్నాయని, అధికారుల దృష్టికి తీసుకుపోయినా ఫలితం లేదని స్థానికులు వాపోయారు. ఈ నీటిలో ప్రయాణం చేయడంవల్ల భారీగా ట్రాఫిక్ జాం అవుతోందని, వరుస ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు.

నిన్ననే మూడు ఆటోలు బోల్తా పడ్డాయని, అందులో ప్రయాణిస్తున్న వారు గాయాలతో బయటపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కొంచెం వాన కురిసినా ఈ రహదారిపై మోకాళ్ల లోతు నీళ్లు నిల్వ ఉంటున్నాయని చెప్పారు. ఇంత జరుగుతున్నా తన దృష్టికి ఎందుకు తీసుకురాలేదని, స్థానిక నేతలు అధికారులపై ఎందుకు ఒత్తిడి తేలేదని అసహనం వ్యక్తం చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ వెంటనే ఆర్ అండ్ బి ఉన్నతాధికారులకు ఫోన్ చేసి ప్రజలు ఇంతగా ఇబ్బంది పడుతున్నా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. తగిన నిధులు లేవని జవాబివ్వడంతో వెంటనే జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి ఫోన్ చేసి తక్షణమే బావుపేట రహదారిని బాగు చేయాలని, ప్రయాణీకుల రాకపోకలకు ఇబ్బంది రాకుండా యుద్ద ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కోరారు. సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ ఆ మేరకు చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు.

## ఉచిత కంటి పరిక్షలు, మందులు, ఆపరేషన్స్ నిర్వహించిన డాక్టర్. బండ్లమూడి బసవేశ్వరరావు

**మంగళగిరి వెలుతురు జూలై 04:**
శుక్రవారం ఉదయం 10 గంటలకు మంగళగిరి 6వ బెటాలియన్ కళ్యాణ మండపమునందు ఉచిత మెగా వైద్య శిబిరం ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ %a% శ్రీలక్ష్మి సాయి ఇంటర్నేషనల్ డెంటల్ కేర్ సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్. బండ్లమూడి బసవేశ్వరరావు గారితో నిర్వహించినారు ఈ ఉచిత వైద్యశిబిరంలో 800 మందికి ఉచిత కంటి పరిక్షలు నిర్వహించి అర్హులైన వారికి కంటి బోట్లీ శుక్లమునకు సంబంధిత ఆపరేషన్స్ నిర్వహించడం జరిగినది. చంద్రన్న కంటి వెలుగు ద్వారా ట్రీట్ మెంట్స్ అందించడం జరిగినది దంత వైద్య పరిక్షలు 500మందికి నిర్వహించి అర్హులైన వారికి ఆపరేషన్స్, మందులు పంపిణీ చేయడం జరిగినది. ENT, కాన్సర్, ఆర్థో సంబంధిత స్పెషాలిటి వైద్యులచే రోగులకి పరిక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయడం జరిగినది. ఈ వైద్య శిబిరాన్ని మంగళగిరి 6వ బెటాలియన్ ఐజి పోలీస్ రాజా కుమార్ ప్రారంభించినారు, బెటాలియన్ కామన్ డెంట్ నగేష్ ప్రారంభోపన్యాసంతో ప్రారంభించినారు ఎన్టీఆర్ ట్రస్ట్ , శ్రీలక్ష్మి సాయి ఇంటర్నేషనల్ డెంటల్ కేర్ ఆర్గనైసింగ్ కో ర్డినేటర్ డాక్టర్. బండ్లమూడి బసవేశ్వరరావు నిర్వహించినారు, మంగళగిరి మరియు పరిసర ప్రాంత గ్రామప్రజలు 1000 మందికి పైగా ఈ వైద్యశిబిరములో ట్రీట్ మెంట్స్ మరియు మందులు పంపిణీ దా? బండ్లమూడి బసవేశ్వరరావు గారిచే జరిగినది, ఐజి పోలీస్ రాజాకుమార్. దా? బండ్లమూడి బసవేశ్వరరావు గారిని బెటాలియన్ లో మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించడం పట్ల అభినందించడం జరిగినది, 6 బెటాలియన్ లో సుమారు 600 మంది పరిక్షలు చేయించుకొని ట్రీట్ మెంట్స్ తీసికోవడం జరిగినది



వెలుతురు ఎడిటోరియల్
https://epaper.velthuru.com

# సంపాదకీయం..

# కలవరపెడుతున్న ఉద్యోగరంగం !

ఐటి రంగం ఎంతగా ఊరిస్తుందో..అంతగా క్షోభ పెడుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది. ఐటి ఉద్యోగులకు ఉన్నపళంగా ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారు. ఇటీవలల కాలంలో పెద్ద ఎత్తున ఉద్యోగాల నుంచి తొలగించేస్తున్నారు. స్కిల్ లేకపోవడం కన్నా..ఖర్చులు తగ్గించుకునే ఉద్దేశ్యంతో తొలగిస్తున్నారు. పేరు ప్రతిష్టలు ఉన్న కంపెనీలే ఇలా చేస్తున్నాయి. జీతం ఎక్కువగా ఉన్న ఉద్యోగులనే టార్గెట్ చేస్తున్నారు. దీంతో ఉన్న ఉద్యోగం ఊడిపోవడంతో కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. నిజంగానే ఖర్చు తగ్గించుకునే పద్దతిలో వారిని పిలిచి జీతంలో కోతలు విధించి, వారిని కొనసాగించవచ్చు. కానీ ఆలా జరగడం లేదు. ఇకపోతే తెలుగు రాష్ట్రాల్లో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉంది. సమస్య కొండంతగా ఉంటే చర్యలు మాత్రం గోరంత అన్నచందంగా ఉన్నాయి. మరోవైపు ఐటి కంపెనీల్లో తీసివేతలు పెరుగుతున్న తీరు తీవ్రంగా కలవరపెడుతోంది. ఉద్యోగం పోయినా బతకవచ్చన్న ధీమా లేకుండా పోతోంది. దానికి ఏదైనా రంగంలో రాణించే బహుముఖ ప్రావీణ్యం ఉండడం లేదు. పనిచేసుకునే పరిస్థితులు కూడా లేకపోవడం చూస్తున్నాం. నిజానికి క్షేత్రస్థాయి లోనే విద్యారంగంలో మార్పులు రావాలి. విద్యార్థులు రాటుదేలేలా తర్ఫీదు ఇవ్వాలి. వారు ఎంచుకంటున్న ఆయా రంగాల్లో నిష్ణాతులను తయారు చేయాలి. అప్పుడే వారు ఏ పరిశ్రమలో అయినా, ఉపాధి రంగంలో అయినా రాణిస్తారు. విద్యావిధానంలో మార్పుల తోనే ఇది సాధ్యం. కేవలం బట్టీ చదువుల వల్ల విద్యార్థుల్లో నైపుణ్యాలు లోపిస్తున్నాయి. నిరుద్యోగులకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించేలా మార్కెట్ విస్తరించాలి. ఉద్యోగమంటే కేవలం ప్రభుత్వ ఉద్యోగమే కాదు.. ప్రైవేట్ రంగంలోనూ వారికి అవకాశాలు కల్పించాలి. అలాగే సొంతకాళ్ల మీద నిలబడేలా ఉపాధికి అవకాశాలను పెంచాలి. బ్యాంకులు ఇతోధికంగా రుణాలు ఇవ్వాలి. ఇవన్నీ సాకారం కావాలంటే వ్యవసాయరంగం, అనుబంధ రంగాలు బలపడాలి. పారిశ్రామిక రంగం పురోగమించాలి. ఇవన్నీ కూడా ఓ క్రమద్దతిలో అభివృద్ధి చేసుకుంటూ పోవాలి. ఎంతసేపు పెన్షన్లు పంచడం, కిలో రూపాయికి బియ్యం ఇవ్వడం, ఇందిరమ్మ ఇళ్లు కట్టించడం ఇదే అభివృద్ధి కాదు. ప్రజలు తమకాళ్లమీద తాము నిలబడగలిగేలా వాతావరణం సృష్టించాలి. ఇది ప్రభుత్వాల బాధ్యత. యువత ఆకాంక్షల మేరకు అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వాల విధానాలు ఉండాలి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ప్రభుత్వాలపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ రాష్ట్రంలో క్వాంటమ్ గురించి సిఎం చంద్రబాబు మాట్లాడుతున్నారు. తెలంగాణ సిఎం రేవంత్ స్కిల్ వర్సిటీ అంటున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే.. కొత్తగా పరిశ్రమలు వస్తాయి. తమకు ఉద్యోగాలు వస్తాయని ఎదురు చూస్తున్నారు. టిడిపి ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధి విషయంలో గత ప్రభుత్వంతో పోల్చినపుడు కొంత మెరుగుగా పనిచేస్తోంది. ఇప్పటికే తెలంగాణలో సిఎం సహా మంత్రులు అమెరికా తదితర దేశాలు చుట్టివచ్చారు. పరిశ్రమల ఏర్పాటుకు ఆహ్వానాలు పలికారు. ఎపి మంత్రి లోకేశ్ దావోస్ తదితర ప్రాంతాలను సందర్శించారు. ఉన్న వనరులతో ఏం చేయవచ్చున్నది ముందుగా తేల్చుకోవాలి. సహజవనరులు ఉన్నాయి. సముద్రతీరం ఉంది. ఇవన్నీ కూడా ఉపాధికి పెద్ద అభివృద్ధి కేంద్రాలు. ఇరు రాష్ట్రాల సిఎంలు పారిశ్రామక వేత్తలకు రెడ్ కార్పెట్ పరిచారు. ప్రైవేట్ కంపెనీలు వేసే రోడ్లు, విమానాశ్రయాలు, చేసే విద్యుత్తు ఉత్పత్తి తదితర మౌలిక సౌకర్యాలు త్వరగా అందుబాటులోకి రావాలి. పన్నుల సరళీకరణ సాగాలి. చిన్నచిన్న పనులను పెంచాలి. కంపెనీలకు మేలు చేసేలా నిర్ణయాలు కాకుండా, ప్రజలకు మేలు చేసేలా విధానాలు ఉండాలి. ఎస్.ఇ.జెడ్ లలో వచ్చిన కంపెనీలకు భూములు ఇచ్చి రైతులు ఆ కంపెనీల్లో కూలీలుగా మారుతున్నారు. పరిశ్రమల నిర్మాణ సమయంలో వచ్చే, పోయే లారీల్లో దింపుడు, ఎత్తుడు హమాలీలయ్యారు. గంగవరం పోర్టు, పోలవరం ప్రాజెక్ట్, ఫార్మాసిటీల లాంటి వాటికోసం, విశాఖ ఉక్కు కోసం భూములు త్యాగాలు చేసిన వారు రోడ్డున పడుతున్నారు. ఇలాంటి ఘోరాలు జరక్కుండా దిశగా ప్రభుత్వాలు ఆలోచన చేయాలి. తెలంగాణలో మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ లాంటి వాటికి భూములు ఇచ్చిన రైతులు ఇవాళ దిక్కులేకుండా పోయారు. ఇలాంటి అభివృద్ధి ఎవరి కోసమన్నది కూడా ఆలోచన చేయాలి. భూములు ఇచ్చిన రైతుల త్యాగాలను కూడా గుర్తించని కంపెనీలు వారిని కార్మికులుగా కూడా గుర్తించడంలేదు. ప్రభుత్వాలు ఏకపక్షంగా పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమే పని చేస్తున్నాయి. ప్రైవేట్ పరిశ్రమల్లో తనిఖీలను ఎత్తివేశారు. కార్మికుల భద్రతను గాలికొదిలేశారు. అంటే వెట్టి చాకిరీ చేయించుకునే వ్యవస్థను ప్రభుత్వమే ప్రోత్సహిస్తోంది. సిగాచీ పరిశ్రమలో జరిగిన దారుణమే ఇందుకు నిదర్శనం. పరిశ్రమలను ప్రోత్సహించి, ఆరోగ్యకర వాతావరణంలో ఉద్యోగ, ఉపాధి రంగాలను ప్రోత్సహిస్తే ఎవరికీ అభ్యంతరం ఉండదు. ఆయా కంపెనీల్లో వేతనాలను కూడా నైపుణ్యాలకు తగినట్లుగా ఇవ్వటం లేదు. కార్మికులకు వేతనాలు పెంచుతాం, కార్మిక హక్కులను కాపాడతామని ప్రభుత్వాలు చెప్పటం లేదు. నిజానికి పరిశ్రమలు పెట్టేది ప్రజలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెంచడానికే అని గుర్తించాలి. అలాగు భూముల్లో బంగారం పండించేలా రైతులను ప్రోత్సహించాలి. వ్యవసాయ అనుబంధరంగాలను ప్రోత్సహించాలి. ఉద్యోగ,ఉపాధి రంగాలకు పెద్దపీట వేసినప్పుడే స్వయం సమృద్ధి సాధ్యం కాగలదు.

## విషం చిమ్ముతున్న దేశద్రోహులు

### సోషల్ మీడియా వేదికగా విద్రోహ ప్రచారం

### అలాంటి వాటిని మూసేసేందుకు కేంద్రం చర్యలు

**న్యూఢిల్లీ,జులై4( వెలుతురు):** ఈ దేశంలో ఉంటూ.. ఈ దేశం తిండి తింటూ.. ఇక్కడ సౌకర్యాలు అనుభవిస్తూ.. పక్క దేశాలకు సపోర్టు చేస్తున్న వారు చాలా మందే ఉన్నారు. సోషల్ మీడియాలో సొంత దేశానికి వ్యతిరేకంగా పోస్టులు సైతం పెడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం అలాంటి వారికి బుద్ధి చెప్పడానికి సిద్ధమైంది. కేంద్ర హోం శాఖ కొత్త పాలసీ తేబోతోంది. ఈ పాలసీ గనుక అమలైతే దేశానికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టే వారికి చుక్కలు కనిపించనున్నాయి. ఈ పాలసీలో భాగంగా దేశానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పెట్టే వీడియో, ఇతర కంటెంట్‌ను గుర్తించనున్నారు. వాటిని బ్లాక్ చేయనున్నారు. ఆ కంటెంట్ పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నారు. దేశానికి వ్యతిరేకంగా కంటెంట్ ఉండే వెబ్ సైట్లపై కూడా చర్యలు ఉండనున్నాయి. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. ఇంటెలిజెన్స్ ఏజెన్సీలోని అత్యున్నతాధికారులు యాంటీ నేషనల్ పోస్టుల గురించి హోమ్ మినిస్ట్రీకి చెప్పారట. ఈ నేపథ్యంలోనే కేంద్ర కొత్త పాలసీ తేవాలని చూస్తోందని తెలుస్తోంది. దేశానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టే వారిని, వ్యతిరేకంగా పని చేసే వారిని గుర్తించడానికి కేంద్రం ఓ టీమ్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ టీమ్ దేశ వ్యతిరేక కార్యాకలాపాలపై దృష్టి పెడుతుంది. ఖలిస్తానీ టెర్రరిస్ట్ గురుపత్వంత్ సింగ్ పన్నులాంటి వారి ఖాతాలు కూడా ఇండియాలో బ్యాన్ అవ్వనున్నాయి. ఈ కొత్త పాలసీ కోసం సోషల్ మీడియా కంపెనీలతో పాటు అమెరికా ప్రభుత్వంతో కేంద్రం చర్చలు జరుపుతున్నట్లు సమాచారం.



# ఇంకెన్నాళ్ళు మోసం..? బీసీ పట్ల చిన్నచూపు ఎందుకు..?

భారత స్వాతంత్ర్యానికి 75 సంవత్సరాలు పూర్తయినప్పటికీ, బీసీ (బ్యాక్వర్డ్ క్లాస్) వర్గం అభివృద్ధి పరంగా ఇప్పటికీ అనేక సవాళ్లు ఎదుర్కొంటోంది. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం, కార్మిక వృత్తుల్లో ఆధారపడే బీసీలకు స్వాతంత్ర్యం అనంతరం మొదటి ప్రధాని నెహ్రూ టెక్నాలజీ ఆధారంగా సమాన సమాజ నిర్మాణాన్ని ప్రతిపాదించినా, అందులో ఈ వర్గానికి సరైన ప్రాతినిధ్యం దక్కలేదు. వీ.పి.సింగ్ ప్రభుత్వం 1990లో మండల కమిషన్ ఆధారంగా రిజర్వేషన్లు అమలు చేసినప్పటికీ, తదుపరి ప్రభుత్వాల పాలనలో బీసీల సమస్యలపై దృష్టి తగ్గింది. విద్య, ఉద్యోగాల్లో అసమానతలు, రాజకీయాల్లో ప్రాతినిధ్యం లేకపోవడం వంటి అంశాలు ఈ వర్గ అభివృద్ధికి అడ్డుగోడలుగా నిలిచాయి.ఎన్నికల సమయంలో బీసీ ఓట్లపై ఆసక్తి చూపే రాజకీయ పార్టీలు, నాయకత్వ స్థాయికి వారిని తీసుకురావడంలో మాత్రం వెనుకంజ వేసిన చరిత్ర ఉంది. ప్రస్తుత ప్రధాని మోదీ బీసీ వర్గానికి చెందినవారైనా, ఆయన హయాంలో వచ్చిన సంక్షేమ పథకాలు సమగ్ర ఫలితాలు ఇవ్వలేదన్న విమర్శలు ఉన్నాయి. అంతేగాక, బీసీల మధ్యే ఉన్న వర్గీయ విభజనలు కొందరికి మాత్రమే లాభం చేకూర్చాయి. ఈ విభజన రాజకీయాలకు ఉపయోగపడుతోంది. బీసీలు ఐక్యతతో ముందుకు రావాల్సిన అవసరం తీవ్రంగా ఉంది. అసలు పరిస్థితిని విశ్లేషించి, కుల గణన ఆధారంగా అన్నివర్గాలకు న్యాయం జరిగే విధానాలు అమలైతే గానీ, అభివృద్ధి వాస్తవంగా కనిపిస్తుంది.ఈ అధ్యాయం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బిసిల ఉద్యమ పుట్టుక, అభివృద్ధిని సమగ్రంగా చిత్రీకరిస్తుంది. మొదటగా, బిసిల సామాజిక, ఆర్థిక పరిస్థితులు తీవ్ర వెనుకబాటుతనం, భూముల లేమి, సంప్రదాయ వృత్తుల పతనం ద్వారా ఏర్పడినట్లు వివరిస్తుంది. బ్రిటిష్ పాలన నుంచి స్వాతంత్ర్యానంతరం వరకు ఆధిపత్య కులాలు విద్య, ప్రభుత్వ ఉద్యోగాలు, భూములు అందిపుచ్చుకుని సామాజికంగా పైచెరిగాయి. బ్రాహ్మణులు, రెడ్డి, కమ్మ, కాపు వంటివారు భూస్వాములు, అధికారులుగా ఎదగగా, బిసిలు %-% ముఖ్యంగా, అగ్నికుల క్షత్రియ, గంగపుత్ర, వాల్మీకి బోయ, దొమ్మర, గంగిరెద్దు, ముతరాసి, మొండివారు, బుడబుక్కల, ముత్యాలమ్మ వాండ్లు, వీరముష్టి (నట్టికోతలు), నక్కల, పిచ్చిగుంటల, నక్కల, దాసరి, బండర, బండ. ముదిరాజ్, చాకలి, మంగలి, దర్జీ, మత్స్యకార వంటివారు %-% భూముల్లేని కూలీలు, పేదరైతులుగా మిగిలారు. వివిధ సర్వేలు చూపినట్లుగా, బిసిలు, ఎస్సీలలో అత్యధికులు భూమి లేని వర్గానికి చెందారు. వృత్తిపనుల కులాలు భూములు కోల్పోయి కూలీలుగా మారినట్లు అధ్యయనాలు స్పష్టం చేశాయి. గ్రామీణ ఆర్థిక అసమానతలు పెరిగిన నేపథ్యంలో బిసిలలోని పేదలు, నిమ్న వర్గాలు శ్రమజీవులుగా మిగిలిపోయారు. దీంతో బిసిలు తమ వంచనను గుర్తించి ఉద్యమాలకు మద్దతుగా నిలబడే స్థితికి వచ్చారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 340, 15(4), 16(4), 46, ఆర్టికల్స్ ప్రకారం "బలహీన వర్గాలు"గా గుర్తింపు పొందిన ఒబిసిలకు రిజర్వేషన్లతో పాటు ఇతర అభివృద్ధి చర్యలు ప్రారంభమయ్యాయి. ఈ సమకాలీన పరిణామాలే బిసి ఉద్యమంలో చైతన్యం కలిగించాయి. స్వాతంత్ర్యానంతర గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు ప్రధానంగా గ్రామీణ ధనిక వర్గాలకు లాభం చేకూర్చాయి. భూములు, సంబంధాలు ఉన్నవారు పంచాయితీరాజ్ పథకాలు, పరపతి సంస్థల రుణాలు సులభంగా పొందారు. వీరి ఆధిపత్యం గ్రామీణ రాజకీయ వ్యవస్థలపైనా నెలకొంది. తక్కువ భూములు కల బీసీ, ఇతర వెనుకబడిన వర్గాలకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల ప్రయోజనం తక్కువగా అందింది. స్థానిక సంస్థల్లో కూడా ధనిక వర్గాల ప్రభావం అధికంగా ఉండటంతో బీసీలకు రాజకీయ, సామాజిక అవకాశాలు అధికంగా దక్కలేదు.ఇది గుర్తించిన రాజ్యాంగం పౌరులందరికీ సమానత్వం, న్యాయం, అవకాశాల హామీ ఇస్తూ 15 (4), 16 (4), 38, 46వ ఆర్టికల్స్‌లో బలహీన వర్గాలకు ప్రత్యేక రక్షణలు కల్పించేందుకు అవకాశం కల్పించింది. వీటి ద్వారా వెనుకబడిన వర్గాల విద్య, ఉపాధి రంగాలలో పురోగతికి మార్గం వేసింది. కేంద్ర ప్రభుత్వం 340 (1) నిబంధన ప్రకారం 1953లో కాకా కాలేల్కర్ కమిషన్‌ను, 1979లో బి.పి. మండల్ కమిషన్‌ను నియమించింది. మొదటినిది నిర్లక్షించబడినా, రెండోది బీసీలకు 27% రిజర్వేషన్లకు దారి తీసింది. మండల్ కమిషన్ 3,743 కులాలను బీసీలుగా గుర్తించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఒబిసి కులాలు 292గా ఉన్నాయి. అయినా, కొన్ని అగ్రకులాల చేర్పు వల్ల జాబితా వివాదాస్పదమైంది. రాష్ట్రం రిజర్వేషన్లు ఆమోదించినా జాబితాను తిరస్కరించింది.ఈ విధంగా, స్వాతంత్ర్యం అనంతరం ధనిక వర్గాలు అధికారాన్ని నిలబెట్టుకోగా, బీసీలకు రాజ్యాంగం ద్వారా కొంత న్యాయం జరిగిందని చెప్పవచ్చు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బీసీ (వెనుకబడిన తరగతులు) గుర్తింపు, రిజర్వేషన్ల అమలుకు సంబంధించి ప్రభుత్వం అనేక చొరవలు తీసుకుంది. 1956కుముందు ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల్లో కలిపి 60 బీసీ కులాలు ఉండగా, 1963లో ప్రభుత్వం 139 కులాల జాబితాతో జీఓ 1886ను జారీ చేసింది. కానీ కోర్టులో తిరస్కరించబడింది. తర్వాత 1966లో 112 కులాలతో జీఓ 188 జారీ చేసి, వృత్తి కళాశాలలు, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించారు. కానీ అదే కోర్టు తిరస్కరించడంతో అనంతరామన్ కమిషన్‌ను 1968లో ఏర్పాటు చేశారు. ఈ కమిషన్ 93 కులాలను బీసీలుగా గుర్తించి, రిజర్వేషన్లను ఎ-బి-సి-డి గ్రూపులుగా విభజించింది. ఆ తర్వాత మురళీధరరావు కమిషన్ నివేదిక ఆధారంగా 1986లో జీఓ 166 ద్వారా బీసీ కులాలను 146కి పెంచారు.హైదరాబాద్ ప్రాంతంలో బీసీ ఉద్యమాలకు బొజ్జా నరసింహులు కీలక పాత్ర పోషించారు. 1935లో మున్నూరు కాపు మహాసభల ద్వారా బలహీన వర్గాలను చైతన్యపరిచారు. 1954లో హైదరాబాదు బ్యాక్‌వర్డ్ క్లాసెస్ అసోసియేషన్ స్థాపించి బీసీలకు ఒక వేదికగా మలిచారు. కేంద్ర బీసీ కమిషన్‌లో సభ్యునిగా కూడా పనిచేశారు. అదే సమయంలో పద్మశాలీ ఉద్యమం కూడా కొండా లక్ష్మణ్ బాపూజీ ఆధ్వర్యంలో జరిగింది.1957లో నీలం సంజీవరెడ్డి సీఎంగా ఉన్నప్పుడు, బీసీ జాబితా ఆర్థిక వెనుకబాటుతనాన్ని ఆధారంగా చేసుకుని తయారు చేయాలన్న నిర్ణయం వివాదాస్పదమైంది. బీసీ ఉద్యమాన్ని ఏకం చేసేందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బీసీ అసోసియేషన్ (ఎపిబిసిఎ) ఏర్పడింది. ఈ అసోసియేషన్‌లో పలువురు ప్రాచీన సంఘాలు విలీనమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా గౌడ్లు, మున్నూరుకాపులు, పద్మశాలీలు, మత్స్యకారులు, నాయీ బ్రాహ్మణులు, ముదిరాజులు, విశ్వబ్రాహ్మణులు, రజకులు, కుర్మలు, నూర్బషా, గంగపుత్ర, భట్రాజ్ వంటివారు తమ వృత్తి సంఘాలుగా ఎదిగి రిజర్వేషన్ల సాధనకు కృషి చేశారు.1970లలో ఆంధ్రప్రదేశ్‌లో బీసీల హక్కుల కోసం శక్తివంతమైన ఉద్యమం ప్రారంభమైంది. 1971 మే 27న గాంధీభవన్‌లో సమావేశమైన బీసీ నాయకులు ఉమ్మడి కార్యాచరణ సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో కాటం లక్ష్మీనారాయణ, కొండా లక్ష్మణ్ బాపూజీ, గౌతు లచ్చన్న తదితరులు కీలకంగా పాల్గొన్నారు. సీఎం కాసు బ్రహ్మానందరెడ్డి ప్రోత్సాహంతో విజయవాడలో బీసీ మహాసభ జరిగింది. అనంతరం అనగాని భగవంతరావు అధ్యక్షతన బీసీ కాంగ్రెస్ ఏర్పాటైంది. దీనికి భిన్నంగా కొండా లక్ష్మణ్ ఆధ్వర్యంలోని బీసీ కాంగ్రెస్ రాజకీయాలకు దూరంగా ఉన్నట్లు ప్రకటించింది. పీవీ నరసింహారావు హయాంలో మరో బీసీ మహాసభ విజయవాడలో జరిగింది. 1973లో బెంగళూరులో దేవరాజ్ అర్సు సహకారంతో దక్షిణ భారత బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల మహాసభలో ఇందిరాగాంధీ ప్రారంభోత్సవ ప్రసంగం చేశారు. 1979లో హైదరాబాదులో గౌతు లచ్చన్న అధ్యక్షతన జరిగిన మహాసభలో బీసీలకు 40% రిజర్వేషన్లు ఇవ్వాలని తీర్మానించారు. అదే సంవత్సరం మరొక సభలో రాజ్యాంగంలో పేర్కొన్న సామాజిక న్యాయాన్ని సాధించాలంటే బీసీలకు తగిన ప్రాతినిధ్యం, నిధులు, చట్టబద్ధమైన చర్యలు అవసరమని పేర్కొన్నారు.బీసీ సంఘాలు పరస్పరం విలీనం కావాలని, రాజకీయేతర సంస్థలను బలోపేతం చేయాలనే ఆలోచన కూడా పుట్టుకొచ్చింది. చెన్నారెడ్డి కాలంలో జరిగిన బీసీ సదస్సులో చేసిన సిఫారసులు అమలుకాలేదు.

### తెలుగుదేశం పార్టీ - ఓబీసీల పట్ల వైఖరి, ఉద్యమాల ప్రభావం:

ఒక సంక్షిప్త అవలోకనం,1982లో టిడిపి ఏర్పడి, 1983లో ఎన్టీఆర్ అధికారంలోకి రావడంతో రాష్ట్ర రాజకీయాల్లో కొత్త దిశ ప్రారంభమైంది. తెలుగుదేశం పార్టీ స్థాపకుడు ఎన్టీఆర్, ఓబీసీలతో ప్రత్యేక బంధం పెంచుకున్నారు. పేదలు, నిరుద్యోగ విద్యావంతులు, ముఖ్యంగా బీసీలను పార్టీకి ఆహ్వానించి, వారికి ప్రాధాన్యం ఇచ్చారు. తెలంగాణలో పద్మశాలి, గౌడ, మున్నూరుకాపు, యాదవులుబీ ఆంధ్రాలో కాపు, బలిజ, గవర కులాలవారు టిడిపికి ఆకర్షితులయ్యారు. ఎన్టీఆర్ వారికి ఎమ్మెల్యే టికెట్లు, ఆర్థిక సహాయం ఇచ్చి ప్రోత్సహించారు. 1983లో 61 ఎమ్మెల్యే సీట్లు, 1985లో 59 ఓబీసీలు టిడిపి తరఫున అసెంబ్లీకి ఎన్నికయ్యారు. జిల్లా పరిషత్, మండల స్థాయిలోనూ వారికి పదవులు లభించాయి.1980లలో మురళీధరరావు కమిషన్ (1986) బిసి రిజర్వేషన్లను 27% నుంచి 44%కి పెంచాలని సిఫారసు చేసింది. ఈ నివేదిక అమలుకు బిసి సంఘాలు ఉద్యమించాయి. తిరుపతిలో బిసి కాన్ఫరెన్స్ నేపథ్యంలో టిడిపి ప్రభుత్వం 1986 జూలైలో అకస్మాత్తుగా నివేదికను ఆమోదించింది. అయితే, ప్రభుత్వం చర్చలు లేకుండా తొందరపడి నిర్ణయం తీసుకోవడం విమర్శలకు దారి తీసింది. మండల్ కమిషన్ నివేదికపై బిసి సంఘాలు జాతీయ స్థాయిలో ఉద్యమించాయి. 1990లలో "వెనుకబడిన తరగతులకు రాజ్యాధికారం" అనే నినాదంతో బిసి ఫెడరేషన్లు, ఉద్యమ వేదికలు ఏర్పడ్డాయి. గౌడలు, పద్మశాలీలు, మున్నూరుకాపులకు ప్రత్యేక హాస్టళ్లు, విద్యా-ఉద్యోగ రిజర్వేషన్ల వల్ల ఓబీసీలలో చిన్న మధ్యతరగతి పుట్టుకొచ్చింది. ఇది వారిలో రాజకీయ, సామాజిక స్పృహను పెంచింది.అయితే, బిసి ఉద్యమం కులాలవారీగా నడవడం, ఉమ్మడి స్పృహ లోపించడం, నాయకత్వ విభేదాలు వంటి సమస్యలతో బలహీనపడింది. ముఖ్యమంత్రులు, రాజకీయ పార్టీలు ఉద్యమాన్ని చీల్చేందుకు ప్రయత్నించడం, బిసి ఉద్యమం పూర్తిస్థాయిలో సమన్వయాన్ని సాధించలేకపోవడానికి ప్రధాన కారణమయ్యాయి. భవిష్యత్తులో బిసిలందరికీ సమాన హక్కులు, ఉమ్మడి రాజకీయ ప్లాట్‌ఫాం అవసరం. దేశంలో బీసీ ( తాడిత పీడిత వర్గాలు) రిజర్వేషన్ల విషయంలో జరగాల్సిన న్యాయం ఇప్పటికీ పూర్తి స్థాయిలో జరగలేదు. రాజ్యాంగం బీసీలకు విద్యా, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లకు మార్గం చూపినా, దాన్ని అమలు చేసే విషయంలో పాలకవర్గాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. గత 75 సంవత్సరాలుగా బీసీలు పోరాటంలోనే ఉన్నారు. కానీ పాలకులు మాత్రం బీసీలను ఓటు బ్యాంకుగా చూస్తూ, హక్కుల్ని పక్కన పెట్టారు.జాతీయ పార్టీల చరిత్రను చూస్తే బీసీలకు సంబంధించి స్పష్టమైన దృష్టికోణం కనిపించదు. పార్టీలు ఎన్నికల సమయంలో బీసీలను ఆకట్టుకునే వాగ్దానాలు చేస్తాయి కానీ గెలిచిన తరువాత వాటి అమలుపై నిష్క్రియత కనబడుతుంది. ఈ నేపథ్యంలో, బీసీల రాజకీయ ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉంది. అసెంబ్లీల్లో, పార్లమెంటులో బీసీలకు జనాభా మేర ప్రాతినిధ్యం లేదు. ఇందుకు కారణం ం బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు లేనిదే కాకుండా, పార్టీలలోనూ బీసీలకు నాయకత్వ స్థాయిలో అవకాశం ఇవ్వకపోవడమే. ఇలాంటి పరిస్థితుల్లో బీసీలు ఒకేచోట నిలబడితేనే మార్పు సాధ్యం అవుతుంది. దేశవ్యాప్తంగా బీసీలను ఏకతాటిపైకి తేర్చి, రాజకీయంగా బలమైన ఒత్తిడిని తీసుకురావాల్సిన అవసరం ఉంది. అప్పుడు మాత్రమే బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు రావచ్చు. ఇది వచ్చిన తర్వాతే విద్యా, ఉద్యోగ రంగాల్లో సుస్థిరంగా రిజర్వేషన్లు అమలవుతాయి. ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో కొంతమంది బీసీ నాయకులు మాత్రమే పదవుల్లోకి వచ్చారు కానీ, వారు సామూహిక ప్రయోజనాల కంటే పార్టీ ఆదేశాలకే లోబడి ఉంటున్నారు. ఇది బీసీ సమాజానికి మేలు చేయదు.

అందుకే బీసీలంతా తమ వర్గ రాజకీయ ఆస్తిత్వాన్ని గుర్తించి, స్వరాజ్యాధికారంగా ఆలోచించాలి. ఒక దళితునికి ఉన్న రాజకీయ రిజర్వేషన్ ఎందుకు బీసీకి ఉండకూడదు? ఒక గిరిజనునికి ఉన్న హక్కులు బీసీలకు ఎందుకు ఉండకూడదు? ఈ ప్రశ్నల్ని బలంగా లేవనెత్తాలి. ప్రజాస్వామ్యంలో సంఖ్యను బలంగా వినిపించాలంటే సంఘటిత పోరాటమే మార్గం.మొత్తం మీద, బీసీల రాజకీయ, ఆర్థిక, విద్యా ప్రగతికి రిజర్వేషన్లు అత్యవసరం. అలాంటి రిజర్వేషన్లు సాధించాలంటే ం బీసీలంతా సామూహికంగా ఉద్యమిస్తే తప్ప మార్పు రాదు. ఇప్పుడు జరిగిన నిర్లక్ష్యాన్ని చరిత్ర మర్చిపోదు. కానీ, బీసీలు కలిసికట్టుగా ముందుకు వస్తే భవిష్యత్తు చరిత్రను మాత్రం రాయగలరు.



మన్నారం నాగరాజు

## స్వామి వివేకానందుడి అడుగుజాడల్లో

# యువత నడవాలి...

- ఎంపీ ఈటల రాజేందర్...



**కూకట్ పల్లి జూలై 4 వెలుతురు:**

యువత స్వామి వివేకానందుడి అడుగుజాడల్లో నడిచి దేశ అభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలి అని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం స్వామి వివేకానంద 123వ వర్ధంతి సందర్భంగా కెపిహెచ్బి కాలనీ ఒకటవ రోడ్డులో చత్రపతి ధర్మరక్షణ సేన అధ్యక్షులు వేణుగోపాల్, వారి మిత్రబృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వామి వివేకానంద నూతన విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈటెల మాట్లాడుతూ యువతకు స్ఫూర్తి స్వామి వివేకానంద యువతకు శాశ్వత ప్రేరణాస్రోతం వారి సందేశాలు సమాజాన్ని మార్చగల సామర్థ్యం కలిగినవి అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, కూకట్పల్లి బిజెపి అసెంబ్లీ ఇంచార్జ్ మాధవరం కాంతారావు, పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, చత్రపతి ధర్మరక్షణ సేన సభ్యులు, స్థానిక ప్రజలు, యువత తదితరులు పాల్గొన్నారు.

## పేదల నాయకుడు వంగవీటి మోహన్ రంగా..

- ఈటల రాజేందర్...



**కూకట్ పల్లి జూలై 4 వెలుతురు:**

పేదల నాయకుడు వంగవీటి రంగా అని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం కూకట్ పల్లి బాలాజీనగర్ లో తెలంగాణ కాపు సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన మోహన రంగా జయంతి కార్యక్రమానికి ఆయన హాజరై రంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ తన జాతి ఐక్యత కోసం ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. ఆయన స్ఫూర్తితో ఐక్యంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి బిజెపి అసెంబ్లీ ఇంచార్జ్ మాధవరం కాంతారావు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, కూకట్పల్లి అసెంబ్లీ జనసేన పార్టీ ఇంచార్జ్ ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్, నాయకులు కొల్లా శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## భరతమాత స్వేచ్ఛ కోసం ప్రాణత్యాగం చేసిన మహొన్నత వ్యక్తి అల్లూరి సీతారామరాజు...

- ఈటెల రాజేందర్..



**కూకట్ పల్లి జూలై 4 వెలుతురు:**

భరతమాత స్వేచ్ఛ కోసం ప్రాణత్యాగం చేసిన మహొన్నత వ్యక్తి అల్లూరి సీతారామరాజు అని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం అల్లూరి సీతారామరాజు 128 వ జయంతి సందర్భంగా కూకట్ పల్లి ఉషా ముల్లపూడి రోడ్ లోని అల్లూరి విగ్రహానికి ఆయన పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ తెలుగు జాతి గర్వించే బిడ్డ, భరతమాత ముద్దుబిడ్డ, సాహస పుత్రుడు అల్లూరి సీతారామ రాజు అని ఆయన ఉత్సవాలు రెండు తెలుగు రాష్ట్రాలు ఘనంగా జరుపుకుంటున్నాయి అన్నారు. ఈనాటి తరానికి ఆయన త్యాగం గొప్పతనం తెలియజేయాలని సూచించారు. ఎంతో మంది త్యాగధనుల ప్రాణత్యాగాలు నేడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ స్వాతంత్రం అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ అల్లూరి సీతారామ రాజు విగ్రహాన్ని భీమవరంలో ఆవిష్కరించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి బిజెపి అసెంబ్లీ ఇంచార్జ్ మాధవరం కాంతారావు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్.బి.స్టేడియం కు తరలి వెళ్ళిన కూకట్ పల్లి కాంగ్రెస్ నాయకులు...

**కూకట్ పల్లి జూలై 4 వెలుతురు:**



ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆధ్వర్యంలో ఎల్.బి.స్టేడియం లో జరుగుతున్న జై భీమ్, జై బాపూ, జై సంవిధాన్ కార్యక్రమానికి కూకట్ పల్లి నియోజకవర్గం, బాలానగర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శుక్రవారం భారీగా తరలి వెళ్లారు. కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి, సీనియర్ నేతలు పులి శ్రీకాంత్ పటేల్, పులి శివ కుమార్ గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొండకింది పుష్పారెడ్డి, బాలానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మధు గౌడ్, భరత్, బండిగా నరసింహ, మందాడి విజయ కుమారి, మట్టే ప్రసన్న కుమార్, జెల్లా శివ తదితరులు తరలి వెళ్లారు.

## బీసీల సమస్యలు పరిష్కరించాలని ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కి విజ్ఞప్తి చేసిన బీసీ నేత జాజుల లింగంగౌడ్

**హైదరాబాద్ వెలుతురు జూలై 04:**



తెలంగాణ రాష్ట్రంలో 60 శాతం ఉన్న బీసీల సమస్యలు పరిష్కారించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే గారికి గాంధీ భవన్ లో విజ్ఞప్తి చేసినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా లింగంగౌడ్ మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విద్యా,ఉద్యోగ రాజకీయ రంగాలలో బీసీ రిజర్వేషన్లను 42 శాతం పెంచాలని తీర్మానం చేస్తూ రాష్ట్ర అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదించిన బీసీ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించి తమిళనాడు తరహాలో 9వ షెడ్యూల్లో చేసే విధంగా ఈ జులై 21వ తేదీ నుండి జరిగే పార్లమెంట్ సమావేశాల్లో ఇదే అజెండగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి. రిజర్వేషన్లపై ఉన్న 50% పరిమితిని ఎత్తివేసేలా కేంద్రంపై ఒత్తిడి పెంచాలి.దేశంలోని ఎస్సీ,ఎస్టీ,అగ్రవర్ణలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించినట్టుగానే బీసీలకు కూడా జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచాలి.చట్టసభలలో బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర నాయకులు గూడూరు భాస్కర్ పాల్గొన్నారు.

## సంతలో సరుకుల్లా ఇంజనీరింగ్ సీట్లు

# అమ్ముకుంటున్న ప్రైవేట్ కాలేజీలు

- **ప్రైవేట్ కాలేజీలో విద్యా వ్యాపారాన్ని ఆపకపోతే ఉన్నత విద్యా మండలిని ముట్టడిస్తాం**
- **బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు విక్రమ్ గౌడ్**

**హైదరాబాద్ వెలుతురు జూలై 04:**



రాష్ట్రంలో ఇంజనీరింగ్ విద్య కౌన్సిలింగ్ నడుస్తున్న తరుణంలో మెరిట్ విద్యార్థులకు ఇవ్వాల్సిన బి కేటగిరి సీట్లను ప్రైవేట్ యాజమాన్యాలు ఇష్టానుసారంగా లక్షల రూపాయలు డొనేషన్లు తీసుకుంటూ మినిమం ఎంసెట్ కూడా క్వాలిఫై గాని వారికి లక్షల రూపాయల డొనేషన్లు తీసుకుంటూ అమ్ముకుంటున్న వైన్యం విద్యా వ్యాపారం చేస్తూ పేద విద్యార్థులకు విద్యను అందరిని ద్రాక్షగా మారుస్తున్న కార్పొరేట్ ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలు వి క్యాటగిరి నోటిఫికేషన్ అన్ని ప్రధాన పత్రికల్లో ప్రకటన ఇచ్చి విద్యార్థులకు తెలిసే విధంగా ఇవ్వాలి కానీ నామమాత్రపు పత్రికలు ఎవరు చూడకుండా దొంగ చాటుగా నోటిఫికేషన్ ఇచ్చినట్టు ఇచ్చి సీట్లను లక్షల రూపాయలకు అమ్మకుంటున్నారు రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారేమో ఒకవైపు రాష్ట్రంలో విద్యా కమిషన్ వేసాం పేద విద్యార్థులకు న్యాయం జరుగుతుందని చెప్తున్నారు కానీ మొదటి కౌన్సిలింగ్ కూడా పూర్తిస్థాయిలో కాకముందే ఈ ప్రైవేటు యాజమాన్యాలు ఇష్టానుసారంగా సీట్లను బహిరంగ మార్కెట్లో పెట్టి అమ్ముకుంటున్నారు ప్రజలకు తీరని అన్యాయం జరుగుతుంది దీనిపై వెంటనే ప్రభుత్వ పెద్దలు ఉన్నత విద్యా మండలితో ఎంక్వైరీ కమిషన్ వేపిచ్చి వెంటనే అలాంటి కాలేజీలను బ్లాక్ లిస్టులో పెట్టాలి ప్రభుత్వం విద్యార్థులపై ఉన్న చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి మెరిట్ ఉండి నిజమైన విద్యార్థులకు న్యాయం జరగాలి లేనిపక్షంలో ఉన్నత విద్యా మండలి ముట్టడిస్తామని విక్రమ్ గౌడ్ తెలిపారు కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ముదిరాజు బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు కనకాల శ్యాంకుర్మ బీసీ యువజన సంఘం సెక్రటరీ భాస్కర్ మరియు బీసీ నాయకులు పాల్గొన్నారు

# విలేకరుల సేవలు వెలకట్టలేనివి

- **కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి**

**మేడిపల్లి వెలుతురు జూలై 04:**

ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధి లాంటి వారు పత్రిక విలేకరులని ఫీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి




అన్నారు.మేడిపల్లి మండల ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నికైన సందర్భంగా ప్రెస్ క్లబ్ ఆవరణలో కమిటీ సభ్యులను కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆధ్వర్యంలో శుక్రవారం నాడు సన్మానించడం జరిగింది.ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ ప్రజలకు మంచి వార్తలను అందించే విధంగా విలేకరులు పనిచేయాలని తమ విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని అన్నారు.ప్రజా సమస్యలను ప్రతిబింబించేలా వారి మన్ననలు పొందాలని అన్నారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చిర్ర శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ...మేడిపల్లి మండల పరిధిలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు వచ్చే విధంగా ప్రజా పాలన ప్రభుత్వం కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ముఖ్య సలహాదారులు వి.సూర్యనారాయణ రెడ్డి,మాజీ అధ్యక్షుడు కల్యారి ఎల్లయ్య,ప్రధాన కార్యదర్శి వడ్డేమాను సుందర్,కోశాధికారి మరాటి మల్లేష్ ఉపాధ్యక్షులు సైరెడ్డి సాగర్ రెడ్డి,చింత రమేష్,కోఆర్డినేటర్ రావు నాగిరెడ్డి,సంయుక్త కార్యదర్శులు చిన్నం మధు,నీరుడు అంజన్ కుమార్,దాసరి దయాకర్ రెడ్డి,కార్యవర్గ సభ్యులు బుషా గణేష్,భాస్కర చారీ,శేరి కరుణాకర్ రెడ్డి,మరాటి మత్స్యగిరి,జక్కు భగీరథరెడ్డి,జంగా నరేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవిలో నాన్ టీచింగ్ స్టాఫ్ ను నియమించాలి

- జాజుల లింగంగౌడ్

**హైదరాబాద్ వెలుతురు జూలై 04:**



కేజీబీవీలో వెంటనే నాన్ స్టిచింగ్ స్టాఫ్ లో నియమించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగగౌడ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి విద్యాశాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజీబీవీ లో జూనియర్ కాలేజీలను ప్రారంభించారు గాని దానికి తగ్గట్టు నాన్ టీచింగ్ స్టాఫ్ ను నియమించక పోవడం వలన అందులో పని చేసేటటువంటి స్టాప్ కు కాలేజీ పని మొత్తం వారి మీద పడడం వలన రిజిస్టర్స్ రాయడం,విద్యార్థుల రికార్డు రాయడం, స్టడీ కండక్ట్స్ రాయడం నుంచి ప్రతిదీ వాళ్లే చేయడంతో విద్యార్థులకు సరైన న్యాయం చేయలేకపోతున్నారు నాన్ టీచింగ్ చేయవలసినటు వంటి పనులన్నింటినీ టీచింగ్ స్టాఫ్ తో చేయడంతో వాళ్లు మానసికంగా బాగా ఇబ్బంది పడుతున్నారనీ కావున రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కేజీబీవీ లో నాన్ టీచింగ్ స్టాఫ్ ను నియమించాలి.

ఇందుమూలంగా మీడియా ముఖంగా తెలియచే యునది ఏమనగా... హయత్ నగర్ ఎక్సయిస్ స్టేష న్ పరిధిలో వివిధ రకాల కేసులలో పట్టుబడ్డ (09) వాహనాలు,(9 టూ వీలర్లు ) చట్ట ప్రకారం నిబంధ నల మేరకు 05.07.2025 నాడు ఉదయం 11 గంటలకు వేలం వేయడం జరుగుతుందని, తగిన సమాచారం కోసం (8712658743) కి ఫోన్ ద్వా రా గానీ, లేదా నేరుగా గానీ సంప్రదించగలరని హయ త్నగర్ ఎక్సయిస్ సి.ఐ., ధనవంత్ రెడ్డి తెలిపారు.

**హయత్ నగర్ వెలుతురు జూలై 04:**

## బడుగు బలహీన వర్గాల నాయకుడు వంగవీటి మోహన్ రంగా..

- కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్



**కూకట్ పల్లి జూలై 4 వెలుతురు:**

మోహన్ రంగా ఒక సామాజికవర్గానికి చెందిన నేత మాత్రమే కాదని, బడుగు బలహీన వర్గాల వెన్నంటి ఉండి వారికి అండగా నిలిచారని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. శుక్రవారం రంగా జయంతి సందర్భంగా ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ లో వంగవీటి రంగా విగ్రహానికి ఆయన పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సామాజిక ఉద్యమ వీరుడు, రాజకీయ దురంధరుడు పేదల సమస్యల పరిష్కారం కోసం పోరాడిన గొప్ప వ్యక్తి రంగా అని కొనియాడారు. చిరంజీవిగా ఎప్పుడూ ప్రజల గుండెల్లో చిరకాలం జీవిస్తూనే ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, భాస్కర్, రాంబాబు, సాంబశివ రావు, సత్యనారాయణ, కృష్ణారావు, ప్రసాద్, దొరబాబు, ఏసు, వంగవీటి రంగా అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఎల్బీ స్టేడియం కి తరలిన కాంగ్రెస్ శ్రేణులు..



**కూకట్ పల్లి జూలై 4 వెలుతురు:**

తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎల్బీ స్టేడియంలో సామాజిక న్యాయ సమర భేరి పేరిట నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభకు ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్న నేపథ్యంలో శుక్రవారం ఆల్విన్ కాలనీ డివిజన్ నుండి కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో భారీగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లతో కలిసి సభా ప్రాంగణానికి తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బ్రిటిష్ సామ్రాజ్యాన్ని వెన్నులో వణుకు పుట్టించిన యోధుడు అల్లూరి...

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు...



**కూకట్ పల్లి జూలై 4 వెలుతురు:**

బ్రిటిష్ సామ్రాజ్యాన్ని వెన్నులో వణుకు పుట్టించిన మహా యోధుడు అల్లూరి సీతారామరాజు అని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శుక్రవారం సీతారామరాజు జయంతి సందర్భంగా కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ముమ్మిడివరం ఎమ్మెల్యే సుబ్బరాజు లు కెపిహెచ్బి కాలనీ 1వ రోడ్ లో అల్లూరి సీతారామరాజు స్పోర్ట్స్ గ్రౌండ్ లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ మన్యం ప్రజల ఆరాధ్య దైవం అల్లూరి సీతారామరాజు ఆయన స్ఫూర్తిని నేటి యువతరం అందరికీ తెలిసేలా పెద్దలు వివరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు, సీనియర్ నాయకులు శ్యామలరాజు, కిరణ్ వర్మ , భీమరాజు, ప్రభాకర్ గౌడ్, పాతూరి గోపి, స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మోహన్ రంగా కి నివాళులర్పించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు...



**కూకట్ పల్లి జూలై 4 వెలుతురు:**

వంగవీటి మోహన్ రంగా జయంతి సందర్భంగా కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు టెంపుల్ బస్ స్టాప్, బాలాజీ నగర్ లోని రంగా విగ్రహాలకి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు, డివిజన్ అధ్యక్షులు ప్రభాకర్ గౌడ్, నాయకులు భరత్ కుమార్, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

https://epaper.velthuru.com

నల్గొండ

వెలుతురు

# కల్లు గీత కార్మికుడి కుటుంబానికి గోపా డివిజన్ అధ్యక్షులు సమ్మి గౌడ్ పరామర్శ

## అనంతరం వారి కుటుంబానికి 1క్వింటా బియ్యం అందజేత


**కేసముద్రం వెలుతురు జూలై 04:**

కేసముద్రం మండలం అర్పణ పల్లి గ్రామానికి చెందిన బబ్బురు రవి భార్య యాక లక్ష్మి బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో ఇటీవల మరణించగా మృతురాలి కుమారుడు కార్తీక్, కుమార్తె సుష్మలను శుక్రవారం వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మృతురాలు యాక లక్ష్మి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ ఘన నివాళు లర్పించారు గోపా డివిజన్ అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్. అనంతరం వారి కుటుంబానికి 1 క్వింటా బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో కేజీకేఏస్ మండల అధ్యక్షులు బబ్బురు ఉప్పలయ్య, మాజీ సర్పంచ్ గంధసిరి సోమయ్య, మోడం రాజు,ఈర యాదమ్మ,సింగని మల్లేష్,షేక్ జానీ, గంగపురపు వెంకన్న, గంధం సంతోష్,షేక్ సైదులు,, వెంకన్న, విజేందర్,కృష్ణ, సాంబయ్య,,యాకన్న, సతీష్,రవి,



హరీష్,రఫీ, ఆశా, హర్షిత్, విజేందర్, రవి,కిషన్, అరవింద్, విజేందర్, సోమయ్య, ప్రణయ్,రంగయ్య, సద్దాం, మొగిలి, సత్యం, సుధాకర్,రాము,రమ, జ్యోతి,శ్రావణి, జయమ్మ,శోభ, ఫాతిమా,కొమురమ్మ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

# గుండాల బ్రహ్మయ్య దశదినకర్మకు హాజరైన సమ్మి గౌడ్ చిలువేరు



**ఇనుగుర్తి వెలుతురు జూలై 04:**

ఇనుగుర్తి మండలం చిన్న నాగారం గ్రామానికి చెందిన మిడ్ వెస్ట్ గ్రానైట్ లో ప్రొక్లైనర్ ఆపరేటర్ గుండాల సారయ్య తండ్రి గుండాల బ్రహ్మయ్య ఇటీవల మరణించగా శుక్రవారం వారి దశదినకర్మకు హాజరై వారి కుమారులు గుండాల సమ్మయ్య, సారయ్య లను వారి ఇంటికి వెళ్లి పరామర్శించి బ్రహ్మయ్య పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ వారి చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించారు సమ్మి గౌడ్ ఫౌండేషన్ అధినేత గోపా డివిజన్ అధ్యక్షులు కాంగ్రెస్ మండల నాయకులు చిలువేరు సమ్మయ్య గౌడ్.. ఈ కార్యక్రమంలో వారి వెంట ఎర్రం శెట్టి అశోక్,దాసరి ప్రకాష్, రవి,బైరు వినయ్, గుర్రం రాజేష్, ఉడుత అనిల్ తదితరులు ఉన్నారు.

# మానవత్వం చాటిన ప్లే స్కూల్ యజమాని సైనతు హుస్సేన్

**- నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ**

**- తూప్రాన్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం**

**తూప్రాన్, వెలుతురు జులై 04:**

తూప్రాన్ లోని వెంకటేశ్వర టాకీస్ ఎదురుగా ఉన్న ఆర్ట్ అండ్ స్మార్ట్ ప్లే స్కూల్ యజమాని సైనతు హుస్సేన్ మానవత్వం చాటి నిరుపేదలకు నిత్యావసర సరుకులు తూప్రాన్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించి పంపిణీ చేశారు. స్వామి వివేకానంద వర్ధంతి, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా శుక్రవారం ఉదయం తూప్రాన్ లయన్స్ క్లబ్ తో కలిసి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బ్రతుకు భారంగా ఏల్లదీస్తున్న ఎల్కంటి రాములు, యాదమ్మ దంపతులు తూప్రాన్ లో రేకుల షెడ్డు వేసుకొని జీవిస్తున్నారు. కాగా ఎల్కంటి రాములు ఆరోగ్యం బాగాలేక కష్టం చేసుకొలేని స్థితిలో ఫించన్ రాక జీవితం భారంగా ఎల్లదీస్తూ కడుదయనీయ స్థితిలో కుటుంబాన్ని ఎల్లదీస్తున్నాడు. ఈ విషయం తెల్సుకున్న తూప్రాన్ ఆర్ట్



అండ్ స్మార్ట్ ప్లే స్కూల్ యజమాని సైనతు హుస్సేన్ మానవత్వం పరిమళించే మంచి మనసుతో తూప్రాన్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు బియ్యం పప్పు, ఉప్పు, పిండి, జిలకర, ఆవాలు, మెంతులు, సర్ఫ్, రిన్ సబ్బులు, లక్స్ సబ్బు లు, మంచినునే, మిర్చి ఫౌడర్, పల్లీలు, పుట్నాలు, ముర్మురాలు, చక్కర, చాయిపత్తి, ఉప్మారవ్వ, బీర కాయలు, చిక్కుడు కాయ, టమాట, ఉల్లిగడ్డ, సొరకాయ, కోతిమీర్, కర్యమాకు, పుదీన, అరటి పండ్లు, ఆరెంజ్ తోపాటు పలు రకాల నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఎల్కంటి రాములు యాదమ్మ లు మాట్లాడుతూ మీరు సల్లగా ఉండాలి, మీ స్కూల్ మంచిగా నడవాలని దీవించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ లయన్స్ క్లబ్ సెక్రెటరీ లయన్ డాక్టర్ జానకిరామ్ సిఆర్, టీచర్లు శిరీష, రమాదేవి, మౌనిక, షకీలా తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అందుబాటులో సరిపడా యూరియా

**- ఈనెల 15 లోపు సభ్యత్వ నమోదు చేసుకోవాలి.**

**- సింగిల్ విండో చైర్మన్ నంద్యాల బిక్షం రెడ్డి**

**రామన్నపేట వెలుతురు న్యూస్ జులై 04**



మండలంలో యూరియా కొరత ఉన్నదని అపోహలు వస్తున్నందున రైతులు నమ్మి అధైర్య పడోద్దని మండలానికి సరిపడా యూరియా సింగిల్ విండో కార్యాలయంలో అందుబాటులో ఉన్నదని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని, సింగిల్ విండో చైర్మన్ నంద్యాల బిక్షం రెడ్డి తెలిపారు. శు క్రవారం నాడు ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రామన్నపేట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో సభ్యత్వం కావలసినవారు, ఈనెల 15వ తారీకు చివరి తేదీ అని ఆలోపు తగు పత్రాలు జత చేసి కోరారు.గవర్నమెంట్ నిర్ణయించిన 1150 రూపాయల రుసుముతో పాటు రెండు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు, ఆధార్ కార్డు, భూమి పాస్ బుక్ జతచేసి రామన్నపేట సింగిల్ విండో ఆఫీసులో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

# ప్రైవేటు నుండి ప్రభుత్వ బడికి మెరుగైన అడ్మిషన్లు

## - ఎంఈఓ గవ్వ జ్యోతి

**రామన్నపేట వెలుతురు న్యూస్ జులై 04:**

మండలంలో నిర్వహించిన ముందస్తు బడిబాట మరియూ జూన్ లో నిర్వహించిన, ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట వలన కొంతమేర,సత్ఫలితాలితాలొచ్చాయని తల్లిదండ్రులలో ప్రభుత్వ బడులపై నమ్మకం పెరగడం,సంతోషదాయకమని, ప్రైవేటు బడుల నుండి ప్రభుత్వ బడులకు అడ్మిషన్లు మెరుగయ్యాయని రామన్నపేట మండల విద్యాధికారి గవ్వ జ్యోతి అన్నారు. విలేఖరులతో మాట్లాడుతూ, రామన్నపేట మండలం లోని ప్రభుత్వ బడులకు ఈ సారి 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు ప్రైవేటు పాఠశాలల నుండి 249 అడ్మిషన్లు, ప్రభుత్వ పాఠశాల ల నుండి 420 అడ్మిషన్లు, మొత్తంగా 669 అడ్మిషన్లు రావడం జరిగిందని, ఎంఈఓ జ్యోతి తెలిపారు. వీటిలో ముఖ్యంగా మునిపంపుల కాంప్లెక్స్ పరిధిలోని, ఇస్కిళ్ళ ప్రాథమికోన్నత పాఠశాలకు ప్రైవేటు మరియూ ప్రభుత్వ అడ్మిషన్లు కలిపి 125 అడ్మిషన్లు వచ్చాయని, కక్కిరేణి ప్రాథమిక పాఠశాల కు 44 అడ్మిషన్లు, మునిపంపుల ఉన్నత పాఠశాలకు 31 అడ్మిషన్లు, ఇంద్రపాలనగరం కాంప్లెక్స్ పరిధిలోని ఇంద్రపాలనగరం ఉన్నత పాఠశాలకు 39 అడ్మిషన్లు, వెల్లంకి ఉన్నత పాఠశాలకు 34 అడ్మిషన్లు, వెల్లంకి ప్రాథమిక పాఠశాలకు 37 అడ్మిషన్లు, రామన్నపేట కాంప్లెక్స్ పరిధిలోని రామన్నపేట హరిజనవాడ ప్రాథమికోన్నత పాఠశాలకు 37 అడ్మిషన్లు, గవర్న మెంట్ ఉననత పాఠశాల 26 అడ్మిషన్లు, రామన్నపేట బాలికల ఉన్నత పాఠశాలకు 24 అడ్మిషన్లు, కొమ్మాయిగూడెం ఉన్నత పాఠశాలకు 18 అడ్మిషన్లు, సిరిపురం ప్రాథమిక పాఠశాలకు 17 అడ్మిషన్లు వచ్చాయని, మిగతా పాఠశాలల్లో కూడా అడ్మిషన్లు భాగానే పెరిగాయని, మొత్తంగా మండలంలోని ప్రభుత్వ బడులలో 669 అడ్మిషన్లు రావడం జరిగిందని, ఇంకా అడ్మిషన్ల సంఖ్య పెరిగేలా మండలంలోని ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని ఎంఈఓ గవ్వ జ్యోతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ బడులలోనే నాణ్యమైన విద్య లభిస్తుందని, ఉచిత పుస్తకాలు, ఉచిత యూనిఫాం, పోషకాలతో కూడిన రుచికరమైన మధ్యాహ్న భోజనం,



అనుభవజ్ఞులైన శిక్షణ పొందిన ఉపాధ్యాయుల బోధన లభిస్తుందని, విద్యార్థి సమగ్రాభివృద్ధి జరగాలంటే ప్రభుత్వ బడులలోనే తమ పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు ఆమె విజ్ఞప్తి చేశారు.

# ఘనంగా దొడ్డి కొమరయ్య వర్ధంతి





**మునుగోడు, జూలై 4 (వెలుతురు):**

తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య 79 వ వర్ధంతిని కురుమ యువ చైతన్య సమితి,సిపిఐ ఆధ్వర్యంలో శుక్రవారం వేర్వేరుగా నిర్వహించారు.ఈ సందర్భంగా పట్టణ కేంద్రంలోని స్థానిక బస్టాండ్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో నైజాం సర్కార్ కు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడిన తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అన్నారు. భూమి కోసం ముక్తి కోసం పేద ప్రజల విముక్తి కోసం ఆయన చేసిన పోరాటాలను కొనియాడారు.నేటి సమాజానికి దొడ్డి కొమరయ్య పోరాటం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, జిల్లా కౌన్సిల్ సభ్యులు లాలు,కె వై సి ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి బండారు శంకర్,కేవైసీఎస్ మండల అధ్యక్షులు బండారు శ్రీనివాస్,మలిగ యాదయ్య,బండారు మహేష్, పరమేష్, నాగరాజ్,బెల్లం శివయ్య,కురుమూర్తి ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి బడ్జెట్ పెంచాలి

## సిపిఐ జిల్లా సమితి సభ్యులు సురిగి చలపతి.

**మునుగోడు,జూలై 4 (వెలుతురు):**

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి బడ్జెట్ పెంచాలని సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఎలగలగూడెం గ్రామం మాజీ సర్పంచ్ సురిగి చలపతి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం మండలం పరిధిలోని ఎల్గల గూడెం గ్రామంలో ఈదులకంటి మంజుల శేఖర్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ముగ్గు పోసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు ప్రారంభం కావడంతో మార్కెట్లో సి మెంట్,స్టీల్,కంకర,మేస్త్రి కూలీల రేట్లు విపరీతంగా పెరగడంతో ప్రభుత్వం కేటాయించిన ఐదు లక్షల బడ్జెట్ సరిపోయేలా కనిపించడం లేదని తక్షణమే ప్రభుత్వ స్పందించి బడ్జెట్ పెంచాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు మంజూరు చేయాలని గతంలో రాతి కట్టడం కట్టుకున్న వారికి కూడా ఇల్లు నిర్మించుకునేలా అవకాశం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డ్ మెంబర్లు కట్కూరి లింగస్వామి,మంజుల, సైదులు,ఉదయ్,శేఖర్, యాదయ్య,వెంకన్న తదితరులు పాల్గొన్నారు.





# బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు నీ సన్మానించిన మాజీ ఎంపీటీసీ కన్నెకంటి వెంకటేశ్వరాచారి.

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 04:**


భారతీయ జనతా పార్టీ నూతనంగా ఎన్నిక కాబడ్డ రాష్ట్ర రథసారధి రాంచందర్ రావు ని హైదరాబాదు వారి గృహంలో బిజెపి సీనియర్ నాయకులు మాజీ ఎంపీటీసీ కన్నెకంటి వెంకటేశ్వరాచారి నేతృత్వంలో భాజపా నాయకులతో కలిసి ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు మాట్లాడుతూ రాబోవ స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి సత్తా చాటాలని కోరారు. ఈ యొక్క కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు కటుకూరి బిక్షపతి, కొమ్ము యాదయ్య, నకీరకంటి సుదర్శన్, కోనూరు సుధాకర్, గుండాల అంజయ్య, రాజన్న రమేష్, డోగిపర్తి భాస్కర్, కోడారి వెంకటేష్ యాదవ్, గుంటోజు కృష్ణమాచారి, తాటిపాముల లింగస్వామి, ఏలూరు రవి, సూర్వి హరిబాబు, యాదాసు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# కొణిజేటి రోశయ్య 92వ జయంతి వేడుకలు

## - రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా.

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 04**

ఎంతో గొప్ప వ్యక్తిత్వం.. ఎన్నో పదవులు.. ఉత్తమ విలువలు కలిగిన మహనీయుడు అని రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా కొణిజేటి రోశయ్య 92వ జయంతి వేడుకలల్లో కొనియాడారు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 50 ఏళ్ల క్రియాశీల రాజకీయాల్లో చురుగ్గా ఉన్నా వివాద రహితుడిగా పేరు పొందారని రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా పేర్కొన్నారు. కొణిజేటి రోశయ్య 92వ జయంతి వేడుకలు రామగుండము పోలీస్ కమీషనరేటులో ఘనంగా జరిగాయి. రామగుండము పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా కొణిజేటి రోశయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా సీపీ



మాట్లాడుతూ.. ఎంతో గొప్ప వ్యక్తిత్వం.. ఎన్నో పదవులు.. ఉత్తమ విలువలతో.. ఆ పదవులకే వన్నెతెచ్చిన రాజకీయ దురంధరుడు రోశయ్య అని అన్నారు. తెలుగు రాష్ట్ర రాజకీయాల్లో



అందరివాడు, ఉమ్మడి రాష్ట్రంలో 16 సార్లు ఆర్థిక మంత్రి హోదాలో బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత రోశయ్య దక్కించుకున్నారని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా రాజీనామా చేసిన తర్వాత తమిళనాడు గవర్నర్‌గా రోశయ్య సేవలు అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ మల్లారెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రాజేంద్ర ప్రసాద్ .భీమేశ్ ,సిసి ఆర్ బి ఇన్స్పెక్టర్ సతీష్ , ఎ ఓ శ్రీనివాస్ సూపరిన్ డింట్ లు సందీప్, ఇంద్రసేనా రెడ్డి, సంధ్య , ఆర్ఐ లు దామోదర్, వామన మూర్తి, మల్లేశం, సీపీఓ సిబ్బంది, వివిధ వింగ్స్ సిబ్బంది, అర్మడ్, స్పెషల్ పార్టీ, తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ వెలుతురు

# జులై 9న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

## సీఐటీయూ హైదరాబాద్ నగర నాయకులు ఎమ్. దశరద్





**హైదరాబాద్ వెలుతురు జూలై 04:**
లేబర్ కోడ్ లను రద్దు చెయ్యాలని జులై 9 న జరిగే దేశ వ్యాప్త సమ్మె ను జయప్రదం చేయాలని కోరుతూ ముషీరాబాద్ జోన్ లోని మునిసిపల్ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, ఆటోడ్రైవర్, అంగన్వాడీ ఆశ వర్కర్స్ , వివిధ రంగాలలో కార్మికులు పని చేస్తున్న ప్రాంతాలలో ఆటో జాత నిర్వహించడం జరిగింది. ఈ సందర్భగా సీఐటీయూ హైదరాబాద్ నాయకులు %ఎ%. దశరత్ మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకొస్తున్న ప్రమాదకర లేబర్ కోడ్ లను,



కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతికటించాలని అన్నారు కార్మికులను కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోట్లను తీసుకువచ్చి పెట్టుబడిదారులకు, ధనవంతులకు ప్రయోజనాలు చేకూర్చే ప్రయత్నాలు చేస్తుందని తీవ్రంగా విమర్శించారు. ఎనిమిది గంటల పనిని రద్దు చేసి 12 గంటల పని తీసుకురావడం వలన కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. కార్మిక వర్గం సమరశీల పోరాటాల ద్వారా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వారి స్థానంలో నాలుగు లేబర్ కోడ్ లను ముందుకు తెచ్చి పారిశ్రామిక సంబంధాలు కోడు ద్వారా ఫిక్స్ టర్మ్ ఎంప్లాయిమెంట్ ను చట్టబద్ధం చేసి రెగ్యులర్ ఉద్యోగుల ఉద్యోగ భద్రతను ముప్పు తెచ్చింది ఈ కోడ్ ల వలన సంఘాలను ఉద్యోగుల కార్మికుల సంఘటన శక్తిని బలహీన పరుస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు, మున్సిపల్ కార్మికులు కొన్ని దశాబ్దాలుగా పనిచేస్తున్న వారికి కనీస వేతనాలు పెంచకపోవడం దుర్మార్గమని అన్నారు. మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం 26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు, లేబర్ అడ్డ మీద అనేక మంది పేద కార్మికులు ఉంటారని వారికి ఎలాంటి సౌకర్యం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. వారికి,మూత్ర శాలలు మంచినీళ్లు, సౌకర్యం కల్పించాలి,అన్నారు, బీజేపీ కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక లేబర్ కోడ్ లను తీసుకొచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తుందని అన్నారు. కార్మికుల హక్కులను సాధించుకోవడం కోసం జులై 9న సమ్మెను జయప్రదం చేయండి అని అన్నారు. అడ్డ వద్ద కనీస సౌకర్యాలు లేవు కార్మికులకు పనులు లేక రోడ్డు మీద ఎండలో ఉదయం నుండి సాయంత్రం వరకు పని కోసం నిరీక్షణ చేసే పరిస్థితి ఉంది పట్టణ ఉపాధి హామీ కల్పించి సంవత్సరానికి ?200 రోజులు పని కల్పించాల్సిందిగా డిమాండ్ చేశారు మరియు అడ్డవద్ద షెడ్డు ఏర్పాటు చేసి మంచినీళ్ల సౌకర్యం కల్పించి ఐదు రూపాయల భోజనం ఏర్పాటు చేసి ఆ సంఘటిత రంగ కార్మికులను ఆదుకోవాలని తెలిపారు అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం భవ నిర్మాణ కార్మికులకు ఇన్సూరెన్స్ కార్డులు వేలు ముద్ర లోని మీ సేవ చుట్టూ తెప్పించుకొని వివో సి కార్డులో తీసుకోకుండా కుట్ర పన్నుతున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మికులందరూ కలిసి పోరాడాలన్నారు ఆధార్ కార్డు ఆధారంగానే కార్డులు రెన్యువల్ చేసి కొత్త కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేయడం జరిగింది జులై 9 న జరిగే సమ్మెలో భాగంగా సుందరయ్య పార్క్ నుండి ఇందిరా పార్క్ వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహిస్తున్నామని అ ర్యాలీ లో అందరూ పాల్గొని విజయవంతం చెయ్యాలని అలాగే. మున్సిపల్ కార్మికులు %+ఎవీజ% హెడ్ అఫిస్ దగ్గర జరిగే ధర్నాలో పాల్గొనాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సీఐటీయూ ముషీరాబాద్ జోన్ కార్యదర్శి టి. మహేందర్, ఆర్ వెంకటేష్, నాయకులు బాబు, రమేష్ .కృష్ణస్వామి, మల్లేష్, శ్రీనివాస్,పాషా,తదితరులు పాల్గొన్నారు.

# గురువుల పాదపూజ కార్యక్రమానికి శ్రీశ్రీశ్రీ త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి వారు రాక



**హైదరాబాద్ వెలుతురు జూలై 04:**
లక్ష్యసాధన ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో పాఠశాల గురువులకి బంగారు పూలతో పాదపూజ మహోత్సవంజులై 6తేదీ 20 25 చిలుకూరు కేంద్రంగా జరగబోయే కార్యక్రమం యొక్క గోడ పత్రికను శ్రీ శ్రీ శ్రీ త్రీ దండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి వారు చిన్న జీయర్ స్వామి ఆశ్రమం దివ్య సాకేతం శంషాబాద్ లో ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో లక్ష్యసాధన ఫౌండేషన్ చైర్మన్ ప్రజ్ఞా రాజు,తెలుగు భాష చైతన్య సమితి అధ్యక్షులు బడేసాబ్ మరియు ఇతర ప్రముఖులైన మహేష్, ఓంకార్ పాల్గొన్నారు ఈ శుభ సందర్భంలో శ్రీశ్రీశ్రీ జీయర్ స్వామి మాట్లాడుతూ గురువులను ఎప్పుడో మర్చిపోయినఈనాటి సమాజంలో 30 సంవత్సరాల కిందట పాఠశాలల్లో పాఠాలు బోధించిన గురువులను గుర్తించి వారందరిని ఒక చోటికి తీసుకుని వచ్చి వారి యొక్క యోగక్షేమాలు తెలుసుకొని వారిని కేవలం సత్కరించడమే కాకుండాప్రత్యేకంగా తయారు చేయించిన బంగారు పువ్వులతో పాదపూజను నిర్వహించడం నిజంగా మెచ్చుకోదగ్గ విషయమేఇలాంటి కార్యక్రమాలు అన్ని పాఠశాలల్లో నిర్వహించాల్సిన అవసరం ఈనాటి సమాజంలో ఎంతో ఉందని వారు చెబుతూ చిలుకూరులో లక్ష్యసాధన ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో గురువులకి బంగారు పూలతో పాదపూజా మహోత్సవంలో తప్పకుండా నేను పాల్గొంటానని స్వామివారి మంగళ శాసనం ఇచ్చారు.

# డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి ని పరామర్శించిన బీఆర్ఎస్వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తొన్నుపూరి శ్రీకాంత్ గౌడ్



**హైదరాబాద్ వెలుతురు జూలై 04:**
ఇటీవల ప్రమాదానికి గురై, శస్త్ర చికిత్స అనంతరం హైదరాబాద్ లోని వారి నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న జనగామ శాసనసభ్యులు డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి ని పరామర్శించిన బీఆర్ఎస్వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తొన్నుపూరి శ్రీకాంత్ గౌడ్. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా ని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించడం జరిగింది.

# మహనీయుల స్ఫూర్తిని భావితరాలకు అందిద్దాం...

## - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 04**
ప్రజల సంక్షేమం కోసం విశేష కృషి చేసిన మహనీయుల స్ఫూర్తిని భావితరాలకు అందిద్దామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన తెలంగాణ సాయుధ పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతి కార్యక్రమాలలో పాల్గొని మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో దొడ్డి కొమురయ్య పాల్గొని పీడిత ప్రజల సంక్షేమం కోసం వీరోచితంగా పోరాడి అమరుడయ్యాడని, ప్రజా ఉద్యమ స్ఫూర్తికి నిదర్శనంగా నిలిచారని తెలిపారు. పేద ప్రజల హక్కుల కోసం, సామాజిక సమానత్వం కోసం నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించారని అన్నారు. ఉ మ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా, తమిళనాడు రాష్ట్ర గవర్నర్ గా పని చేసిన కొణిజేటి రోశయ్య గొప్ప ఆర్థికవేత్త అని, రాజకీయ, ప్రజా సేవా రంగాలలో చిరస్మరణీయమైన స్థానాన్ని సంపాదించుకున్నారని అన్నారు. ఉమ్మడి రాష్ట్ర ఆర్థిక మంత్రిగా పని చేసిన సమయంలో సంక్షేమ పథకాలకు నిధుల సమీకరణ చేయడంలో కీలక పాత్ర పోషించారని, 16 సార్లు రాష్ట్ర బడ్జెట్ ను సమర్పించారని తెలిపారు. రాజ్యాంగానికి నిబద్ధత చూపుతూ తమిళనాడు గవర్నర్ గా నిష్పక్షపాతంగా ప్రజలకు ఎన్నో సేవలు అందించారని తెలిపారు. మహనీయుల వర్ధంతి, జయంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని, ఇదే స్ఫూర్తితో భావితరాలకు దేశ త్యాగధనుల ఆదర్శాన్ని అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎ. పురుషోత్తం, జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి దుర్గాప్రసాద్, జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి హనుమంత రెడ్డి, కుల సంఘాల నాయకులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుల సమ్మేళనం నకు హాజరైన కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్

## హిమాయత్ నగర్ డివిజన్ నుంచి భారీ సంఖ్యలో హాజరైన సీనియర్ కాంగ్రెస్ నాయకులు రామన్ గౌడ్ అనుచరులు




**హైదరాబాద్ వెలుతురు జూలై 04:**
శుక్రవారం రోజున కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుల సమ్మేళనం లాల్ బహదూర్ స్టేడియంలో జాతీయ అధ్యక్షులు మల్లికార్జున కార్గే అధ్యక్షతన నిర్వహించడం జరిగింది, ఈ ఒక్క సమావేశానికి తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఖైరతాబాద్ శాసనసభ్యులు మాజీ మంత్రివర్యులు దానం నాగేందర్ పిలుపు మేరకు హిమాయత్ నగర్ డివిజన్ నుంచి భారీ సంఖ్యలో కార్పొరేటర్ మహాలక్ష్మి సీనియర్ కాంగ్రెస్ నాయకులు రామన్ గౌడ్ అనుచరులు భారీ సంఖ్యలో లాల్ బహదూర్ స్టేడియం కి బయలుదేరడం జరిగింది ప్రాంగణమంతా కాంగ్రెస్ కార్యకర్తలతో నాయకులతో కిక్కిరిసిపోయింది జై రేవంత్ జై రాహుల్ గాంధీ అనే నినాదాలతో స్టేడియం మొత్తం మారుమోగిపోయింది మొత్తం చుట్టుపక్కల ప్రాంతాలన్నీ జనసముద్రంగా మారిపోయాయి వస్తున్న పబ్లిక్ ని చూస్తుంటే రాష్ట్రంలో రేవంత్ రెడ్డి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వ పునర్ వైభవం వైయస్ రాజశేఖర్ రెడ్డి గారి తరువాత రాష్ట్రం అభివృద్ధి పదం వైపు నడుస్తుందని ప్రజలందరం కూడా రేవంత్ గారి నాయకత్వంలో ఆయన యొక్క అభివృద్ధి కార్యక్రమాలు చూసి ఆయనతో అడుగులో అడుగేసి నడుస్తున్నారని అనిపిస్తుంది సీనియర్ నాయకులు రామన్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత అన్ని వర్గాల ప్రజలకి సమ న్యాయం జరుగుతుందని అది ప్రజలు గుర్తిస్తున్నారని తెలియజేశారు ఈ కార్యక్రమంలో డివిజన్లోని ముఖ్య నాయకులు పాదయాత్రగా లాల్ బహదూర్ స్టేడియం వైపు అడుగులు వేశారు, ఈ యొక్క కార్యక్రమానికి వినోద్, డివిజన్ అధ్యక్షులు నయీమ్, శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్, జాకీ హుస్సేన్, పూర్ణచందర్, యాదగిరి, ప్రియరాజస్వాల్, రమేష్, సుజాత, అనూష, పూర్ణిమ, అభిషేక్, అజర్, చాంద్ పాషా, బాల్ కిషన్, జోసెఫ్, జై కృష్ణ, భాష, సుధాకర్, సాహెబ్, ఫారుక్, మోసిన్, సందీప్, శేఖర్, హితేష్, తదితరులు పాల్గొనడం జరిగింది.

# సాయుధాగ్ని రగిల్చిన విప్లవాగ్ని దొడ్డి కొమురయ్య

- తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి అంకురార్పణ జరిగిందని అతడోక తెలంగాణ వేగుచుక్క రేపటి వెలుగుల దివిటీ
- మాజీ యంఎల్ఏ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి



**హైదరాబాద్ వెలుతురు జూలై 04:**
దొడ్డి కొమురయ్య ఆ యోధుడు రగిల్చిన విప్లవాగ్నిదతెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి అంకురార్పణ జరిగిందని అతడోక తెలంగాణ వేగుచుక్క రేపటి వెలుగుల దివిటీ అని మాజీ యం ఏల్ ఎ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం అధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం 11 గంటలకు తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య 79 వ వర్ధంతి సందర్భంగా యోధుడు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. లెవీ ధాన్యానికి వ్యతిరేకంగా.. భూమి కోసం భుక్తి, ముక్తి కోసం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం కమ్యూనిస్టు పార్టీ ఆద్వర్యంలో వీరోచితంగా పోరాడారు 4 వేయిల మంది వీరులు ప్రాణాలు కోల్పోయిన 10 లక్షలు ఎకరాలు పేదలకు పంచిన సాయుధ విప్లవ మహత్తర పోరాటం అని అన్నారు 60 గ్రామాలకు మకుటం లేని కరుడుగట్టిన భూస్వామి ని ఊరు నుండి గడీ నుంచి తరిమి కొట్టిన చరిత్ర దొడ్డి కొమరయ్య కుందని అన్నారు ప్రపంచ చరిత్రలో ఒక వీరుడిగా.. పోరాట స్ఫూర్తినే ప్రపంచానికి చాటిన నిప్పుకణిక దొడ్డి కొమురయ్య అని వారి నిజ చరిత్ర వారసులు గా భావి తరాలకు అందించటానికి పల్లెలకు పోదాం -ప్రజలకు చెప్పుదాం చరిత్ర ను వక్రీకరించే కాషాయుల కడిగేద్దాం అని రంగన్న పిలుపు నిచ్చారు SVK కార్యదర్శి ఎస్ వినయ్ కుమార్ మాట్లాడుతూ బడుగుల సాదించిన సాయుధ పోరాట విజయాలను అనాటి కాంగ్రెస్ పార్టీ కమ్యూనిస్టులపై కక్ష్యతో రజాకార్లను భూస్వాములను చేరదీసి రైతాంగ సాయుధ పోరాటానికి ద్రోహం చేశారని అన్నారు ఆ పోరాటం చెరిపేస్తే చేరగని చరిత్ర ఎవ్వరూ వక్రీకరించినా.. తెలంగాణ ప్రజా కోర్టులో ద్రోహులుగా నిలబడుతారని చరిత్ర ను చరిత్ర గానే చుడాలని విద్యార్థులకు వివరించారు. తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రజాకార్ సినిమాకు గద్దర్ అవార్డ్స్ ఇవ్వడం లోనే.. కాంగ్రెస్ తన కపటత్వం కనిపిస్తుందని అన్నారు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట నిజచరిత్ర ను సాంస్కృతిక యాత్రల ద్వారా పాట ఆట తో ప్రచారం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జానపద జాక్ చైర్మన్ మురళీధర్ దేశ్పాండే SVK నాయకులు బుచ్చిరెడ్డి, ఎన్ సోమయ్య TPTLF రాష్ట్ర కార్యదర్శి ఐతగోని విజయ్ TPSK నాయకులు మహేష్ దుర్గే యూనివర్సిటీ రిసెర్చ్ స్కాలర్స్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు దొడ్డి కొమురయ్య అమరత్వ స్ఫూర్తి తో భూ విముక్తి పోరాటం చెస్తామని ప్రతిజ్ఞ చేశారు అందరూ పుష్పాలతో నివాళులు అర్పించారు

# వనమహోత్సవం లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించాలి

## - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 04**
వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమం లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శు క్రవారం జిల్లాలోని హాజీపూర్ మండలం కర్ణమామిడి గ్రామపంచాయతీ పరిధిలో గల కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయం ఆవరణలో వన మహోత్సవం-2025 కార్యక్రమంలో భాగంగా జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ సమతుల్యాన్ని కాపాడుతూ భావి తరాలకు సహజసిద్ధమైన వాయువును అందించేందుకు ప్రభుత్వం వన మహోత్సవం కార్యక్రమం ద్వారా మొక్కలు నాటడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని తెలిపారు. జిల్లాలోని ఆయా శాఖలకు మొక్కలు నాటేందుకు కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. అనంతరం మంచిర్యాల పట్టణంలోని పాతమంచిర్యాల ప్రాంతంలో నిర్మిస్తున్న ఇందిరా మహిళా భవన్ నిర్మాణ పనులను సందర్శించారు. ప్రభుత్వం మహిళల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తూ ఆర్థికంగా ఎదిగేందుకు ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఇందిరా మహిళా భవన్ నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయ ముట్టడికి నిరుద్యోగుల యత్నం

**హైదరాబాద్,జూలై4( వెలుతురు):**

రాష్ట్ర సెక్రటేరియట్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. 2 లక్షల ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలండర్ విడుదల, మెగా డీఎస్సీ ప్రకటించాలని శుక్రవారం సచివాలయం ముట్టడికి నిరుద్యోగులు యత్నించారు. అప్పటికే భారీగా మోహరించిన పోలీసులు ర్యాలీగా వస్తున్న పలువురు నిరుద్యోగులను అడ్డుకోని మరీ పోలీసు వాహనాల్లో స్థానిక స్టేషన్‌లకు తరలించారు. అలాగే డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో సచివాలయం ముట్టడికి యత్నించారు. ర్యాలీగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ ముట్టడికి యత్నించారు. అన్ని ఉద్యోగాల నోటిఫికేషన్లు విడుదల చేయాలని డివైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి రూ. 4వేలు ఇవ్వాలని, జాబ్ క్యాలండర్‌ను అమలు చేసి ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వాలని, రాజీవ్ యువ వికాస్ పథకాన్ని అమలు చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ముట్టడి నేపథ్యంలో ఉదయం నుంచే సచివాలయం పరిసర ప్రాంతాల్లో భారీగా పోలీసులు మోహరించారు.

# బిజెపి నేతశ్రీరాములు ఇంటిముందు రోహింగ్యాల రెక్కీ



**హైదరాబాద్,జూలై4( వెలుతురు):**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంచార్జ్ అందెల శ్రీరాములు ఇంటి ముందు రోహింగ్యాలు రెక్కీ నిర్వహించారు. అందెల శ్రీరాములు ఇంటి ముందు అనుమానాస్పద తిరుగుతున్న ఆరుగురు వ్యక్తులను బిజెపి కార్యకర్తలు, నేతలు గుర్తించారు. వారు పెట్రోల్ బాటిల్, సుత్తి, కట్టర్, ఐరన్ రాడ్స్, బాక్స్ లో పెట్టు-కుని తిరుగుతున్నారు. గత కొన్ని రోజులుగా రోహింగ్యాలపై బిజెపి నేత అందెల శ్రీరాములు యాదవ్ ఉద్యమం చేస్తున్నారు. అందెల శ్రీరాములకు ప్రాణహాని ఉందని బిజెపి నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. బిజెపి నేతలు పట్టు-కోవడానికి ప్రయత్నించగా వాహనం వదిలి పారిపోయారు. ఐదుగురు వ్యక్తులను గుర్తించి మీర్ పేట పోలీస్ స్టేషన్ కు బిజెపి నేతలు సమాచారం ఇచ్చారు. ఐదుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

# నైపుణ్యం' పోర్టల్‌ను ప్రారంభించండి

**- అధికారులకు మంత్రి లోకేశ్ ఆదేశం**



**అమరావతి,జూలై4( వెలుతురు):**

'నైపుణ్యం' పోర్టల్‌ను సెప్టెంబర్‌లో ప్రారంభించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. ఉద్యోగ, ఉపాధి కల్పనకు మిషన్ మోడ్ విధానంలో నైపుణ్యం పోర్టల్‌ను ప్రజల్లోకి తీసుకెళ్తాం. అని అన్నారు. నైపుణ్యాభివృద్ధి శాఖ అధికారులతో ఉండవల్లిలోని నివాసంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. ఉద్యోగ, ఉపాధి కల్పనకు మిషన్ మోడ్ విధానంలో నైపుణ్యం పోర్టల్‌ను ప్రజల్లోకి తీసుకెళ్తాం. 90 రోజులపాటు- ఈ కార్యక్రమం చేపడతాం. ఈ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత ఆటోమేటిక్‌గా రెజ్యూమ్ సిద్ధమయ్యేలా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించాను. ఇటీ-వల ఢిల్లీ పర్యటన అనంతరం ఐటీ-ఐల అభివృద్ధికి హబ్ అండ్ స్పోక్ విధానంలో కేంద్ర ప్రాయోజిత కార్యక్రమం ద్వారా రూ. 600 కోట్లు-కేటాయించామని లోకేశ్ పేర్కొన్నారు.

# అనిరుద్ వ్యాఖ్యలపై పిసిసి సీరియస్



**హైదరాబాద్,జూలై4( వెలుతురు):**

జడ్చర్ల నియోజక వర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డిపై పీసీసీ సీరియస్ అయింది. అనిరుద్ రెడ్డి వ్యాఖ్యలపై నివేదిక ఇవ్వాలని క్రమశిక్షణ కమిటీకి టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఆదేశాలు జారీ చేశారు. సోమవారం జరిగే క్రమశిక్షణ కమిటి సమావేశంలో అనిరుద్ రెడ్డికి షోకాజ్ నోటీసులు ఇచ్చే అవకాశం ఉంది. ఇటీ-వల జడ్చర్లలో కీలక కామెంట్స్ చేసిన అనిరుద్ రెడ్డి. తెలంగాణలో టీడీపీ కోవర్టులున్నారని వ్యాఖ్యాలు చేశారు. ఇరిగేషన్, రోడ్ల కాంట్రాక్టులు అవ్వడం మానేస్తే.. అంతా సెట్ అవుతుందన్న జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి పేర్కొన్నాడు.

# హైడ్రా కూల్చివేతలను అడ్డుకున్న కార్పోరేటర్

**హైదరాబాద్,జూలై4( వెలుతురు):**

హైడ్రా కూల్చివేతలను అడ్డుకున్న కార్పోరేటర్ అడ్డుకున్నారు. హైదరాబాద్‌లోని లింగంపల్లి హుడా ట్రేడ్ సెంటర్ ప్రాంతంలో హైడ్రా ఆధ్వర్యంలో నాలా ఆక్రమణల తొలగింపు చేపట్టారు. ఈక్రమంలో శేరిలింగంపల్లి కార్పొరేటర్ నాగేందర్ యాదవ్ పనులను అడ్డుకున్నారు. హైడ్రా అధికారులతో వాగ్వాదానికి దిగారు. నాలాలోకి వచ్చిన భవనాలు కూల్చకుండా సోమేశ్వరాలయానికి సంబంధించిన భూమి స్వాధీనం చేసుకొని నాలా నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. అందుకు దేవాదాయ శాఖ అధికారిణి భారతి ఆక్షేపించారు. నాలా ఆక్రమించిన వారిని వదిలేసి దేవాలయ భూమిని ఎలా స్వాధీనం చేసుకుంటారని ప్రశ్నించారు. ఈ విషయంలో కార్పొరేటర్‌ను కలగజేసుకోవద్దని కోరారు. చర్చలు సాగుతున్న క్రమంలో కూల్చివేతలు తాత్కాలికంగా ఆగిపోయాయి.

# మోదీ కానుకగా 20 వేల సైకిళ్ల పంపిణీ చేయనున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

- **టెన్త్ క్లాస్ విద్యార్థినీ, విద్యార్థులందరికీ సైకిళ్లు అందజేయనున్న కేంద్ర మంత్రి**
- **ప్రతి మండలానికి అదనంగా వంద చొప్పున సైకిళ్ల సరఫరా**
- **డివిజన్లకు అదనంగా 50 సైకిళ్లను పంపిణీ చేసేందుకు సిద్ధమైన కేంద్ర మంత్రి**



**కరీంనగర్ వెలుతురు జూలై 04:**

ఈనెల 11న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పుట్టిన రోజు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్సియల్ స్కూళ్లలో చదివే టెన్త్ క్లాస్ విద్యార్థినీ, విద్యార్థులతోపాటు భారీ ఎత్తున సైకిళ్లను పంపిణీ చేయనున్నారు. తన పార్లమెంట్ పరిధిలోని జిల్లాల వారీగా చూస్తే.... కరీంనగర్ జిల్లాలో పదో తరగతి చదువుకునే బాలబాలికలు 3096 మంది ఉన్నారు. రాజన్న సిరిసిల్లలో 3841, జగిత్యాల జిల్లాలో 1137, సిద్దిపేటలో 783, హన్మకొండ జిల్లాలో 491 మంది వెరసి 9348 మంది బాలబాలికలు టెన్త్ క్లాస్ అభ్యసిస్తున్నారు. అట్లాగే కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో 66 డివిజన్లు ఉన్నాయి. ఒక్కో డివిజన్ కు 50 చొప్పున సైకిళ్లను పంపిణీ చేయనున్నారు. వీటితోపాటు ఒక్కో మండలానికి వంద చొప్పున సైకిళ్లను అదనంగా పంపిణీ చేస్తారు. అట్లాగే హుజూరాబాద్, జమ్మికుంట, హుస్నాబాద్, సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి, కొత్తపల్లి మున్సిపాలిటీల పరిధిలో ఒక్కో వార్డుకు 50కి చొప్పున పంపిణీ చేస్తారు. ఇక గ్రామ పంచాయతీల వారీగా 10 నుండి 25 సైకిళ్ల చొప్పున పంపిణీ చేయనున్నారు. వెరసి తన కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 20 వేల సైకిళ్లను దశలవారీగా పంపిణీ చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు సైకిళ్ల తయారీలో పేరుగాంచిన ప్రముఖ సంస్థకు నెల రోజుల క్రితమే ఆర్డర్ కూడా ఇచ్చారు. ఇప్పటికే 5 వేల సైకిళ్లు కరీంనగర్ కు వచ్చాయి. తొలి దశలో ఐదు వేల సైకిళ్లను ఈనెల 8 లేదా 9వ తేదీన పంపిణీ చేసేందుకు బండి సంజయ్ సిద్ధమయ్యారు. మిగిలిన సైకిళ్లు కూడా వచ్చిన వెంటనే అసెంబ్లీ నియోజకవర్గాల, మండలాల వారీగా పంపిణీ చేయనున్నారు.

ఇక సైకిళ్ల ఖర్చు వివరాలకు వస్తే ఒక్కో సైకిల్ ను రూ. 4 వేల చొప్పున కొనుగోలు చేస్తున్నారు. సైకిల్ రాడ్ కు ఒకవైపు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇంకోవైపు బండి సంజయ్ ఫోటోను ముద్రించనున్నారు.

### టెన్త్ విద్యార్థులకే ఎందుకంటే....

ప్రభుత్వ స్కూళ్లలో చదువుకునే పిల్లలు పేద కుటుంబం నుండి వచ్చిన వాళ్లే ఉంటారనే విషయం తెలిసిందే. తమ ఇంటి నుండి స్కూల్ దాకా వెళ్లడానికి తగిన రవాణా సౌకర్యాల్లేక, ఆటోలు, బస్సులు వెళ్లే స్థోమత లేక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా టెన్త్ క్లాస్ విషయానికొచ్చే సరికి స్కూల్ వేళలు ముగిసిన తరువాత స్పెషల్ క్లాస్ లకు హాజరు కావాల్సి ఉంటుంది. దీనివల్ల పొద్దుపోయేదాకా స్కూళ్లోనే ఉండాల్సి వస్తుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని టెన్త్ బాలబాలికలకు రవాణా ఇబ్బంది ఉండకూడదనే సదుద్దేశంతో బండి సంజయ్ కుమార్ ప్రధాని మోదీ కానుకగా సైకిళ్లను పంపిణీ చేయనుండటం విశేషం.

# ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు వినియోగించుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 04**

అన్ని ప్రభుత్వ పాఠశాలలలో చదివే విద్యార్థులకు ప్రభుత్వం సకల సదుపాయాలు కల్పిస్తుందని, విద్యార్థులు సౌకర్యాలను సద్వినియోగపర్చుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని లక్షెట్టిపేట మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాల, కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయాలను సందర్శించి వంటశాల, తరగతి గదులు, హాజరు పట్టిక, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలలో సకల సౌకర్యాలను కల్పించడం జరిగిందని తెలిపారు. ప్రతి పాఠశాలలో త్రాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, ప్రహరీగోడ, వంటశాల ఇతర అన్ని మౌళిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. మెనూ



ప్రకారం విద్యార్థులకు సకాలంలో పౌష్టికాహారాన్ని అందించాలని, ఆహారం తయారీ సమయంలో నిబంధనలు పాటించాలని, తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యావసర సరుకులను వినియోగించాలని, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వర్షాకాలం కావడంతో పాఠశాలలో పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బంధీగా చేపట్టాలని తెలిపారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంపొందించాలని, బడి బయట పిల్లలు, మధ్య బడి మానివేసిన పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులతో మాట్లాడి తిరిగి పాఠశాలకు వచ్చే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. కళాశాల విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని ఏకాగ్రతతో కష్టపడి చదివి సాధించాలని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలో నిర్మితమవుతున్న ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలకు మరింత వేగవంతమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ఆసుపత్రి నిర్మాణాన్ని చేపట్టిందని, నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మణరావు, కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయం ప్రిన్సిపల్ కవిత, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాలలో అన్ని సదుపాయాలు కల్పించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 04**

ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శు క్రవారం జిల్లాలోని నస్పూర్ గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా విద్యాధికారి ఎస్. యాదయ్యతో కలిసి జిల్లా అధికారులు, ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల ప్రిన్సిపాళ్ళతో విద్యార్థులకు కల్పించవలసి సదుపాయాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి అసౌర్యం కలుగకుండా పూర్తి స్థాయిలో సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యాబోధన చేయాలని తెలిపారు. విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ సకల సౌకర్యాలతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే దిశగా ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో సౌకర్యాలు కల్పించడం జరిగిందని తెలిపారు. ప్రైవేట్ భవనాలలో కొనసాగుతున్న పాఠశాలలు, వసతి గృహాలకు సొంత భవనాల నిర్మాణానికి చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని మైనార్టీ సంక్షేమ, ఆశ్రమ పాఠశాలలు, సాంఘిక సంక్షేమ, మహాత్మా జ్యోతిబా పూలే, కస్తూరిభా గాంధీ విద్యాలయాలు, అర్బన్ రెసిడెన్షియల్ విద్యాసంస్థలు, గిరిజన సంక్షేమ వసతి గృహాల వారిగా



సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఆయా విద్యా సంస్థలలోని మంజూరైన విద్యార్థుల సంఖ్య, ప్రస్తుతం ఉన్న విద్యార్థులు, పాఠశాల భవన స్థితి, వసతి గదులు, పడకలు, మూతశాలలు, శౌచాలయాల వివరాలను పరిశీలించారు. నూతన మెనూ ప్రకారం సకాలంలో విద్యార్థులు పౌష్టికాహారం అందించాలని, వంట చేసే సమయంలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యావసర సరుకులు మాత్రమే వినియోగించాలని తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బంధీగా చేపట్టాలని, ప్రతి రోజు వసతి గదులు, వంటశాల, మూత్రశాలలు, పరిసరాలను శుభ్రపరచాలని, విద్యార్థులకు శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎ. పురుషోత్తం, జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి సిహెచ్. దుర్గాప్రసాద్, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి నీరటి రాజేశ్వరి, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి జనార్ధన్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హిందూ ధర్మాన్ని కాపాడండి అది మిమ్మల్ని కాపాడుతుంది...

**- దినపత్రిక సంపాదకున్ని సత్కరించిన పీఠం నిర్వాహకులు...**


**- శ్రీ రామకృష్ణ వైదిక పీఠం నిర్వాహకులు కృష్ణమాచార్యులు...**

**కరీంనగర్ వెలుతురు జూలై 04:**

హిందూ ధర్మాన్ని కాపాడండి అది మిమ్మల్ని కాపాడుతుందని శ్రీరామకృష్ణ వైదిక పీఠం నిర్వాహకులు శీర్లవంచ కృష్ణమాచార్యులు హితబోధించారు. తెలంగాణ న్యూస్ ఇంగ్లీష్ దినపత్రిక సంపాదకులు డివిఎస్ ప్రసాద్ ను నిర్వాహకులు శాలువాలతో సత్కరించి ఆశీర్వచనాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, చైర్మన్ కృష్ణమాచార్యులు మాట్లాడుతూ కామారెడ్డి లోని 13వ వార్డులో, శ్రీ రామ కృష్ణ వైదిక ధర్మ పీఠం లో ప్రతి ఆశాడ మాసంలో చండీ హోమం 13 రోజులు నిర్వహించే



కార్యక్రమంలో భాగంగా శు క్రవారం చండీయాగా హోమం నిర్వహించడం జరిగిందని, ధర్మో రక్షతె రక్షత,హిందూ ధర్మాన్ని కాపాడండి ,అది మిమ్మల్ని కాపాడుతుంది శ్రీ రామకృష్ణ వైదిక ధర్మ పీఠం, నాలుగు సంవత్సరాలుగా శ్రీ రామకృష్ణ వైదిక ధర్మ పీఠం పాఠశాలలో కుల, మత, భేదం లేకుండ, సొంత ఖర్చులతో అన్ని కులాల వారికి వేద పాఠశాలలో ఉచితంగా విద్య బోధలను నేర్పించి, వారికి తగిన స్థానం కల్పించి, ప్రయోజకులను చేయడంలో ముందుంటున్నామని, ఈ యొక్క వేద పాఠశాల ద్వారా చాలామంది. ఆకర్షితులైన



వారికి విద్యను అందిస్తున్నారు. హిందువులందరూ అర్హులే ఆసక్తి ఉన్న వారికి మన పాఠశాలలో అన్ని వసతులతో ఫ్రీ క్లాసు నేర్పించబడును ఆషాడ మాసం సందర్భంగా 13 రోజులు చండీ హోమం జరుగును ఇవాళ మూడవ హోమం జరిగినది కార్యక్రమానికి వస్తున్న ప్రముఖుల అందరికీ వేద పాఠశాల తరఫున కృతజ్ఞతలు తెలిపారు తెలంగాణ న్యూస్ ఇంగ్లీష్ దినపత్రిక సంపాదకులు డివిఎస్ ప్రసాద్ పాఠశాలను సందర్శించిన సందర్భాన్ని పురస్కరించుకొని వేద పీఠం ఆధ్వర్యంలో శాలువాలతో ఘన సత్కారం చేసి ఆశీర్వచనాన్ని అందజేసినట్లు చైర్మన్ కృష్ణమాచార్యులు తెలిపారు.

# వెలుతురు

జనరల్ వార్తలు

https://epaper.velthuru.com


## హైదరాబాద్‌లో మాజీ సీఎం రోశయ్య విగ్రహం

**- లక్డీకాపూల్‌లో ఆవిష్కరించిన మల్లికార్జున ఖర్గే**



**హైదరాబాద్,జూలై4( వెలుతురు):**
నగరంలోని లక్డీకాపూల్‌లో మాజీ సీఎం కొణిజేటి రోశయ్య విగ్రహాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆవిష్కరించారు. రోశయ్య జయంతి సందర్భంగా విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం నేతలు నివాళి అర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. వైఎస్ మరణం తరవాత ఆయన సిఎంగా పనిచేశారు. తరవాత తమిళనాడు గవర్నర్‌గా వెళ్లారు. ఆయన సేవలకు గుర్తుగా ప్రభుత్వం విగ్రహాన్ని ఏర్పాటు చేసింది. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే చేతుల మీదుగా ఆవిష్కరించిన ఈ కార్యక్రమంలోసీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, రోశయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కార్యకర్తలు కూడా భారీగా తరలివచ్చారు.

## పాశమైలారంలో లెక్క తేలన మృతుల సంఖ్య

**- జాడ తెలియని మరో 9మంది కార్మికులు**

**- ఆందోళనలో కుటుంబ సభ్యులు**



**హైదరాబాద్,జూలై4( వెలుతురు):**
పాశమైలారం సిగాచీ పరిశ్రమలో పేలుడు జరిగి 5 రోజులు గడుస్తున్నా మృతుల సంఖ్యపై సందిగ్ధత వీడటం లేదు. శిథిలాల తొలగింపు పూర్తికావొస్తున్నా.. గల్లంతైన వారి ఆచూకీ లభించకపోవడంతో బాధిత కార్మిక కుటుంబాల్లో రోదనలు మిన్నంటుతున్నాయి. ఈ దుర్ఘటనలో మొత్తం 40 మంది ప్రాణాలు కోల్పోగా.. 9 మంది ఆచూకీ గల్లంతైనట్టు–గా యాజమాన్యం ప్రకటించింది. దుర్ఘటన జరిగిన ప్రాంతంలో శిథిలాల ఏరివేత దాదాపుగా పూర్తికావచ్చింది. అణువణువూ జల్లెడ పట్టినప్పటికీ 9 మంది కార్మికుల జాడలు ఇంకా తెలియడంలేదు. ప్రమాదంలో గల్లంతైన వారి సంఖ్య ఇంకా ఎక్కువే ఉండవచ్చని తెలంగాణ రాష్ట్ర సీఎస్ రామకృష్ణారావు నేతృత్వంలోని కమిటీ– గుర్తించినట్లు– సమాచారం. దీంతో బాధిత కుటు–ంబాల్లో ఆగ్రహావేశాలు మిన్నంటాయి. ఈ క్రమంలోనే ఐలా భవనంలో బాధిత కుటుంబాలతో సీఎస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మా పరిస్థితి ఏంటని.. తమవారిపై ఆశలు వదులు కోవాల్సిందే నా అంటూ బాధిత కుటుంబ సభ్యులు ఆయనను నిలదీశారు. చాలామంది కాలిపోయినట్టు–గా గుర్తించాం. కచ్చితంగా అందరికీ న్యాయం చేస్తామంటూ సీఎస్ హామీ ఇచ్చారు. సమావేశం అనంతరం బాధితుల కుటు–ంబీకులు కొందరు జిల్లా కలెక్టర్ కాళ్లపై పడి తమకు న్యాయం చేయాలని ప్రాధేయపడ్డారు. గల్లంతైన కార్మికుల మృతదేహాల ఆచూకీ తెలియకపోవడంతో ప్రమాదంలో వారు పూర్తిగా దగ్ధమైనట్లు– సమాచారం. లాకర్ రూంలో లభించిన సెల్ ఫోన్లు కాంట్రాక్టు కార్మికులవేనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాంట్రాక్టు కార్మికుల గురించి యాజమాన్యమూ ఎలాంటి ప్రకటనా చేయలేదు. దీంతో మృతదేహాలు లభ్యం కాకపోతే బాధిత కుటు–ంబాలకు నష్టపరిహారం వచ్చే అవకాశం లేనట్టేనని తెలుస్తోంది. ఈ విషయమై సీఎస్ క్లారిటీ– ఇవ్వకపోవడమే కారణంగా భావిస్తున్నారు. అంతేగాక, ఇప్పటివరకూ ప్రభుత్వం గల్లంతైన కార్మికుల విషయంలో ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదు.

## నిలకడగా కెసిఆర్ ఆరోగ్యం

**- అత్యుత్తమ వైద్యం అందించాలని సిఎం ఆదేశం**

**హైదరాబాద్,జూలై4( వెలుతురు):**
భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్ స్వల్ప అనారోగ్యంతో సోమాజీగూడలోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తాజాగా ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆస్పత్రి వైద్యులు బులిటెన్ విడుదల చేశారు. కేసీఆర్ నీరసంగా ఉండటంతో ఈ సాయంత్రం ఆస్పత్రిలో చేరారు. ఆయన శరీరంలో బ్లడ్ షుగర్ అధికంగా, సోడియం మోతాదు తక్కువగా ఉన్నట్లు– ప్రాథమిక పరీక్షల్లో వెల్లడైంది. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని పేర్కొన్నారు. మరోవైపు, కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరా తీశారు. సోమాజీగూడ యశోద ఆస్పత్రి వైద్యులు, అధికారులతో ఆయన మాట్లాడారు. కేసీఆర్‌కు అత్యుత్తమ చికిత్స అందించాలని సూచించారు. ఆయన త్వరగా కోలుకోవాలని.. సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని సీఎం ఆకాంక్షించారు.

# ఖమ్మం-వరంగల్ రహదారిపై ఘోర ప్రమాదం

**- రెండు లారీలు ఢీకొని మంటల్లో ముగ్గురు దహనం**




**మహబూబాబాద్,జూలై4( వెలుతురు):**
ఖమ్మం – వరంగల్ హైవేపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. మరిపెడ శివారు కుడియాతండా వద్ద రెండు లారీలు ఢీకొన్నాయి. దీంతో లారీ క్యాబిన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. రెండు లారీల డ్రైవర్లు, క్లీనర్ మృతి చెందారు. క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్‌తో మంటలు ఆర్పివేశారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఘటన వివరాల్లోకి వెళితే రెప్పపాటులో మూడు నిండు ప్రాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. ఎదురెదురుగా వస్తున్న రెండు లారీలు ఢీకొని మంటలు చెలరేగి ఇద్దరు డ్రైవర్లు, క్లీనర్ మృత్యువాత పడ్డారు. ఈ హృదయ విదారక ఘటన మహబూబాబాద్ జిల్లా, మరిపెడ మండలం, ఎల్లంపేట స్టేజి సమీపంలోని జాతీయ రహదారి 563పై శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్ రాష్ట్రం, జోద్‌పూర్, కేజర్ల ప్రాంతానికి చెందిన రాజురాం చౌదరికి ఇద్దరు కుమారులు. లారీ ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అందులో భాగంగానే చేపల దాణా కోసం విజయవాడ వెళ్లిన తండ్రి, చిన్న కుమారుడు సర్వణ్ రాం (23) రెండు లారీలతో విజయవాడ నుంచి రాజస్థాన్‌కు లారీలతో బయల్దేరారు. కుమారుడు లారీ ముందు వస్తుండగా పది నిమిషాల వ్యవధిలో తండ్రి లారీ వెనుక నుంచి వస్తోంది. అదే క్రమంలో వరంగల్ జిల్లా, వర్ధన్నపేట మండలం, నల్లబెల్లి పరిధిలోని రాంనాథ్ తండాకు చెందిన గుగులోత్ గణేష్ (30) కరీంనగర్ నుంచి గ్రానైట్ లోడుతో కాకినాడకు వెళ్తున్నాడు.మహబూబాబాద్ జిల్లా, మరిపెడ మండలం, ఎల్లంపేట స్టేజీ సమీపంలో సర్వణ్ రాం నడుపుతున్న లారీ అదుపుతప్పి ఎదురుగా వస్తున్న కరీంనగర్ నుంచి కాకినాడకు గ్రానైట్ లోడుతో వెళ్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాళ్లు క్యాబిన్లపైకి దూసుకు రావటంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి డ్రైవర్లు గుగులోత్ గణేష్, సర్వణ్, రాం క్లీనర్ బర్గత్ ఖాన్ (23) సజీవ దహనమయ్యారు. స్థానికులు స్పందించి పోలీసులకు సమాచారం ఇవ్వగా ఫైర్ సిబ్బంది ఘటనా ÷–ధస్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా ఉండటంతో కొడుకు లారీ వెనకాలే వస్తున్న తండ్రి రాజురాం చౌదరి తన కుమారుడి వాహనం ప్రమాదానికి గురైనట్లు– గుర్తించాడు. మృతుడు గణేష్‌కు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. క్లీనర్ బర్గత్ ఖాన్‌కు కూడా ఇటీవలే వివాహమైనట్లు– తెలుస్తోంది. జాతీయ రహదారిపై లారీలు దహనమవుతుండటంతో రెండు వైపులా భారీగా వాహనాలు నిలిపోయాయి. రాకపోకలకు అంతరాయం కలుగకుండా అగ్నిమాపక సిబ్బంది సుమారు రెండు గంటలు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.పోలీసులు కేసు నమోదు చేశారు.

# చదువంటే కేవలం డిగ్రీలు కాదు

**- నైపుణ్యాలపై దృష్టి సారించి సాగండి**

**- కాకినాడ జేఎన్టీయూ 11వ స్నాతకోత్సవంలో గవర్నర్**




**కాకినాడ,జూలై4( వెలుతురు):**
చదువంటే డిగ్రీలు, బట్టీ పట్టడం, 100 కి 100 మార్కులు సాధించడం కాదని ఏపీ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. గ్రాడ్యుయేషన్ పూర్తయింది అంటే ఇంతటితో విద్య పూర్తయినట్లు– కాదని.. ఇదే మీ కలలను సాకారం చేసుకునేందుకు ఆరంభమని చెప్పారు. యువత ధైర్యంగా, విభిన్నంగా ఆలోచించాలని.. సమస్యలను ఎదుర్కొని విజయబావుటా ఎగరేయాలని సూచించారు. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ కాకినాడ జేఎన్టీయూ 11వ స్నాతకోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్సిటీలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ఆయన అవార్డులు, గోల్డ్ మెడల్స్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ సరికొత్త బోధనా పద్ధతులతో డిజిటల్ ప్లాట్ ఫాంను ఏర్పాటు– చేయాల్సిన బాధ్యత విశ్వవిద్యాలయాదే. క్వాంటమ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఐఓటి, ఇ–మొబిలిటీ– వంటి సాంకేతికతను మరింత ముందుకు తీసుకువెళ్లాలి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 2026 నాటికి దేశంలోనే మొట్ట మొదటి పూర్తిస్థాయి స్టాక్ క్వాంటమ్ వ్యాలీని స్థాపించనుంది. క్వాంటమ్ మిషన్ వలన 2026 కల్లా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటు– ద్వారా అమరావతిలో ఆవిష్కరణలు, ఉన్నతస్థాయి ఉపాధి, పర్యావరణ స్థిరత్వాన్ని పెంపొందించేందుకు అవకాశం లభిస్తుంది. సాఫ్ట్ స్కిల్స్, వ్యవస్థాపకత, పరిశ్రమలతో అనుసంధానమై సిలబస్ ను రూపొందించడం ద్వారా పట్టభద్రులు సవాళ్లను ఎదుర్కొనేలా తయారుచేయవచ్చని అన్నారు. ఈ సందర్భంగా అమెరికాలోని బోస్టన్ గ్రూప్ ఛైర్మన్ కోట సుబ్రమణ్యానికి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. వర్సిటీలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 40 మంది విద్యార్థులకు ఎండోమెంట్ అవార్డు, గోల్డ్ మెడల్స్ అందజేశారు. గ్రాడ్యుయేషన్ జీవితంలో ఒక మంచి చాప్టర్. ఇది ముగింపు కాదు. మీ కలల సాకారం చేసుకోవడానికి ఆరంభం. యూనివర్సిటీలు –టె–క్నాలజీపై ఫోకస్ పెట్టాలి. అమరావతి కేంద్రంగా క్వాంటం వ్యాలీ రాబోతోంది. అమరావతి అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని గవర్నర్ పిలుపునిచ్చారు.

# ఖర్గే రాకతో గాంధీభవన్‌లో సందడి

**- సిఎం, మంత్రుల హాజరుతో భద్రత పెంపు**

**- పోలీసుల తీరుపై రేణుకాచౌదరి అసహనం**



**హైదరాబాద్,జూలై4( వెలుతురు):**
గాంధీభవన్‌లో తెలంగాణ కాంగ్రెస్ పీఏసీ సమావేశం కొనసాగుతున్న వేళ కార్యకర్తల తాకిడి పెరిగింది. ఏఐసీసీ చీఫ్ కర్గే, కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నేతలు సమావేశానికి హాజరయ్యారు. ఇదిలా ఉండగా.. కాంగ్రెస్ అగ్రనేతలు గాంధీ భవన్‌లో ఉండటంతో వారిని కలిసేందుకు కేడర్ క్యూ కట్టింది. ఈ క్రమంలో కేడర్ లోపలికి రాకుండా పోలీసులు అడ్డుకున్నారు. అడ్డుకున్న వారిలో రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి వ్యక్తిగత సిబ్బంది కూడా ఉన్నారు. దీంతో ఆమె స్వయంగా పోలీసుల వద్దకు వచ్చి సిబ్బందిని లోపలికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో పోలీసుల తీరుపై రాజ్యసభ సభ్యురాలు అసంతృప్తి వ్యక్తం చేశారు. తమకంటే పోలీసుల హడావుడి ఎక్కువైందంటూ రేణుకా చౌదరి మండిపడ్డారు. మరోవైపు ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అసహనం వ్యక్తం చేశారు. తమను ఆపుతారా అంటూ పోలీసులపై నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు పీఏసీ సమావేశంలో పార్టీ నేతలకు ఖర్గే దిశానిర్దేశం చేశారు. సమావేశం మొదలైన వెంటనే పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాద ఘటనలో చనిపోయిన మృతులకు సంతాపం తెలుపుతూ పీఏసీ సభ్యులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఆపై ఏజెండా ప్రకారం పీఏసీ సమావేశం జరుగుతోంది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలు చర్చకు వచ్చాయి. పార్టీ బలోపేతం, ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి ఎంత మేరకు తీసుకెళ్లారనే దానిపై చర్చించారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీలోకి చేరికలను ప్రోత్సహించాలని మల్లికార్జున ఖర్గే తెలిపారు. రాష్ట్రంలో జై భీమ్ జై బాపు జై సంవిధాన్ వంటి కార్యక్రమాలు ఎలా కొనసాగుతున్నాయనే దానిపై రిపోర్టును పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సమావేశంలో చదివి వినిపించారు. గ్రేటర్ ఎన్నికల నేపథ్యంలో పార్టీ తీసుకోవాల్సిన నిర్ణయాలు, అనుసరించాల్సిన వ్యూహంపై చర్చ జరిగింది. అలాగే జూబ్లీహిల్స్ ఉపఎన్నిక అంశంపై కూడా పీఏసీలో చర్చ జరిగింది.

# రోడ్డు దాటుతుండగా దూసుకొచ్చిన బస్సు

## క్లీనర్ అప్రమత్తతో స్కూల్ పిల్లలకు తప్పిన ముప్పు

**విజయవాడ,జులై 4 ( వెలుతురు):**
కృష్ణా జిల్లాలోని జగ్గయ్యపేటలో స్కూల్ విద్యార్థులకు భారీ ప్రమాదం తప్పింది. ప్రతీ రోజులాగే ఈరోజు కూడా విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు బస్సు ఎక్కారు. స్కూల్ వద్దకు వాహనం చేరుకున్న వెంటనే వారంతా ఒకరి తరువాత ఒకరు దిగి లోపలికి వెళ్తున్నారు. ఇదే సమయంలో జరిగిన ఓ ఘటన అక్కడి వారిని భయాందోళనకు గురిచేసింది. అయితే వాహనం డ్రైవర్, క్లీనర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో పిల్లలకు పెను ప్రమాదం తప్పినట్లైంది. చిన్నారులంతా క్షేమంగా ఉండటంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. శుక్రవారం ఉదయం కేసీపీ క్వార్టర్స్ నుంచి విద్యార్థులను పాఠశాలల్లో దింపేందుకు కంపెనీ వాహనం క్వార్టర్స్ వద్దకు వెళ్లింది. పిల్లలు అందరూ ఎక్కిన తర్వాత బస్సు బయలుదేరింది. ఆ తరువాత బజాజ్ షోరూం సమీపంలో వాహనాన్ని ఆపి స్కూల్లోకి పిల్లలను పంపించేందుకు బస్సు నుంచి డ్రైవర్, క్లీనర్ కిందకు దిగారు. అయితే వారు రోడ్డు క్రాస్ చేసి వస్తున్న సమయంలో కోదాడ రోడ్డు వైపు నుంచి ఓ ప్రైవేటు స్కూల్ బస్సు అతివేగంగా దూసుకొచ్చింది. తన బస్సుకు బ్రేక్ ఫెయిల్ అయ్యిందంటూ డ్రైవర్ గట్టి గట్టిగా అరిచాడు. పిల్లల మీదకు రాబోతున్న బస్సును వెంటనే గమనించిన డ్రైవర్, క్లీనర్ సమయస్ఫూర్తితో చిన్నారులను అక్కడి నుంచి తప్పించేశారు. దీంతో పిల్లలంతా క్షేమంగా బయటపడ్డారు. డ్రైవరు, క్లీనర్ గమనించకపోతే బస్సు దూసుకొచ్చి పిల్లలపైకి వెళ్లలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ సమయంలో 15 నుంచి 20 మంది పిల్లలు రోడ్డు దాటుతున్నారు. ఎవరికీ ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు ప్రైవేటు స్కూల్ బస్సు డ్రైవర్‌ను ఎస్పీ రాజు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.




## జూరాలకు భారీగా వరదనీరు

**- 14 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల**



**గద్వాల,జూలై4( వెలుతురు):**
ఎగువ ప్రాంతంలోని మహారాష్ట్ర, కర్ణాటకలో కురుస్తున్న వర్షాల కారణంగా కృష్ణానది పరీవాహక ప్రధాన జలాశయాలు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకొని జలకళను సంతరించు కున్నాయి. శు క్రవారం ఎగువ ప్రాంతం నుండి జూరాలకు 1,15,000 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా... ప్రాజెక్టు 14 గేట్లు దిగువకు 95,566 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. జూరాల కుడి, ఎడమ కాలువలు, బీమా లిఫ్ట్ 1, విద్యుత్ ఉత్పత్తికి, కోయిల్ సాగర్ సమాంతర కాలువలకు అన్నింటికీ కలిపి 1,27,659 క్యూసెక్కులకు వదులుతున్నట్లు– జూరాల వరద నియంత్రణ కార్యాలయ అధికారులు తెలిపారు. శు క్రవారం ఆల్మట్టి జలాశయం పూర్తిస్థాయి మట్టం 129.72 టిఎంసిలకు గాను 90.91 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతం నుంచి 94,767 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా అంతే మొత్తంలో దిగువకు 1,00,670 క్యూసెక్కులను వదులుతున్నారు. నారాయణపూర్ జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 37.646 టిఎంసిలకు గాను 30.98 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతం నుండి 99,583 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా, దిగువకు 99,583 క్యూసెక్కుల నీరు వదులుతున్నారు. జూరాల జలాశయం 9.667 టిఎంసిలకు గాను 7.991 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతంలోని ఆల్మట్టి, నారాయణ పూర్ జలాశయాలు పూర్తిస్థాయి నీటి మట్టంతో కళకళలాడుతుండడంతో అక్కడి ప్రాజెక్టుల నుండి వస్తున్న వరద నీటితో జూరాల వద్ద జలకళను సంతరించుకుంది. ఎగువ ప్రాంతం నుండి వస్తున్న వరద నీటిని దృష్టిలో ఉంచుకొని జూరాల ప్రాజెక్టులపై ఆధారపడి నిర్మించిన ఎత్తిపోతల పథకాలకు అధికారులు నీటి విడుదలను కొనసాగిస్తుండడంతో ఆయకట్టు– రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

# రామకృష్ణ ఎలక్ట్రానిక్ బ్యాంక్ స్కామ్

**- అల్లు అరవింద్‌ను విచారించిన ఇడి**



**హైదరాబాద్,జులై 4( వెలుతురు):**

ప్రముఖ సినీ నిర్మాత అల్లు అరవింద్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు ప్రశ్నించారు. రామకృష్ణ ఎలక్ట్రానిక్ బ్యాంక్ స్కామ్‌లో అరవింద్‌ను మూడు గంటలపాటు విచారించి స్టేట్‌మెంట్ రికార్డ్ చేశారు. 2018-2019లో జరిగిన బ్యాంక్ స్కామ్‌లో ఈడీ విచారణను కొనసాగిస్తోంది. ఇందులో మనీలాండరింగ్ కోణం ఉందని భావించిన ఈడీ.. ఈసీఐఆర్ నమోదు చేసిన తర్వాత విచారణను చేపట్టింది. గతంలో బ్యాంక్‌కు సంబంధించి అవకతవకలు జరిగాయన్న అభియోగాలపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతోంది. ఇప్పటికే అల్లు అరవింద్‌ను విచారించిన అధికారులు.. బ్యాంక్ లావాదేవీలు, ఆస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వచ్చే వారం మరోసారి విచారణకు రావాలని నిర్మాతను ఈడీ అధికారులు ఆదేశించారు. 2024లో హైదరాబాద్, కర్నూలు, ఘజియాబాద్‌లోని వివిధ ప్రదేశాలలో సోదాలు చేసిన ఈడీ.. రూ.1.45 కోట్లను సీజ్ చేసింది. నిందితులు రూ.101.48 కోట్ల రుణ నిధులను మోసపూరితంగా మళ్లించారన్న ఆరోపణలకు సంబంధించి ఈడీ దర్యాప్తు కొనసాగిస్తోంది. ఇందులో అకౌంట్ హోల్డర్స్‌గా ఉన్న వారి స్టేట్‌మెంట్లను రికార్డు చేస్తున్నారు. ప్రధానంగా బ్యాంక్ యాజమాన్యం ఎలాంటి నిబంధనలు పాటించకుండా, ఆర్‌బీఐ నిబంధనలు ఉల్లంఘించి రూ.100 కోట్లకు పైగా నిధులు దుర్వినియోగం చేశారనే అభియోగాలపై ఈడీ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నారు.

# రోడ్డుప్రమాదంలో లస్కర్ మృతి

**ఖమ్మం,జులై 4( వెలుతురు):**

రోడ్డు ప్రమాదంలో ఇరిగేషన్ లస్కర్ మృతి చెందాడు. ఈ సంఘటన ఖమ్మం జిల్లా బోనకల్లు మండలంలోని రావినూతల గ్రామంలో శుక్రవారం జరిగింది. కలకోట గ్రామానికి చెందిన యంగల అప్పయ్య (50) ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో లస్కర్ గా విధులు నిర్వహిస్తున్నాడు. కలకోట గ్రామం నుంచి బోనకల్లులో గల ఇరిగేషన్ సబ్ డివిజన్ కార్యాలయానికి తన బైక్‌పై బయల్దేరాడు. రావినూతల గ్రామం వద్ద బర్రె బైక్‌కు తగలడంతో కిందపడడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స కోసం 108 వాహనంలో తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. విషయం తెలిసిన బోనకల్లు సబ్ డివిజన్ డీఈఈ తమ్మరపు వెంకటేశ్వర్లు, ఏఈఈ రాజేశ్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అప్పయ్యకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

# ఈద్గాను వివాదాస్పద నిర్మాణంగా గుర్తించలేం

**- శ్రీకృష్ణ జన్మభూమి వివాదంపై హైకోర్టు కీలక నిర్ణయం**



**ప్రయాగ్‌రాజ్,జులై 4( వెలుతురు):**

మథురలోని శ్రీకృష్ణ జన్మభూమి వివాదంపై అలహాబాద్ హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసులో ఆ జన్మభూమిలో షాహి ఈద్గా మసీదును భవిష్యత్తులో వివాదాస్పద నిర్మాణంగా పేర్కొనాలంటూ దాఖలైన పిటిషన్‌ను శుక్రవారం హైకోర్టు కొట్టివేసింది. ఈ మసీదును భవిష్యత్తులో వివాదాస్పద నిర్మాణంగా పేర్కొనాలంటూ హిందువాదులు దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను అలహాబాద్ హైకోర్టు తోసిపుచ్చింది. ఈ మేరకు జస్టిస్ రామ్ మనోహర్ నారాయణ్ మిశ్రా ధర్మాసనం ఈ పిటిషన్‌ను కొట్టేసింది. పూర్తి విచారణకు ముందు మసీదును వివాదాస్పద నిర్మాణంగా ప్రకటించడం తుది తీర్పుపై ప్రభావం చూపిస్తుందని ధర్మాసనం అభిప్రాయపడింది. అయితే ఈ మసీదు వివాదాస్పద నిర్మాణమంటూ మహేందర్ ప్రతాప్ సింగ్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ముస్లింలు రాత పూర్వకంగా అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ పిటిషన్లు దాఖలు చేశారు. తాజాగా అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఈ తీర్పుతో ముస్లిం పక్షానికి భారీ ఊరట లభించినట్లయింది. ప్రస్తుతం ఈ కేసును సింగిల్ జడ్జి జస్టిస్ రామ్ మనోహర్ నారాయణ్ మిశ్రా ధర్మాసనం విచారిస్తుంది. ఈ కేసులో హిందువుల వైపు నుంచి ప్రస్తుతం 18 పిటిషన్లు దాఖలైన సంగతి తెలిసిందే.

## తెలంగాణ ప్రయోజనాలపై రాజీపడం

అంటే చూస్తూ ఊరుకోం అని ఆయన హెచ్చరించారు. పోలవరం, పోతిరెడ్డిపాడు, పులిచింతల వంటి ఏపీ అక్రమ ప్రాజెక్టులను నిరసిస్తూ 20 ఏళ్ల క్రితం ఇదే రోజున మంత్రి పదవులకు రాజీనామాలు చేశాం. కేసీఆర్ ఆదేశానుసారం.. ఉమ్మడి రాష్ట్రంలోనే తెలంగాణ నీటి హక్కుల కోసం పదవులను గడ్డి పోచలుగా భావించి వదులుకున్నం. నీళ్లు, నిధులు, నియామకాలు నినాదంతో కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో.. ఆంధ్రప్రదేశ్ బనకచర్ల పేరిట గోదావరి నీళ్ల దోపిడి చేస్తానంటే చూస్తూ ఊరుకుంటామా? అని హరీశ్‌రావు నిలదీశారు. నాడైనా, నేడైనా తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బ తీసే ఏ కుట్రలనైనా బీఆర్ఎస్ పార్టీ సహించదు. పదవులకు రాజీనామాలు చేయడం మాత్రమే కాదు, పేగులు తెగేదాకా కొట్లాడుతం. తెలంగాణకు అన్యాయం జరగకుండా కాపలా ఉంటం. కంటికి రెప్పలా ఉండి కాపాడుకుంటం. ప్రాంతేతరుడు ద్రోహం చేస్తే.. పొలిమేర దాకా తరిమికొడతాం.. ప్రాంతంవాడే ద్రోహం చేస్తే ప్రాణంతోనే పాతర వేస్తం అని హరీశ్‌రావు హెచ్చరించారు. జై తెలంగాణ.. జై కేసీఆర్.. అని హరీశ్‌రావు నినదించారు.

# స్కూల్ బస్సు కిందపడి చిన్నారి మృతి

**నంద్యాల,జూలై4( వెలుతురు):**

నంద్యాల జిల్లాలో దారుణం జరిగింది. పాఠశాలకు వెళ్లిన తొలిరోజే ఓ చిన్నారి స్కూల్ బస్సు చక్రాల కింద పడి మృతి చెందింది. ఈఘటన నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ పట్టణంలో జరిగింది. ఎంవీ నగర్‌కు చెందిన శ్రీధర్, వనజ దంపతుల కుమార్తె హరిప్రియ (5). ఓ ప్రైవేటు- పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతోంది. శుక్రవారం ఉదయమే చిన్నారి తొలిసారి పాఠశాలకు వెళ్లింది. సాయంత్రం పాఠశాల బస్సు దిగిన చిన్నారి.. ముందువైపు నుంచి నడుస్తూ ఇంటికి చేరుకోబోయింది. ఇంతలోనే డ్రైవర్ బస్సును ముందుకు పోనివ్వడంతో బాలిక చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది.

# మోడీకి ట్రినిడాడ్ అత్యున్నత పౌర పురస్కారం

## ది ఆర్డర్ ఆఫ్ ది రిపబ్లిక్ ఆఫ్ ట్రినిడాడ్, అండ్ టొబాగో తో సత్కారం




**న్యూఢిల్లీ,జూలై4( వెలుతురు):**

భారత ప్రధాని నరేంద్ర మోడీకి ట్రినిడాడ్ అత్యున్నత పౌర పురస్కారం 'ది ఆర్డర్ ఆఫ్ ది రిపబ్లిక్ ఆఫ్ ట్రినిడాడ్, అండ్ టొబాగో ' ను శుక్రవారం బహుకరించారు. ఈ దేశం ఓ విదేశీ నేతకు ఈ విశిష్ట గౌరవం ఆపాదించడం ఇదే తొలిసారి. ప్రస్తుతం ఈ కరీబియన్ దేశ పర్యటనలో ఉన్న మోడీ గౌరవార్థం ఇక్కడి ప్రెసిడెంట్ హౌస్‌లో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు- అయింది. ప్రధాని మోడీ రాజనీతిజ్ఞత, ఆయన కార్యదక్షత, గ్లోబల్ సౌత్ ప్రాధాన్యతల , రెండు దేశాల మధ్య నిర్మాణాత్మక బంధం బలోపేతం వంటి పలు అంశాల నేపథ్యంలో ఈ పురస్కారం అందించారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ క్రిస్టియనే కార్లా కంగలూ మోడీని ప్రశంసించారు. ప్రధాని మోడీ ఈ చిన్నదేశంలో రెండు రోజుల పర్యటనకు వచ్చారు. ఈ దేశ అత్యున్నత విశిష్ట పురస్కారానికి తనను ఎంపిక చేసినందుకు తాను ట్రినిడాడ్ టొబాగో ప్రజలకు కృతజ్ఞుడిగా ఉంటానని ప్రధాని తెలిపారు. తాను ఈ పురస్కారాన్ని 140 కోట్ల మంది భారతీయుల పక్షాన స్వీకరిస్తున్నానని తెలిపారు. రెండు మూడు రోజుల క్రితమే మోడీకి ఘనా దేశ విశిష్ట పురస్కారం అందింది. ఈ విధంగా ప్రధాని మోడీకి ఇప్పటివరకూ మొత్తం మీద 25 అంతర్జాతీయ స్థాయి గౌరవ పురస్కారాలు దక్కాయి. 180 సంవత్సరాల క్రితం బీహార్ ఇతర ప్రాంతాల నుంచి భారతీయులు ఈ దేశానికి వచ్చి స్థిరపడ్డారని, తరతరాలుగా ఈ దేశంతో మనకు అత్యంత పురాతన వారసత్వ బంధం ఉందని, ఇది మరింత పెనవేసుకుపోతోందని పురస్కార స్వీకరణ సభలో మోడీ తెలిపారు.

# పీ-4 అమలులో ఏపీ ప్రభుత్వం కీలక అడుగులు

**- అమలు కావడం కోసం రెండు కమిటీలు ఏర్పాటు**

**- జిల్లాల కలెక్టర్లతో వీడియ కాన్ఫరెన్స్‌లో చంద్రబాబు**



**అమరావతి,జూలై4( వెలుతురు):**

పీ-4 అమలులో ఏపీ ప్రభుత్వం కీలక అడుగులు వేస్తుంది. అందులో భాగంగా పీ 4 భవిష్యత్తు కార్యాచరణపై సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన శుక్రవారం వెలగపూడిలోని సచివాలయంలో అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పీ-4 పథకం సమర్థవంతంగా అమలు కావడం కోసం రెండు కమిటీలు ఏర్పాటు- చేయాలని నిర్ణయించారు. పీ -4 అమలు, పర్యవేక్షణ కోసం జిల్లా, నియోజకవర్గ స్థాయి ఛాప్టర్ల ఏర్పాటు-కు ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. అలాగే ఈ కమిటీ-ల్లో ఇన్‌ఛార్జ్ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా, నియోజకవర్గం స్థాయి అధికారులు సభ్యులుగా ఉండనున్నారు. ఇక పీ-4 లోగోను సీఎం చంద్రబాబు ఖరారు చేశారు. ఆగస్టు 15వ తేదీ నాటికి 15 లక్షల బంగారు కుటు-ంబాలు, లక్ష మంది మార్గదర్శకులను గుర్తించేలా లక్ష్యంగా నిర్దేశిరచుకున్నారు. పీ-4 అమల్లో బాపట్ల జిల్లా నెంబర్ వన్ స్థానంలో నిలిచిందని సీఎం చంద్రబాబు వెల్లడించారు. అదే విధంగా పీ-4 పథకం అమలుపై ప్రజల్లో నెలకొన్న సందేహాలను ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు దృష్టికి ఎమ్మెల్యేలు తీసుకు వెళ్లారు. పీ-4 వల్ల సంక్షేమ పథకాల్లో కోత ఉండదని.. ఇది సంక్షేమానికి అదనమని ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పీ-4 పథకంపై ప్రజల్లోని అపోహలను తొలగించాలని వారికి ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ఆదేశించారు. బంగారు కుటుంబాలకు సరైన సమయంలో సహకారం.. నిరంతర గైడెన్స్ ఇవ్వడమనేది మార్గదర్శకులు బాధ్యతగా తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ రోజు జరిగిన స్వర్ణాంధ్ర పీ 4 ఫౌండేషన్ తొలి జనరల్ బాడీ సమావేశం కావడంతో... మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఇక జూమ్‌లో జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు, జిల్లా, మండల స్థాయి అధికారులు హాజరయ్యారు.

# రాష్ట్రంలో దిగజారిన శాంతిభద్రతలు

**- రాష్ట్రపతి పాలన ఎందుకు పెట్టకూడదు**

**- సోషల్ మీడియా వేదికగా జగన్ ప్రశ్న**

**అమరావతి,జూలై4( వెలుతురు):**

సోషల్ మీడియా వేదికగా మరోసారి కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ ఫైర్ అయ్యారు .. మాఫియా తరహాలో రాష్ట్రాన్ని నడుపుతున్న చంద్రబాబుకు అసలు పదవిలో ఉండే అర్హత ఉందా? రాజకీయ నాయకులకు, పౌరులకు రక్షణ లేని ఈ రాష్ట్రంలో, రాజ్యాంగాన్ని, చట్టాన్ని ఉల్లంఘిస్తూ, లా అండ్ ఆర్డర్ కాపాడలేని పరిస్థితుల్లో రాష్ట్రపతి పాలన ఎందుకు పెట్టకూడదు అంటూ ప్రశ్నించారు.. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా క్షీణించింది. రెడ్‌బుక్, పొలిటికల్ గవర్నన్స్‌లతో ఆంధ్రప్రదేశ్ రక్తమోడుతోంది. వైయస్సార్‌సీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలపై ఒక పథకం ప్రకారం తప్పుడు కేసులు, అరెస్టులు, అదీ వీలుకాకపోతే, తనవాళ్లని ప్రోత్సహించి మరీ దాడులు చేయిస్తున్నారని విమర్శించారు. గుంటూరు జిల్లా మన్నవ గ్రామ దళిత సర్పంచి నాగమల్లేశ్వర్రావును పట్టపగలే కొట్టి చంపేప్రయత్నంచేశారు. దీనికి సంబంధించిన వైరల్ అయిన వీడియో రాష్ట్రంలో మాఫియా, దుర్మార్గపు పాలనను తెలియజేస్తోంది. నాగమల్లేశ్వర్రావు కుటుంబం మొదటినుంచి వైయస్సార్‌సీపీలో ఉండడం, ప్రజల్లో వారికి మంచి గుర్తింపు ఉండడం టీ-డీపీ వారికి కంటగింపుగా మారింది. పలుమార్లు బెదిరించినా, భయపెట్టినా వెనకడుగు వేయకపోవడంతో, రాజకీయంగా అక్కడ, ఆ ప్రాంతంలో వైయస్సార్‌సీపీ ప్రాబల్యాన్ని తట్టు-కోలేక స్థానిక ఎమ్మెల్యే తన కార్యకర్తలను పురిగొల్పి ఈ దాడులు చేయించారు. ఆ వీడియోలు చూస్తే, జరిగిన దాడి ఎంత అన్యాయమో, ఎంత హేయమో కనిపిస్తుందన్నారు జగన్.. సీఎం చంద్రబాబు స్వయంగా ప్రోత్సహిస్తూ, తన వాళ్లతో చేయిస్తున్న ఈ దారుణాలతో, వరుసగా జరుగుతున్న ఘటనల నేపథ్యంలో, రాష్ట్రంలో ఎవ్వరికీ రక్షణలేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు..ఇక, మన్నవ గ్రామ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నేత బొనిగల నాగమల్లేశ్వరరావు ఆరోగ్య పరిస్థితిపై ఫోన్‌లో వాకబు చేశారు వైఎస్ జగన్. నాగమల్లేశ్వరరావు అన్న, మాజీ ఎంపీపీ వేణుప్రసాద్‌తో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే ప్రోత్సాహంతోనే టీడీపీ మూకలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన విషయం పార్టీ నాయకులు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. వైఎస్సార్‌సీపీకి స్థానికంగా బలమైన నాయకత్వాన్ని అందిస్తూ ప్రజలకు అందుబాటు-లో ఉంటూ మంచి పేరు తెచ్చుకున్న కుటు-ంబాన్ని చూసి ఓర్వలేక ఈ దారుణానికి పాల్పడడం దారుణమన్నారు. టీ-డీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచి గ్రామంలో విచ్చలవిడిగా చేస్తున్న అక్రమాలకు నాగమల్లేశ్వరరావు అడ్డుగా ఉన్నారని ఈ దాడికి పాల్పడిన విషయం తన దృష్టికి వచ్చిందని వైఎస్ జగన్ అన్నారు.



# భార్యను గొంతునులిమి చంపిన భర్త

**చిన్నారిని అక్కడే వదిలేసి పరార్**

**మేడ్చెల్ జిల్లాలో ఘటన**

**హైదరాబాద్,జూలై4( వెలుతురు):**

భార్యపై అనుమానంతో భర్త ఆమె గొంతు నులిమి హత్య చేశాడు. ఆమె మరణించిందని నిర్ధారించుకున్న తర్వాత తన ఐదు నెలల కన్నకూతురుపై కనికరం లేకుండా అక్కడే వదిలి ఘటనా స్థలం నుంచి పారిపోయాడు. ఈ విషాదకర సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కెఎల్‌ఆర్-ఎన్‌జేఆర్ నగర్‌లో శుక్రవారం జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. నెల్లూరు జిల్లా, కందుకూరు మండలం, ముప్పల గ్రామానికి చెందిన రాంబాబుతో ప్రశాంతి (22) వివాహం ఏడాదిన్నర కిందట జరిగింది. వీరికి ఐదు నెలల పాప ఉంది. రాంబాబు భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. నెలరోజుల కిందట మేడ్చల్ పట్టణంలోని కెఎల్‌ఆర్-ఎన్‌జెఆర్ నగర్‌లో వారు అద్దెకు ఉంటున్నారు. పెళ్లయిన నాటినుంచి భార్యను రాంబాబు అనుమానంతో వేధిస్తున్నాడు. ఈ విషయమై తరుచూ ఇద్దరి మధ్య గొడవలు జరుగుతుండేవి. కుటు-ంబ పెద్దలు ఇరువురికి నచ్చచెపుతూ వచ్చారు. పాప పుట్టిన తర్వాత అయినా రాంబాబు మారకపోతాడా అని అంతా భావించారు. అయితే అతడిలో ఏ మాత్రం మార్పు రాలేదు. ఈ క్రమంలో గురువారం రాత్రి కూడా భార్యాభర్తల మధ్య గొడవ జరిగి, రాంబాబు తన భార్య గొంతు నులిమి హత్య చేశాడు. చనిపోయిందని నిర్ధారించుకున్న తర్వాత తమ ఐదు నెలల పాపను అక్కడే వదిలేసి పారిపోయాడు. శుక్రవారం ఉదయం బంధువులు రాంబాబుకి ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో వారు ఇంటికి వచ్చి చూసేసరికి ప్రశాంతి విగతజీవిగా నేలపై పడి ఉంది. ఐదు నెలల పాప తల్లి పక్కన ఏడుస్తూ కనిపించింది. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించారు. ప్రశాంతిని ఆమె భర్త రాంబాబు హత్య చేసినట్టు- ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. ప్రశాంతి తల్లిదండ్రులు రోదిస్తూ తమ కుమార్తెను అనుమానంతోనే హత్య చేశాడని ఆరోపించారు. ఏడాదిన్నర కిందట ప్రశాంతిని రాంబాబుకు ఇచ్చి వివాహం చేశామని, అప్పటినుంచే అనుమానాంతో వేధిస్తున్నాడని ప్రశాంతి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.




# పట్టాలు తప్పిన గూడ్స్

**మహబూబ్‌నగర్, జూలై4( వెలుతురు):**

మహబూబ్‌నగర్‌లో గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. నగరంలోని బోయపల్లి గేట్ వద్ద 6వ నంబర్ బోగి పట్టాలు తప్పినట్లు- లోకో పైలట్ గుర్తించి రైలును నిలిపివేశారు. సుమారు 20 మీటర్ల మేర స్లీపర్ (సిమెంటు- పట్టాలు)పై రైలు వెళ్లింది. గూడ్స్ రైలు రామగుండం నుంచి తమిళనాడుకు వెళ్తుండగా ఈ ఘటన చోటు-చేసుకుంది. దీంతో మహబూబ్‌నగర్-కర్నూలు మార్గంలో 3 గంటలుగా రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. చెంగల్‌పట్టు-, హంద్రీ, మైసూర్, సెవెన్‌హిల్స్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిచిపోయాయి. పట్టాలు తప్పిన గూడ్స్ రైలు వద్ద మరమ్మతులు చేపట్టేందుకు కాచిగూడ నుంచి యాక్షన్ రిలీఫ్ -ట్రైన్‌ను అధికారులు రప్పించారు.

## ఆరుదైన శస్త్రచికిత్స చేసిన టిఎక్స్ ఆసుపత్రి వైద్యులు

**హైదరాబాద్ జూలై4( వెలుతురు):**

అత్యంత సంక్లిష్టమైన కేసులో శస్త్రచికిత్స నిర్వహించి తల్లి, ఇద్దరు శిశువుల ప్రాణాలను కాపాడామని బంజారాహిల్స్ లోని టీఎక్స్ ఆస్పత్రి వైద్యులు తెలిపారు. జహీరాబాద్కు చెందిన ఆయేషా 28 వారాల కవల పిల్లలు కలిగిన గర్భంతో తరచూ రక్తస్రావంతో బాధపడుతున్నారు. ఆమెకు గతంలో రెండు సిజేరియన్ డెలివరీలు గర్భాశయంపై శస్త్రచికిత్స జరిగాయి. ఈమెకు 'ప్లసెంటా పెర్కేట్రా, బ్లాడర్ ఇన్వేజన్, ట్విన్ ప్రెగ్నెన్సీ' కలగలిపిన తీవ్ర మైన సమస్య కనిపించింది. వైద్య బృందం శస్త్రచికిత్స చేసి కేజీ బరువున్న పురుష శిశువు, 760 గ్రాముల ఆడ శిశువు విజయ వంతంగా జన్మించేలా చర్యలు తీసుకుంది.

# నితిన్ తమ్ముడు కథలో బలహీనతలు
## కథాకథనంలో కానరాని సీక్వెన్స్

సుదీర్ఘ కెరీర్ ఉన్నా సరైన విజయం కోసం ఎదురు చూస్తున్న కథానాయకుల్లో నితిన్ ఒకరు. ఆయన నటించిన తాజా చిత్రమే 'తమ్ముడు'. 'వకీల్ సాబ్' వంటి విజయవంతమైన చిత్రం తర్వాత వేణు శ్రీరామ్ దర్శకత్వం వహిస్తుండటం, దిల్ రాజు నిర్మాత కావడం, లయ కీలక పాత్ర పోషించడంతో ఈ సినిమాపై అంచనాలు ఏర్పడ్డాయి. అయితే ఏ చిత్రానికైనా కథాకథనం ముఖ్యం. చెప్పదల్చుకుంది సూటిగా చెప్పకుంటే ఎంత పెద్ద హీరో సినిమా అయినా జనం లేచిపోతారు. ఇప్పుడు దర్శకుడు కూడా కథనంలో పెద్దగా శ్రద్ధ పెట్టినట్లుగా లేదు. జై (నితిన్) విలువిద్యలో దేశం తరఫున ఆడి ఎన్నో పతకాలు సాధిస్తాడు. మరొక పెద్ద లక్ష్యంపై గురి పెట్టినా, ఏకాగ్రత కుదరదు. మనసుని ఏవో జ్ఞాపకాలు వెంటాడుతూ ఉంటాయి. అక్క స్నేహలత (లయ)తో ముడిపడిన జ్ఞాపకాలే అవి అని కొన్నాళ్ల తర్వాత తెలుస్తుంది. జై చిన్నప్పుడు జరిగిన కొన్ని సంఘటనలతో కుటుంబానికి దూరమవుతుంది స్నేహలత. ఇంకెప్పుడూ పుట్టింటి గడప తొక్కనని శపథం చేసి వెళ్లిపోతుంది. ఆ మాట ప్రకారమే తండ్రి చనిపోయినా, ఇంటి వైపు తిరిగి చూడదు. అక్క విషయంలో చేసిన ఓ చిన్న తప్పు జైని వెంటాడుతూ ఉంటుంది. ఆ తప్పు గురించి చెప్పి, మళ్లీ అక్కకు దగ్గరవ్వాలని తన స్నేహితురాలు చిత్ర (వర్ష బొల్లమ్మ)తో కలిసి బయల్దేరతాడు. తీరా అక్కడకు వెళ్లాక ఆమె తన కుటుంబంతో కలిసి అంబర గొడుగు అటవీ ప్రాంతంలో జరిగే అమ్మవారి జాతరకు వెళ్లినట్టు తెలుస్తుంది. అలాగే ఆమె తన పేరును ఝాన్సీగా మార్చుకున్నట్టు తెలుసుకుంటాడు. దీంతో తన సోదరిని కలిసేందుకు జై కూడా అటవీ ప్రాంతానికి వెళ్లేందుకు సిద్ధమవుతాడు. మరోవైపు ఝాన్సీ, ఆమె కుటుంబాన్ని అజర్వాల్ (సౌరభ్ సచ్‌దేవా) ముఠా లక్ష్యంగా చేసుకుంటుంది. మరి జై తన అక్క ఝాన్సీని కలుసుకున్నాడా? అజర్వాల్ ముఠా నుంచి ఝాన్సీ, ఆమె కుటుంబం ఎలా బయట పడింది అనేది చిత్రకథ. అక్కా తమ్ముడి కథతో ముడిపడిన ఓ యాక్షన్ అడ్వెంచర్ సినిమా ఇది. అయితే ఆ బంధం చుట్టూ అల్లుకున్న భావోద్వేగాలు.. అడవిలో హీరో చేసే సాహసాలు రెండూ మెప్పించలేదు. భోపాల్, వైజాగ్ తదితర ప్రదేశాల్లో గతంలో జరిగిన గ్యాస్ లీక్ సంఘటనల్ని గుర్తు చేస్తూ ఆసక్తికరంగానే దర్శకుడు సినిమాని మొదలుపెట్టాడు. ముఖ్యంగా విలన్ పరిచయ సన్నివేశాలు సినిమాలో మరింతగా లీనం చేస్తాయి. ఆ తర్వాత అక్కాతమ్ముళ్లు ఒకరికొకరు దూరమైన తీరు, కుటుంబ నేపథ్యంలోని ఆ సన్నివేశాలు భావోద్వేగాలపై అంచనాల్ని పెంచుతాయి. హీరో అడవి బాట పట్టేవరకూ సినిమా ట్రాక్‌లోనే వెళుతుంది. ఆ తర్వాత నుంచే గాడి తప్పింది. అడవిలో పాత్రలు చేసే ఆర్తనాదాలు తప్ప, మరే ఇతర భావోద్వేగం ప్రేక్షకుడి హృదయాన్ని తాకవు. తొలి అరగంట తర్వాత సినిమా పూర్తిగా యాక్షన్ అడ్వెంచర్‌గా మలుపు తీసుకుంటుంది. ఝాన్సీకి, ఆమె కుటుంబానికీ రక్షణగా ఉంటూ, వాళ్లని అంబర గొడుగుని దాటించే బాధ్యత హీరోది. 'ఖైదీ' సినిమాని గుర్తుచేసే సందర్భం అది. అలాంటప్పుడు యాక్షన్ డిజైన్ థ్రిల్లింగ్‌గా ఉండాలి. హీరో చేసే సాహసాలు కట్టిపడేయాలి. కానీ, ఈ సినిమాలో అలాంటిదేమీ జరగదు. హీరోయిన్ సప్తమి గౌడ చుట్టూ మలిచిన సన్నివేశాలు కథా గమనాన్ని దెబ్బతీశాయి. కథానాయకుడి పాత్రని మరింత బలహీనంగా మార్చేశాయి.




# గ్రామీణ నేపథ్యంలో సాగే ..ఉప్పు కప్పురంబు

ఒకవైపు సినిమాలు చేస్తునే మరోవైపు ఓటీటీలకు ఒకే చెబుతుంది నటి కీర్తి సురేష్. ఇప్పటికే అక్క అనే వెబ్ సిరీస్ చేస్తున్న ఈ అమ్మడు మరోవైపు ఉప్పు కప్పురంబు అంటూ ఒక ఓటీటీ సినిమా చేసింది. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్‌లో ఈ చిత్రం నేరుగా ఈరోజు ప్రేక్షకుల ముందుకు రాగా ఈ చిత్రానికి ఐవీ శశి దర్శకత్వం వహించాడు. నటుడు సుహాస్ కీలక పాత్రలో నటించాడు. సినిమా కథ మొత్తం చిట్టి జయపురం అనే ఊరి చుట్టూ తిరుగుతుంది. తన తండ్రి మరణంతో చిట్టి జయపురం ఊరి పెద్దగా బాధ్యతలు తీసుకుంటుంది అపూర్వ (కీర్తి సురేశ్). అయితే అపూర్వకి ఇది సంతోషం ఇచ్చేలోపే ఊరికి విచిత్రమైన సమస్య వస్తుంది. ఊరిలో శ్మశానం కొరత ఎదురవుతుంది. ఆ ఊరిలో మొదటగా చనిపోయిన నలుగురికి మాత్రమే శ్మశానంలో చోటు ఉంటుంది.




దీంతో ఈ విషయాన్ని ఊరి పెద్ద అయిన అపూర్వ ముందుకు తీసుకువెళతాడు కాటికాపరి చిన్న (సుహస్). ఈ విషయం తెలిసిన అపూర్వ ఊరి కోసం ఏం చేసింది. అపూర్వకి కాటికాపరి చిన్న ఎలా సహాయపడ్డాడు. శ్మశానం సమస్య ల్లో ఎలాంటి చిచ్చు పెట్టిందనేది ఈ సినిమా కథ. యువ దర్శకులు ఈ మధ్య కొత్త కొత్త కథలతో ప్రేక్షకుల ముందుకు వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఇలాంటి మరో కొత్త కథనే ఈ చిత్రం. చనిపోయిన తర్వాత శ్మశానం కొరత అనే సామాజిక సమస్యను వినోదంతో మేళవించి తెరకెక్కించే ప్రయత్నంలో దర్శకుడు ఐవీ శశి కొంతవరకు సఫలమయ్యారు. కీర్తి విషయానికి వస్తే.. ఇప్పటివరకు గ్లామర్, డీ-గ్లామర్ పాత్రలతో ఆకట్టుకున్న ఈ భామ చాలా రోజుల తర్వాత ప్రత్యేకమైన పాత్రలో నటించింది. అపూర్వ అనే గ్రామ పెద్దగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆమెకు శ్మశానం సమస్య ఎదురవ్వడం. ఈ సమస్యను తాత్కాలికంగా పరిష్కరించా మని అనుకునేలోపు నలుగురు చనిపోవడంతో అది మరింత తీవ్రమవ్వడం ఆసక్తికరంగా సాగుతుంది. అలాగే ఈ సినిమాలో దర్శకుడు శ్మశానం చుట్టూ ఉన్న సమస్యలు, వాటి పరిష్కారాలను చూపించారు. కీర్తి సురేష్ గ్రామ పెద్దగా బాగా నటించినప్పటికీ, ఆమె పాత్రలో కొన్ని తికమక పెట్టే సన్నివేశాలున్నాయి. ఒక సీన్‌లో అమాయకంగా కనిపించిన కీర్తి, మరో సీన్‌లో చాలా తెలివైన అమ్మాయిగా వ్యవహరించడం లాజికల్‌గా అనిపించదు. కొన్ని సీన్లలో ఆమె అతిగా స్పందించినట్లు కూడా అనిపిస్తుంది. అయితే కీర్తి నటన మాత్రం చాలా బాగుంది. సుహాస్ పాత్ర చాలా స్థిరంగా, ఎక్కడా తడబాటు లేకుండా ఉంటుంది. సినిమా మొత్తం ఎక్కువగా సుహాస్, కీర్తిల మధ్యే సాగుతుంది. కథలో అక్కడక్కడా చిన్న లోటుపాట్లు ఉన్నప్పటికీ, ఈ సినిమా ప్రేక్షకులను ఆలోచింపజేస్తుంది.

# హరిహర వీరమల్లు ట్రైలర్ అదుర్స్
## 24 గంటల్లో 48 మిలియన్ల వ్యూస్




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న పీరియాడిక్ యాక్షన్ అడ్వెంచర్ చిత్రం 'హరిహర వీరమల్లు'. ఈ మూవీ జూలై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానున్న నేపథ్యంలో ఈ సినిమా ప్రమోషన్స్ జోరుగా సాగుతున్నాయి. ఈ మూవీ ట్రైలర్ విడుదల కాగా, ప్రేక్షకుల నుంచి అపూర్వ స్పందన లభించింది. కేవలం 24 గంటల్లోనే తెలుగు ట్రైలర్‌కు 48 మిలియన్లకు పైగా వ్యూస్ వచ్చాయి. ఇది ఆల్‌టైమ్ రికార్డుగా నిలిచింది. అంతేకాదు, అన్ని భాషల్లో కలిపి ట్రైలర్‌కు 61.7 మిలియన్ల వ్యూస్ వచ్చాయని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. గణాంకాల నేపథ్యంలో చిత్ర బృందం ఒక ఆసక్తికర కామెంట్ చేసింది. 'ఇది సాధారణ రికార్డ్ కాదు, భవిష్యత్తులో వచ్చే సినిమాలన్నింటికీ ఇది ఒక హెచ్చరిక. అంటూ రాసుకొచ్చారు. మరోవైపు ఇది పుష్ప2 రికార్డ్ కూడా బ్రేక్ చేసిందని అంటున్నారు. ఇప్పటి వరకు సౌత్ ఇండియాలో విడుదలైన 24 గంటలలో 44.67 మిలియన్ వ్యూస్ సాధించిన పుష్ప 2 సాధించింది. ఇప్పుడు దానిని హరిహర వీరమల్లు బ్రేక్ చేసింది. కేవలం 23 గంటల్లోనే 47 మిలియన్స్ వ్యూస్ సాధించి పుష్ప2 రికార్డ్ బ్రేక్ చేసిందని అంటున్నారు. ఈ రికార్డులతో పవన్ అభిమానుల ఆనందం అంతా ఇంతా కాదు. ఈ చిత్రంలో నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తుండగా, బాబీ డియోల్, అనుపమ్ ఖేర్, సత్యరాజ్ వంటి ప్రముఖులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. 17వ శతాబ్దం ముస్లిం పాలన సమయంలో పవన్ కళ్యాణ్ ఓ వీరుడిగా, ప్రజా పరిరక్షణ కోసం పోరాడే పాత్రలో కనిపించనున్నారు. ఇందులో ఆయన పాత్ర శౌర్యం, తెలివి, ధైర్యం మేళవింపుతో ఉంటుందని తెలుస్తోంది.ఈ చిత్రాన్ని మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ.దయాకర్ రావు నిర్మిస్తున్నారు. ఎ.ఎం. రత్నం సమర్పణలో ఈ సినిమా రూపొందుతోంది. మొదట దర్శకుడు క్రిష్ ఈ చిత్రాన్ని రూపొందించగా, మధ్యలో కొన్ని అనివార్య కారణాల వల్ల ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నారు. ఆ తర్వాత మిగిలిన భాగాన్ని రత్నం కుమారుడు జ్యోతి కృష్ణ పూర్తి చేశారు.

# భారీ స్థాయిలో విడుదలకు వార్-2 సిద్ధం

యంగ్ టైగర్ ఎన్టీఆర్ భారీ మల్టీస్టారర్ వార్ 2. బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్ తో కలిసి నటిస్తున్నాడుర్. ఇప్పటికే రిలీజ్ అయిన




పోస్టర్స్, గ్లిమ్స్ సినిమాపై అంచనాలు భారీగా పెంచేశాయి. కియారా అద్వానీ హీరోయిన్ గా నటిస్తోంది. బాలీవుడ్ బడా నిర్మాణ సంస్థ యష్ రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తుండగా అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ భారీ బ్జడెట్ చిత్రం ఏడాది ఆగస్టు 14 న ఈ సినిమా వరల్డ్ వైడ్ రిలీజ్ కానుంది. అయితే ఈ సినిమా రిలీజ్ కు భారీ ఏర్పాట్లు చేస్తుంది యష్ రాజ్ ఫిల్మ్స్. ఇండియన్ సినిమా హిస్టరీలోనే జరగనటువంటి రీతిలో రిలీజ్ కు ఎ÷-లాన్ చేస్తున్నారట. వినిపిస్తున్న సమాచారం ప్రకారం వార్2 ను ఇండియా వైడ్ గా సుమారు 9,000 స్క్రీన్స్ లో రిలీజ్ చేసేలా ఎ÷-లాన్ చేస్తున్నారట. అదే జరిగితే ఇది ఓ హిస్టరీ అనే చెప్పాలి. ఇప్పటి వరకు అత్యధిక స్క్రీన్స్ లో రిలీజ్ అయిన ఇండియాన్ సినిమాల లిస్ట్ లో సూపర్ స్టార్ రజనీకాంత్ నటించిన రోబో 2.క్ష మొత్తం 7,500 స్క్రీన్స్ పేరిట ఉంది. ఇప్పుడు దాన్ని బీట్ చేయబోతుంది వార్ 2. ఇటు తెలుగు స్టేట్స్ లోను వార్ 2 రిలీజ్ కు భారీ ఏర్పాట్లు జారుతున్నాయి. ఈ సినిమా రైట్స్ ను సితార నాగవంశీ రూ. 90 కోట్లకు కొనుగోలు చేసారు. ఇంతటి భారీ అంచనాల మధ్య విడుదలవుతున్న వార్ 2 ఎంతటి సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి.

# అనుష్క ఘాటీ మూవీ విడుదలకు సమస్యలు

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టి ప్రధాన పాత్రలో నటిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'ఘాటీ' విడుదల మరోసారి వాయిదా పడే సూచనలు మళ్లీ కనిపిస్తున్నాయి. గతంలో 'వేదం' వంటి విజయవంతమైన చిత్రాన్ని అందించిన క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో అనుష్క నటిస్తున్న ఈ సినిమాపై




భారీ అంచనాలు నెలకొన్న విషయం తెలిసిందే. యూవీ క్రియేషన్స్ సమర్పణలో, రాజీవ్ రెడ్డి, సాయిబాబా నిర్మిస్తున్న ఈ చిత్రం నుండి విడుదలైన గ్లింప్స్ ఇప్పటికే ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. అయితే ఈ చిత్రాన్ని మొదట ఏప్రిల్ 18న విడుదల చేయడానికి సన్నాహాలు చేశారు. కానీ షూటింగ్ ఆలస్యం కావడంతో విడుదల వాయిదా పడింది. ఆ తర్వాత, మేకర్స్ అధికారికంగా జులై 11న సినిమాను విడుదల చేస్తామని ప్రకటించారు. అందుకు తగ్గట్టుగానే షూటింగ్ కూడా పూర్తి చేశారు. అయితే, తాజా సమాచారం ప్రకారం, సినిమాకు సంబంధించిన సీజీ (కంప్యూటర్ గ్రాఫిక్స్) పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, విడుదల తేదీ లోపు అవి పూర్తయ్యే అవకాశం లేదని తెలుస్తోంది. దీంతో, 'ఘాటీ' విడుదల మరోసారి వాయిదా పడే అవకాశం ఉందని.. దీనికి సంబంధించి అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడనుందని యూనిట్ వర్గాలు వెల్లడించాయి. భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాకు కొత్త విడుదల తేదీగా ఆగస్టు 27ను నిర్మాతలు పరిశీలిస్తున్నట్లు సమాచారం. అనుష్క అభిమానులు 'ఘాటీ' కోసం ఆసక్తిగా ఎదురుచూస్తుండగా, సినిమా విడుదల ఎప్పుడు జరుగుతుందో వేచి చూడాలి.

### ఆగస్టు 21 నుంచి

## పార్లమెంట్ సమావేశాలు

**- నెలరోజులపాటు జరుగనున్న వర్షాకాల భేటీ**



**న్యూఢిల్లీ,జులై4( వెలుతురు):**

జులై 21 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరగనున్నాయి. ఆగస్టు 21 వరకు నెల రోజుల పాటు సభా కార్యకలాపాలు జరగనున్నాయి. ఈ మేరకు పార్లమెంట్ సమావేశాల షెడ్యూల్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలినట్లు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. ఆగస్టు 15న స్వాతంత్య్ర దిన వేడుకలు ఉన్నందున 13, 14 తేదీల్లో సమావేశాలు ఉండవని తెలిపారు. ఆపరేషన్ సిందూర్, పహల్గాం ఉగ్రవాద దాడిపై పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ ప్రకటన చేసింది. ఈ సమావేశాల్లోనే బీమా సవరణ బిల్లును ప్రవేశపెట్టే అవకాశముంది. బీమా రంగంలో ఎఫ్‌డీఐ పరిమితిని 100 శాతానికి పెంచుతున్నట్లు తెలుస్తోంది. బిల్లు ముసాయిదా సిద్ధంగా ఉంది. పహల్గాం ఉగ్రదాడి, ఆ తరువాత చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన విషయాలపై పార్లమెంట్ ప్రత్యేక సమావేశంలో చర్చించాలని ప్రతిపక్ష పార్టీల నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. భారత్–పాక్ మధ్య జరిగిన కాల్పుల విరమణ ఒప్పందానికి తానే మధ్యవర్తిత్వం వహించానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనపై కూడా ఈ సందర్భంగా చర్చించాలని పట్టుబట్టారు. ఈ నేపథ్యంలో వర్షాకాలపు సమావేశాలు వాడి వేడిగా జరిగే అవకాశముంది. గతలో పార్లమెంటు బ్జడెట్ సమావేశాలు రెండు భాగాలుగా జరిగాయి. మొదటి సమావేశం జనవరి 31న ప్రారంభమై ఫిబ్రవరి 13 వరకూ కొనసాగింది. పార్లమెంటు బ్జడెట్ సమావేశాల రెండవ భాగం మార్చి 10న ప్రారంభమై ఏప్రిల్ 4న ముగిసింది.

## మహారాష్ట్ర నుంచి భారీగా వస్తున్న వరదనీరు

**- కాళేశ్వరం వద్ద ప్రాణహిత ఉధృతి**



**జయశంకర్ భూపాలపల్లి,జూలై4( వెలుతురు):**

కాళేశ్వరం వద్ద ప్రాణహిత నది మరోసారి ఉధృతంగా ప్రవహిస్తోంది. మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాల ప్రభావంతో నదికి వచ్చే వరద నీటి ప్రవాహం భారీగా పెరిగింది. దీంతో పుష్కర ఘాట్ల వద్ద తాత్కాలిక వ్యాపార స్థలాలు పూర్తిగా నీట మునిగాయి. ఇప్పటి వరకు నీటి కొరతతో వెలిసిన నదీ తీరంలో గుడారాలు వేసుకుని వ్యాపార కార్యకలాపాలు సాగించిన స్థానికులు, వరద ఉధృతికి అవన్నీ కోల్పోయారు. మరోవైపు, నీటి ఉధృతి ఉన్నా కూడా భక్తులు పుణ్యస్నానాల కోసం నదిలోకి దిగుతున్న దృశ్యాలు అధికారులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ప్రమాదకర పరిస్థితుల్లో భక్తులు నదిలోకి ప్రవేశించడం పట్ల అధికారులు అప్రమత్తమవుతున్నారు. వరద ప్రవాహం పెరగడంతో నది పక్కన ఎలాంటి శాశ్వత ఏర్పాట్లు లేకపోవడం వల్ల, ప్రజలకు అవగాహన కల్పించేందుకు సిబ్బందిని మోహరించారు. ఇక ఎగువ మహారాష్ట్ర నుంచి వస్తున్న భారీ వరద నీరు కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ లక్ష్మి బ్యారేజీకి చేరుతోంది. ప్రస్తుతానికి బ్యారేజీకి పై నుంచి సుమారు 84,500 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు 85 గేట్లను ఎత్తి, అదే స్థాయిలో నీటిని దిగువకు వదులుతున్నారు. బ్యారేజీ వద్ద ఇన్‌ఎ÷–లో, అవుట్‌ఎ÷–లో సమానంగా కొనసాగుతున్న నేపథ్యంలో, దిగువన ఉన్న ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఈ వరద ఉధృతికి సంబంధించి జిల్లా పాలన యంత్రాంగం ఇప్పటికే ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. లోతట్టు ప్రాంతాలపై నిఘా పెట్టి, అవసరమైతే స్థానికులను ఖాళీ చేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వరద స్థాయిలను గమనిస్తూ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూస్తామని అధికారులు తెలిపారు. ప్రస్తుతం ప్రాణహిత నది పరివాహక ప్రాంతాల్లో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. భక్తులు కూడా నదిలోకి వెళ్లే సమయంలో జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

## హిమాచల్‌లో వరదబీభత్సం

**- భారీ వర్షాలకు 63మంది మృతి..పలవురు గల్లంతు**

**సిమ్లా,జూలై4( వెలుతురు):**

హిమాచల్‌ప్రదేశ్‌పై జలఖడ్గం విరుచుకుపడింది. గత కొద్ది రోజులుగా ప్రకృతి ప్రకోపం చల్లారడం లేదు. ఓ వైపు కుండపోత వర్షాలు.. ఇంకోవైపు కొండచరియలు విరిగిపడడంతో భారీగా ప్రాణ, ఆస్తి జరిగింది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు భయాందోళన కలిగిస్తున్నాయి. ఇప్పటి వరకు 63 మంది చనిపోగా.. రూ.400 కోట్లకు పైగా ఆస్తి నష్టం జరిగినట్లుగా అధికారులు అంచనా వేస్తున్నారు. ఇక దజన్ల కొద్దీ గల్లంతయ్యారు. వారి వివరాలు తెలియడం లేదు. గత కొద్ది రోజులుగా హిమాచల్‌ప్రదేశ్‌లో నిరంతరాయంగా వర్షాలు కురుస్తున్నాయి. రుతుపవనాలు కారణంగా మేఘాలు రాష్ట్రాన్ని కమ్ముకున్నాయి. అంతేకాకుండా ఆకస్మిక వరదలు సంభవించాయి. ఇంకోవైపు భారీగా కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో ఇప్పటి వరకు 63 మంది చనిపోగా.. పదుల కొద్దీ గల్లంతయ్యారు. మరోవైపు అధికారులు సహాయ చర్యలు చేపట్టారు. ఇక జూలై 7 వరకు అన్ని జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. రూ.400 కోట్ల విలువైన ఆస్తి నష్టం జరిగిందని ప్రభుత్వం తెలిపింది. మండి జిల్లాలో సహాయ, సహాయక చర్యలు కొనసాగుతున్నాయని ప్రభుత్వం వెల్లడించింది. రుతుపవనాలు జూన్ 20న హిమాచల్ ప్రదేశ్‌లోకి ప్రవేశించాయి. ప్రతి సంవత్సరం మాదిరిగానే రాష్ట్రవ్యాప్తంగా విధ్వంసం సృష్టించాయి. తాజా సమాచారం ప్రకారం మండి జిల్లాలో 40 మంది మరణించగా, కాంగ్రాలో 13 మంది, చంబాలో ఆరుగురు, సిమ్లాలో ఐదుగురు మరణించినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఇక వందలాది ఇళ్లు ధ్వంసమయ్యాయి. 14 వంతెనలు కొట్టుకుపోయాయి. 300 పశువులు చనిపోయాయి. ఇక విద్యుత్ సబ్‌స్టేషన్లు దెబ్బతినడంతో వేలాది మంది ప్రజలు అంధకారంలో మగ్గుతున్నారు. నీరు, ఆహారం కొరత కూడా ఏర్పడింది.

# దక్షిణాదిపై గురిపెట్టిన బిజెపి

**- తొలి ప్రయత్నంగా మహిళా అధ్యక్షురాలు**

**- ముందువరసలో నిర్మలా సీతారామన్,వానతీ శ్రీనివాసన్**

**న్యూఢిల్లీ,జూలై4( వెలుతురు):**

సంస్థాగత ఎన్నికల ప్రక్రియను భారతీయ జనతా పార్టీ వేగంగా ముందుకు తీసుకుని వెళ్తున్న వేళ కొన్ని ఆసక్తికర అంశాలు తెరపైకి వస్తున్నాయి. ప్రధానంగా దక్షిణాదిలో పాగా వేయాలన్న బలమైన కోరికతో ఉంది. ఉత్తరాది పార్టీ అన్న ముద్రను తొలగించుకునే క్రమంలో వేస్తున్న అడుగులు ఇప్పుడు జాతీయ అధ్యక్ష పదవి విషయంలో ఆయరించే ప్రయత్నాలు మొదలయ్యాని తెలుస్తోంది. బిజెపి సాహసాలు చేయడంలోను, ప్రయోగాలు చేయడంలోనూ ముందుంటుంది. దీనితో ఏ పార్టీ పోటీపడలేదు. కాంగ్రెస్‌లో ఇందిర కుటుంబ వారసత్వమే కొనసాగుతుంది. ప్రాంతీయ పార్టీల్లో కూడా వారసత్వ రాజకీయాలే ఉంటాయి. ఈ వాసనలు లేకుండా మనగలుగుతున్న పార్టీ బిజెపి మాత్రమే. ఇందులో చేరిన సామాన్యులు కూడా అసామాన్యులుగా ఎదిగిన సందర్భాలు ఉన్నాయి. ఈ క్రమంలో ఈసారి దక్షిణాది నుంచి పార్టీ అధ్యక్ష పదవిని ఎంచుకునే విషయాన్ని పరిశీలిస్తున్నట్లుగా ప్రచారం సాగుతోంది. అందులోనూ మహిళలయితే మంచిదనే భావనా ఉంది. దీనికితోడు ఉత్తర, దక్షిణ భారతాలు కలుపుతూ...భాషా పరంగా నైపుణ్యాలు ఉండేవారిని కూడా వెతుకుతున్నారని ఢిల్లీ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలోనే నిర్మలా సీతారామన పేరు తాజాగా తెరపైకి వచ్చింది. ఆమె హిందీ, ఇంగ్లీష్ అనర్గళంగా మాట్లాడడమే గాకుండా కఠినంగా పరిశ్రమ చేయగలరు. ఇకపోతే పార్టీ జాతీయ అధ్యక్షుడి ఎన్నికను నిర్వహించాలంటే కనీసం 19 రాష్ట్రాల్లో బిజెపి సారథుల నియామకాలు పూర్తి కావాల్సి ఉంది. ఇప్పటివరకు 16 రాష్ట్రాల్లో అధ్యక్షులను ఖరారు చేశారు. ఈ క్రమంలో ఇటీవలే అనేక రాష్ట్రాలతో పాటు తెలుగు రాష్ట్రాల్లోనూ అధ్యక్షుల ఎంపిక సాగింది. తెలంగాణకు రామచంద్రరావు, ఎపికి మాధవ్‌లు ఎంపికయ్యారు. వీరిద్దరూ పార్టీకి అంకితమై పనిచేస్తున్నవారే. ఇక్కడ కులాల కన్నా పార్టీకి అంకితమై ఉన్నవారినే గుర్తించారు. ఇలా అధ్యక్షుల ఎంపిక పూర్తయిన తర్వాత పార్టీ నిబంధనల ప్రకారం జాతీయ అధ్యక్షుడి ఎన్నిక జరగనుంది. ఈసారి భాజపా జాతీయ అధ్యక్ష పదవిని



దక్షిణాదికి మహిళలకు ఇచ్చే అవకాశం ఉందంటూ ఊహాగానాలు వస్తున్నాయి. ఎందుకంటే దక్షిణాదిపై గురిపెట్టిన బిజెపి ఇలా చేయడంలో ఆశ్యర్యం లేదు. గతంలో వెంకయ్యనాయుడు పార్టీ అధ్యక్షుడిగా పనిచేశారు. తరవాత ఉపరాష్ట్రపతి కూడా అయ్యారు. జాతీయ అధ్యక్ష పదవి రేసులో పరధానంగా కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, భాజపా జాతీయ మహిళా మోర్చా అధ్యక్షురాలు వానతీ శ్రీనివాసన్‌ల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వీరిద్దరూ తమిళనాడుకు చెందిన వారే కావడం గమనించాలి. అలాగే పార్టీలో మహిళలకు పెద్దపీట వేయాలనే ఉద్దేశంతో కూడా దక్షిణాది నుంచి మొట్టమొదటి మహిళా నాయకురాలిని ఎన్నుకునేం దుకు ఆలోచనలు చేస్తున్నారని సంబంధిత వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఈ క్రమంలో భాజపా అధ్యక్ష పదవి రేసులో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ మొదటి స్థానంలో ఉన్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడిస్తున్నాయి. పార్టీలోని అత్యంత ప్రభావవంతమైన మహిళల్లో ఆమె ఒకరు. మోదీ నేతృత్వంలోని ప్రభుత్వంలో 2019లో తొలిసారి నిర్మలమ్మ ఆర్థికశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి.. ఇప్పటికీ అదే పదవిలో కొనసాగుతున్నారు. ఆర్థికమంత్రిగా విమర్శలు వచ్చినా ఆమె దీటుగా జవాబిస్తున్నారు. ఓ రకంగా ఆమె మంచి వక్త కావడం కూడా కలసి వచ్చే అంశంగా చెబుతున్నారు. ప్రస్తుత జాతీయ అధ్యక్షుడు జె.పి.నడ్డా స్థానంలో ఆమె ఎంపిక సరైనదేనని అంటున్నారు. ఇకపోతే భాజపా జాతీయ మహిళా మోర్చా అధ్యక్షురాలు, తమిళనాడు ఎమ్మెల్యే వానతీ శ్రీనివాసన్1993 నుంచి భాజపాలో కొనసాగుతున్నారు. ఆమె 2021 ఎన్నికల్లో.. నటుడు, మక్కల్ నీది మయ్యం వ్యవస్థాపకుడు అయిన కమల్ హాసన్‌ను ఓడించి కోయంబత్తూర్ (దక్షిణ) స్థానాన్ని గెలుచుకున్నారు. 2022లో భాజపా కేంద్ర ఎన్నికల కమిటీ సభ్యురాలిగా ఎన్నికయ్యారు. ఆమె కూడా ఈరేసులో ఉన్నారు. తమిళనాడులో త్వరలో ఎన్నికలు జరగబోతున్నాయి. ఇక్కడ పాగా వేసేందుకు బిజెపి కసరత్తు చేస్తోంది. అన్నామలైని తప్పించాలన్న డిమాండ్‌ను కూడా అంగీకరించింది. స్టాలిన్ ప్రభుత్వాన్ని సాగనంపే క్రమంలో ఈ ప్రయత్నాలు ఫలించవచ్చని అంటున్నారు. ఒకవేళ ఇదే జరిగితే ఇతర పార్టీలకు ఇది ఓ చెంపపెట్టు కాగలదు. అలాగే బిజెపి చేస్తున్న కసరత్తు కూడా ప్రజల్లో ప్రభావం చూపగలదని భావిస్తున్నారు.

# మామిడి రైతుల సమస్యలు పట్టని చంద్రబాబు

**- అబద్ధాలతో జగన్‌ను తిట్టడానికే సరిపోతోంది**

**- పవన్ కళ్యాణ్ నిద్రపోతున్నాడేమో**

**- వైకాపా నేత భూమన కారుణాకర్ రెడ్డి విమర్శలు**

**తిరుపతి,జూలై4( వెలుతురు):**

అసత్య ప్రచారం చేయడంలో చంద్రబాబు దిట్ట అని వైసీపీ నేత, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో గిట్టుబాటు ధర లేక మామిడి రైతులు అల్లాడి పోతున్నారు. లక్షల హెక్టార్లలో వేసిన మామిడి పంటను ఎమీ చేసుకోవాలో తెలియక రైతు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వచ్చింది. సీఎం చంద్రబాబు మామిడి రైతులకు తీరని ద్రోహం చేస్తున్నాడని మండిపడ్డారు. తిరుపతిలో మీడియా సమావేశంలో భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై సెటైర్లు వేశారు. రైతులకు న్యాయం చేయకుండా.. పవన్ నిద్రపోతున్నారన్నారు. చంద్రబాబు నాయుడు సీఎంగా ఉన్నంత కాలం పవన్ నిద్రపోతానే ఉంటారేమో అని ఎద్దేవా చేశారు. వైఎస్ జగన్ అధికారంలో ఉండి ఉంటే రైతులకు ఈ పరిస్థితి వచ్చేది కాదున్నారు. 1995లో చంద్రబాబు



బాగుండేవాడని.. ఇప్పటి సీబీఎన్ చాలా దారుణం అని విమర్శించారు. చంద్రబాబు మామిడి రైతుల సమస్యలు తీర్చకుండా వైసీపీ నేతలను తిట్టుకుంటూ కూర్చున్నాడని భూమన మండిపడ్డారు. కేంద్రంలో కూడా కూటమి ప్రభుత్వం ఉంది, బాబు ఎందుకు అడగలేదు. కర్నాటకలో జేడీఎస్ పార్టీ అధినేత కూమార స్వామి మామిడి రైతులను ఆదుకోవాలని కేంద్రం మంత్రి శిరాజ్ సింగ్ చౌహాన్‌కు లేఖ రాశారు. 16 రూపాయల లెక్కన రెండున్నర మెట్రిక్ టన్నుల మామిడి కొనటానికి అంగీకరించినట్లుగా తిరిగి లేఖ రాశారు. మరి ఏపీలో ఎంపీలు ఏం చేస్తున్నారు. వారికంటే ఎక్కువగా ఎంపీలు ఉన్న టీడీపీ, జనసేన పార్టీలు ఏమి చేస్తున్నాయని అన్నారు. 'పవన్ కళ్యాణ్ మాట్లాడటం మానేసి చాలా రోజులు అయ్యింది. 12 రూపాయలని చెప్పడమే కానీ ఇచ్చింది సగం కూడా లేదు. ప్రభుత్వం ప్రకటించిన నాలుగు రూపాయిలు చాలా తక్కువ. అతి తక్కువ ఎంపీలు ఉన్న జేడీఎస్ పార్టీ ఆడిగిన వెంటనే కేంద్రం రెండున్నర మెట్రిక్ టన్నుల మామిడిని 16 రూపాయిలు లెక్కన కొనింది. చంద్రబాబు మాత్రం అబద్దాలు చెబుతూ రైతులను ముంచాడు. 1995 సీబీఎన్ అయినా కొద్దోగొప్పో బాగుండేది. ఇప్పుడు సీబీఎన్ మరింత దారుణం తయారు అయ్యాడు. మామిడి రైతుల సమస్యలు తీర్చకుండా వైసీపీ నేతలను తిట్టుకుంటూ కూర్చున్నాడు. చిత్తూరు జిల్లాలో మామిడి రైతుల అల్లాడుతుంటే.. జీడి నెల్లూరు ఎమ్మెల్యే థామస్ మాత్రం పుట్టిన రోజుకు కోట్లు ఖర్చు పెట్టి చేసుకున్నాడు. పక్కన రైతుల ఆత్మహత్య చేసుకుంటూ ఉంటే ఎమ్మెల్యే పుట్టిన రోజు వేడుకలతో హంగామా చేశాడు. మీరు ఎన్ని ఆంక్షల పెట్టినా జగన్ జిల్లాకు వచ్చి మామిడి రైతులను పరామర్శిస్తారని అన్నారు.

# వారసత్వ భూములకు సెక్షన్ సర్టిఫికెట్

**- ప్రతి పేదవాడికి నివాస స్థలం**

**- రెండేళ్లలో స్థలం..మూడేళ్లలో ఇల్లు**

**- జర్నలిస్టులకు స్థలాలపై మంత్రివర్గ కమిటీ**


**- టెక్నాలజీ ద్వారా రెవున్యూ శాఖలో మార్పులు**

**- రెవెన్యూ సమీక్షలో సిఎం చంద్రబాబు**

**- వివరాలు వెల్లడించిన మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడి**

**అమరావతి,జులై 4( వెలుతురు):**

వారసత్వ భూములకు సెక్షన్ సర్టిఫికెట్ ఇవ్వాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. రూ.10లక్షల వరకు విలువైన వారసత్వ భూములకు సచివాలయంలో రూ.100 చెల్లించి సెక్షన్ సర్టిఫికెట్లు పొందే వెసులుబాటు కల్పిస్తున్నట్లు చెప్పారు. రూ. 10లక్షలు దాటిన భూములకు రూ.వెయ్యి చెల్లించి సర్టిఫికెట్ తీసుకోవాలన్నారు. కుల ధ్రువీకరణ పత్రాలను ఆగస్టు 2లోగా మంజూరు చేయాలని అధికారుల్ని సీఎం ఆదేశించారు. మెజార్టీ రెవెన్యూ సమస్యలను అక్టోబరు 2లోగా పరిష్కరించాలని సూచించారు.రెవెన్యూ శాఖపై సమీక్ష సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. హౌసింగ్ ఫర్ ఆల్‌లో భాగంగా ప్రతీ పేదవాడికి నివాస యోగ్యం అయిన ఇళ్లు ఉండాలని నిర్ణయించామని.. రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు. రెండు సంవత్సరాల్లో ఇంటి స్థలం.. మూడు సంవత్సరాల్లో ఇళ్లు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. రెవెన్యూకు సంబంధించి పది అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష చేశారని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఏడాది కాలంగా రెవెన్యూ శాఖ పనితీరుపై సీఎం సమీక్ష చేశారు. సమావేశం అనంతరం మంత్రి అనగాని మీడియాతో మాట్లాడుతూ.. పది లక్షల రూపాయలు వరకూ భూమి విలువ ఉంటే సక్సెన్ సర్టిఫికెట్ కోసం గ్రామ సచివాలయంలోనే 100



రూపాయలు ఫీజు చెల్లించి పొందవచ్చన్నారు. 10 లక్షలపైన విలువ ఉంటే వెయ్యి రూపాయలు ఫీజుగా నిర్ణయించినట్లు తెలిపారు. టెక్నాలజీ ద్వారా రెవెన్యూశాఖలో సమూల మార్పులకు ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం రీ సర్వే చేయకుండానే ఫోటోల పిచ్చితో ఇష్టానుసారం చేశారని ఫైర్ అయ్యారు. 200–250 ఎకరాలకు మించకుండా బ్లాక్ సిష్టం పెట్టి చేశారన్నారు. రీసర్వేపై ప్రతీ మూడు నెలలకు ఒకసారి రివ్యూ చేస్తామన్నారని అన్నారు. ప్రభుత్వం ఇచ్చే పాస్ బుక్ క్యూ ఆర్ కోడ్ అనేది భూమి జీపీఎస్ కూడా చూపుతుందని పేర్కొన్నారు. ఆగస్టు 15న పండగ వాతావరణంలో అందరికీ పాస్ పుస్తకాలు అందిస్తామని ప్రకటించారు. ప్రభుత్వ ప్రైవేటు భూములకు వేర్వేరు రంగులతో మ్యాప్‌లు సిద్ధం చేస్తున్నారని.. అధికారులు ప్రోటోకాల్‌పై ఉండిపోవడంతో అన్ని ఇబ్బందులు వస్తున్నాయన్నారు. మంత్రులు ఎవరు వెళ్లినా ప్రోటోకాల్ రెవెన్యూ శాఖ పర్యవేక్షణలో ఆయా డిపార్టమెంట్ అధికారులే చూస్తారన్నారు. సూపర్ సిక్స్‌లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నామన్నారు. శ్మశానాలకు స్థలాలు ఇవ్వాలని నిర్ణయించినట్లు మంత్రి చెప్పారు.జర్నలిస్టు హౌసింగ్‌కు పేదల హౌసింగ్‌కు ముగ్గురు మంత్రులతో మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేశామని.. మంత్రి వర్గ ఉపసంఘంలో రెవెన్యూ, మున్సిపల్, గృహ నిర్మాణ శాఖామంత్రులు ఉంటారని మంత్రి అనగాని తెలిపారు. ఫ్రీహోల్డ్ భూముల విషయంలో పది అంశాలు పరిగణలోకి తీసుకొని జీవోఎం అనేక మీటింగ్‌లు తీసుకున్నామని.. అక్టోబర్ 2 నాటికి ఈ అంశంపై కచ్చితమైన నిర్ణయం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. నాలుగు లక్షల 63 వేల గ్రీవెన్స్‌లు వస్తే దానిలో 3 లక్షల 90 వేలకు పైగా పరిష్కరించామన్నారు. అభ్యంతరం లేని భూములు విషయంలో జీవో 30 ద్వారా చేస్తున్నామని చెప్పుకొచ్చారు. రెవెన్యూ సదస్సులో తీసుకున్న అర్జీలకు చాలా వరకూ పరిష్కరించామని వెల్లడించారు. గత పాలకులు రెవెన్యూ వ్యవస్థను ఒక ఆర్థిక వనరుగా చూశారని విమర్శించారు. మద్యం తరహాలోనే ఇక్కడి నుంచి వారు, వారు అనునాయులు బాగుపడేలా చేసుకున్నారని మండిపడ్డారు. నెల 9న జరగబోయే కేబినెట్ సమావేశంలో నాలా రద్దు విషయంలో చర్యలు తీసుకుంటామని.. లేని పక్షంలో ఆ తరువాత కేబినెట్‌లో అయినా తెస్తామన్నారు. సర్వే, రిజిష్ట్రేషన్, రెవెన్యూలో బ్లాక్ చెయిన్ టెక్నాలజీ తీసుకువచ్చి తప్పుడు రిజిష్ట్రేషన్లు జరగకుండా చూస్తామని పేర్కొన్నారు. దీన్ని వచ్చే కేబినెట్‌లో తీసుకువచ్చి అమలులోకి తీసుకువస్తామని తెలిపారు. ఈరోజు డిపార్టమెంట్‌లో పోస్టుల గురించి మాట్లాడామన్నారు. అన్ని విషయాలపై చర్చించామన్నారు. సర్వేయర్లను రేషనలైజేషన్ చేస్తున్నారని... అయితే రీసర్వే జరిగే చోట సర్వేయర్లను మార్చేది లేదని తేల్చిచెప్పారు. మేము క్యూఆర్ కోడ్‌తో పాస్ పుస్తాకాలే కాదు ఆధార్‌తో కూడా కలుపుతున్నాం. తెలంగాణలో ధరణి పోర్టల్‌కు ఇక్కడ రెవెన్యూ పని తీరుకు చాలా తేడా ఉంది. మేము ఏం చేసినా పారదర్శకంగా చేస్తున్నాం. అర్బన్ ల్యాండ్ సీలింగ్ కింద జీవో నెంబర్ 84 ప్రకారం 50 శాతం ఫీజు కట్టారు. రెండేళ్లుగా రెగ్యూలరైజ్ చేసేందుకు ఎదురు చూస్తున్నారు. ఇలాంటి కేసులు విజయవాడ, గుంటూరు, తిరుపతి, విశాఖలలో 354 ఉన్నాయి. వాటిపై ఈ నెల 9న జరిగే జీవోఎంలో చర్చించి ముందుకు వెళతాం. పరిష్కారం చూపి న్యాయం చేసేస్తాం' అని మంత్రి అనగాని సత్య ప్రసాద్ పేర్కొన్నారు.


Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com